www.manatelangana.news
Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 271 | శుక్రవారం | 23 మార్చి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

పంచాంగం

శ్రీచాంద్రమాన విళంబినామ సంవత్సరం
ఉత్తరాయణం, వసంత ఋతువు
చైత్ర మాసం
తిథి శుక్ల షష్ఠి ప.12.05 వరకు
తదుపరి సప్తమి
నక్షత్రం రోహిణి సా.5.01 వరకు
తదుపరి మృగశిర
వర్జ్యం ఉ.9.31-11.02 వరకు
తిరిగి రా.10.21-11.53 వరకు
దుర్ముహూర్తం ఉ.8.29-9.17 వరకు
తిరిగి ప.12.30-1.19 వరకు
రాహుకాలం ఉ.10.30-12.00 వరకు
యమగండం ప.3.00-4.30 వరకు
శుభసమయాలు...ప.2.11-1.55 వరకు
క్రయవిక్రయాలు,అగ్రిమెంట్లు,
రిజిస్ట్రేషన్లు. ప్రయాణాలు.

టిఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపు లాంఛనప్రాయమే

నేడే రాజ్యసభ ఎన్నికలు

3



- టిఎఫ్‌టి కార్మికులకు కూడా పింఛన్ సౌకర్యం
- దరఖాస్తు చేసుకున్న 10రోజుల్లోగా సొసైటీల్లో సభ్యత్వం
- లైసెన్స్ రెన్యూవల్ గడువు పదేళ్లకు పెంపు
- శాసనసభలో ముఖ్యమంత్రి కెసిఆర్ వరాల జల్లు
- గీత కార్మిక సంఘాల హర్షం

గీతన్నలకు వరాలు



తాటి, ఈత చెట్లపై పన్ను విధింపు రద్దు

పన్ను బకాయిలు మాఫీ

హైదరాబాద్‌లో గౌడ భవన్

మన తెలంగాణ/హైదరాబాద్ : కల్లుగీత కార్మికులకు అనేక వరాలను ప్రకటించిన ముఖ్యమంత్రి కెసిఆర్ గౌడ కులస్తులకు 'వికాస కేంద్ర'గా పనిచేసే విధంగా 'భవన్'ను నిర్మించుకోడానికి ఐదు ఎకరాల ప్రభుత్వ స్థలంతో పాటు ఐదు కోట్ల రూపాయలను మంజూరు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఇంతకాలం తాటి, ఈత చెట్లపై ప్రభుత్వం విధించిన పన్ను బకాయిలను మాఫీ చేయడంతో పాటు పన్ను విధానాన్ని పూర్తిగా రద్దు చేస్తున్నట్లు తెలిపారు. 'ఆసరా' పింఛన్‌ను ఇప్పటికే వెయ్యి రూపాయలకు పెంచామని తెలిపారు. కల్లుగీత సొసైటీలో సభ్యులుగా ఉన్న కార్మికులకు మాత్రమే కాకుండా టిఎఫ్‌టి (ట్రీ ఫర్ టాపింగ్) కార్మికులకు కూడా పింఛను సౌకర్యాన్ని విస్తరింపజేస్తున్నట్లు తెలిపారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా శాసనసభలో సిఎం కెసిఆర్ గౌడ సామాజికవర్గానికి చెందినవారికి, కల్లుగీత వృత్తిపై ఆధారపడి బతుకుతున్న కుటుంబాలకు లబ్ధి చేకూరే హామీలను ప్రకటించారు. ఇప్పటివరకూ కల్లుగీత సొసైటీల్లో సభ్యులు కానివారు ఇకపైన సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకుంటే పది రోజుల్లోగా ఇచ్చేలా అధికారులను ఆదేశించారు. తాటి చెట్లకు ఇప్పటివరకూ వున్న ఐదేళ్ళ లైసెన్సు రెన్యూవల్ గడువును పదేళ్ళకు పెంచుతున్నట్లు తెలిపారు. ఈ కొత్త వరాల వల్ల ప్రభుత్వానికి ఆర్థికంగా భారం పడినప్పటికీ మానవీయ దృక్పథంతో కార్మి కుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

సమైక్య పాలనలో గీత కార్మికులకు అన్యాయం : గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేయడం కోసం ప్రభుత్వం వ్యవసాయ అభివృద్ధి, నీటి వనరుల అభివృద్ధి, కులవృత్తులకు ప్రోత్సాహం లాంటి ఎన్నో కార్యక్రమాలను చేపట్టిందని, వీటిపై ఆధారపడుతున్న కుటుంబాలను ఆర్థికంగా మెరుగపర్చడం కోసం పలు పథకాలను ప్రవేశపెట్టి అమలుచేస్తోందని, అందులో భాగమే కులవృత్తిని నమ్ముకుని జీవిస్తున్నవారి ఆదాయ వనరులను పెంచేందుకు తీసుకుంటున్న ఈ చర్యలని కెసిఆర్ వ్యాఖ్యానించారు. కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న గౌడ కులస్తులకు సమైక్య రాష్ట్రంలో అన్యాయం జరగడమే కాక ఆలనాపాలనా కరువైందని, ప్రభుత్వ నిర్లక్ష్యంతో వారి మనుగడే ప్రశ్నార్థకమైందని, రాష్ట్రం ఏర్పడిన తర్వాత దిద్దుబాటు చర్యలు ప్రారంభమయ్యాయని తెలిపారు. కులవృత్తిని నమ్ముకుని జీవిస్తున్నవారిలో గౌడ సామాజిక వర్గం ప్రధానమైనదని, సమైక్య రాష్ట్రంలో నిరాదరణకు, నిర్లక్ష్యానికి గురైనందున తెలంగాణ ఏర్పడిన వెంటనే ప్రభుత్వం మానవీయ దృక్పథంతో పలు సంక్షేమ కార్యక్రమాలను అమలుచేస్తోందని వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో కల్లుగీత కార్మికులు ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి పడి మరణించడమో, అంగవైకల్యం పొందడమో జరిగితే పరిహారం చెల్లించడంలో అప్పటి ప్రభుత్వం జాప్యం చేసిందని, తెలంగాణ ప్రభుత్వం మాత్రం మూడేళ్ళ బకాయిలను (రూ. 6.38 కోట్లు) ఒకే మొత్తంలో చెల్లించిందని గుర్తుచేశారు. ఉమ్మడి తరువాయి 6లో

టోటెం టోకరా

రూ.1394కోట్లు ఎగవేత

- హైదరాబాద్ ఆఫీసుల్లో సిబిఐ సోదాలు
- కీలక పత్రాలు స్వాధీనం

TOTEM
Passion to Deliver

న్యూఢిల్లీ:హైదరాబాద్‌కు చెందిన టోటెం కన్‌స్ట్రక్షన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీపై సిబిఐ కేసు నమోదు చేసింది. ఈ సంస్థ ఎనిమిది బ్యాంకుల నుంచి మొత్తం రూ 1,394 కోట్ల మేర రుణాలు పొంది వాటిని దుర్వినియోగపర్చిందని కేసు దాఖలు అయినట్లు అధికారవర్గాలు తెలిపాయి. పలు ప్రధాన నిర్మాణ సంస్థలకు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థలకు అనుబంధ సంస్థగా, సబ్ కాంట్రాక్టర్‌గా ఉన్న టోటెం, ఆ సంస్థ ప్రమోటర్లు తొట్టెంపూడి సలలిత్, తొట్టెంపూడి కవితలపై సిబిఐ ఎఫ్‌ఐఆర్ దాఖలు చేసింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దాఖలు అయిందని, రుణాలు ఇచ్చిన ఎనిమిది బ్యాం కులలో ఈ బ్యాంకు నుంచి అత్యధికంగా రుణాలు తీసుకుందని వెల్లడైంది.ఈ బ్యాంక్ నుంచే రూ 313 కోట్ల మేర రుణాల మోసం జరిగిందని ఫిర్యాదులో తెలిపారు. ఈ సంస్థ దాదాపు రూ 400 కోట్ల మేర ఆదాయపు పన్ను చెల్లించాల్సి ఉందని పేర్కొం టూ 2015లో ఐటి వారు వెలువరించిన పన్నుల ఎగవేతదార్ల జాబితాలో తెలిపారు. ఈ కంపెనీనే ఎగవేతల జాబితాలో ముందుంది. ఈ కంపెనీ యాజమానులు ఈ జాబితాలోని ఇతరులు కనబడుట లేదని , వారి గురించి తెలియచేసిన వారికి రూ 15 తరువాయి 6లో

దటీజ్ కెసిఆర్

అన్నదాతల ఆత్మహత్యలు భారీగా తగ్గాయి

ముఖ్యమంత్రి తీసుకున్న పలు సానుకూల చర్యలే కారణమని పార్లమెంట్‌లో కేంద్రం విస్పష్ట ప్రకటన

- 2015లో1400 మంది ఆత్మహత్యలకు పాల్పడగా, 2016లో ఆ సంఖ్య 645కు పడిపోయింది,
- రైతుల, సాగు కార్మికుల ఆత్మహత్యలు తగ్గిన రాష్ట్రాల్లో మనదే ప్రథమ స్థానం
- పెరిగిన రాష్ట్రాల్లో మహారాష్ట్ర, కర్నాటక
- పార్లమెంట్‌లో కేంద్రమంత్రి రాధామోహన్‌సింగ్ వెల్లడి

న్యూఢిల్లీ: ముఖ్యమంత్రి కెసిఆర్ సారథ్యంలో తెలంగాణ ప్రభు త్వం రైతులకు మేలు చేసే ఎన్నో వ్యవసాయానుకూల నిర్ణయాలు తీసుకుంటున్న కారణంగా తెలంగాణ రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు భారీగా తగ్గుముఖం పడుతున్నాయి . కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి రాధా మోహన్ సింగ్ పార్లమెంట్ లో వెల్లడించిన వివరాల ప్రకారం 2015 లో తెలంగాణాలో 1400 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటే 2016 లో ఆ సంఖ్య 645 కు పడిపోయింది . అంటే ఇది 53 .9 % తగ్గుదల . రైతుల ఆత్మహత్యలు భారీగా తగ్గిన రాష్ట్రాల్లో తెలంగాణ ప్రథమ స్థానంలో ఉంది . రైతుల ఆత్మహత్యలు భారీగా పెరిగిన రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉన్న మహారాష్ట్ర, కాంగ్రెస్‌పాలిత కర్ణాటక ఉన్నాయి.మహారాష్ట్రలో 2015 లో 1491 మంది రైతులు ఆత్మహత్య చేసుకోగా 2016 లో ఆ సంఖ్య 3661 కి పెరిగింది.ఇది 145.4 % ఎక్కువ. ఇక కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటకలో 2015 లో 1569 ఉంటే 2016 లో ఆ సంఖ్య 2079 కి పెరిగింది. ఇది32.5%ఎక్కువ . ఇక వ్యవసాయ కార్మికుల ఆత్మహత్యల విషయంలోనూ తెలంగాణ లో భారీ తగ్గుదల ఉంది. 2014లో 449 మంది వ్యవసాయ కార్మికులు ఆత్మహత్య చేసుకుంటే ఆసంఖ్య 2015లో42కు, 2016 లో 13కు తగ్గిపోయింది. తెలంగాణలో రైతులు, వ్యవసాయకార్మికుల ఆత్మహత్యలు భారీగా తగ్గుముఖం పడుతుండడానికి ప్రధాన కారణం సిఎం కెసిఆర్ రైతుల కష్టాలు, వాళ్ళ సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఎన్నో అద్భుతమైన కార్యక్రమాలకు అంకురార్పణ చేయడమే. లక్ష కోట్ల తో సాగు నీటి ప్రాజెక్టులు చేపట్టడం, ఏటా 5 వేల కోట్లతో 24 గంటల ఉచిత విద్యుత్ అందించడం, ఈ ఏడాది రైతులకు ఎకరానికి రూ .8 వేల పంట పెట్టుబడి అందించడానికి ఈ బడ్జెట్ లోనే రూ. 12000 కోట్లు కేటాయించడం, ఇంకా మార్కెట్ గోడౌన్ల నిర్మాణాన్ని రూ.1000 కోట్లతో చేపట్టడం , డ్రిప్ ఇరిగేషన్ సదుపాయానికి 75 నుండి 90 శాతం వరకు సబ్సిడీ ఇవ్వడం , పాలీ హౌజ్ సబ్సిడీ , సమయానికి ఎరువులు , విత్తనాలు సరఫరా చేయడం వంటి అనేక విప్లవాత్మక చర్యలు తీసుకోవడంతో పాటు ఆసరా , తరువాయి 6లో

కుంచెపోటు



విదేశాల నుంచి నల్లధనం రావటమే ముఖ్యం, ఎవరికొస్తే ఏంటీ..?

ఆయుష్మాన్ భారత్ రెడీ

- పది కోట్ల కుటుంబాలకు మేలు చేసే పథకానికి కేంద్రం ఆమోదం
- అమలుకు ఎబిఎంహెచ్‌పిఎం



న్యూఢిల్లీ: జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకం' ఆయుష్మాన్ భారత్'కు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ పథకం మేరకు దేశవ్యాప్తంగా పది కోట్లకు పైగా కుటుంబాలకు ఏటా రూ ఐదు లక్షల మేర ఆరోగ్య సాయం (కవరేజ్) అందుతుంది. సంక్షిప్తంగా ఎబి అని పిలుచుకోదగ్గ ఈ పథకం సమాజంలోని పేదలు, అణగారిన వర్గాలకు ఈ ఆరోగ్య పథకం వర్తిస్తుంది. గురువారం కేంద్ర మంత్రి మండలి ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగింది. ఇందులో ఆయుష్మాన్ భారత్ పథకానికి తరువాయి 6లో



బిజెపికి నాగం రాజీనామా

మన తెలంగాణ/నాగర్‌కర్నూల్ టౌన్: ప్రజల అభిష్టం మేరకే బిజెపికి రాజీనామా చేస్తున్నానని, రాజీనామా లేఖను బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాకు ఫ్యాక్స్ ద్వారా పంపానని నాగం జనార్ధన్‌రెడ్డి తెలిపారు. గురువారం నాగర్‌కర్నూల్‌లోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 35 ఏళ్లుగా మచ్చలేని నాయకునిగా నియోజకవర్గానికి సేవ లు చేశానని, ప్రజలు కట్టిన పట్టంతో ఎంఎల్‌ఏగా, మంత్రిగా పలుసార్లు పదవులు చేపట్టానని నాగం అన్నారు. పోరాడి తరువాయి 6లో

నాకు సంబంధం లేదు

- మేడ్చల్ జిల్లా యాద్గార్‌పల్లి భూటోపీ ఆరోపణలు ఎదుర్కొంటున్న వారితో బంధుత్వం, స్నేహం లేదు
- అటువంటి వారిపై తగిన చర్యలు తీసుకుంటాం
- మన తెలంగాణ వార్తపై డిజిపి మహేందర్‌రెడ్డి వివరణ



మన తెలంగాణ/కీసర : మేడ్చల్ జిల్లా కీసర మండలం యాద్గార్‌పల్లిలో డిజిపి అనుచరులమంటూ బెదిరించి భూ కబ్జాకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారితో తనకు ఎలాంటి బంధుత్వం లేదని డిజిపి మహేందర్‌రెడ్డి చెప్పారు. గురువారం 'మన తెలంగాణ'లో ప్రచురితమైన 'డిజిపి పేరు చెప్పి భూటోపి!' వార్తకు ఆయన స్పందించారు. సెక్రటేరియట్ ఉద్యోగినంటూ తన వద్దకు వచ్చిన శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తి భూ దస్తావేజులు చూపి న్యాయం చేయాలని కోరడంతో చట్ట ప్రకారం న్యాయ సహాయం చేయాలని తాను స్థానిక పోలీసులకు సూచించినట్లు వివరించారు. వారితో తనకు బంధుత్వం కాని, స్నేహం కాని లేదన్నారు. ఉన్నత పదవులలో ఉన్న వ్యక్తుల పేరు చెప్పి బెదిరింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గ్రూప్-2 ఓఎంఆర్ షీట్ల పరిశీలన పూర్తి



మన తెలంగాణ/ హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించిన గ్రూప్2 పరీక్షల్లో టాప్‌లోని తొలి ఐదు వేల మంది అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లను న్యాయవాదుల కమిటీ పరిశీలన పూర్తి అయింది. సీనియర్ లాయర్ల కమిటీ పరిశీలన అనంతరం నివేదికకు హైకోర్టుకు అందజేశారు. గ్రూప్2 నోటిఫికేషన్‌లో వైటనర్ వినియోగించరాదని, కొట్టివేతలు ఉండరాదని, జిబ్లింగ్‌లో తప్పు చేసిన, వివరాల నమోదులో తప్పు చేసిన వారిని కూడా అర్హులుగా ప్రకటించారంటూ హైదరాబాద్‌కు చెందిన రామచంద్రారెడ్డి, పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై గ్రూప్2 పరీక్షల్లో టాప్‌లో నిలిచిన మొదటి అయిదు వేల మంది అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లను పరిశీలించే నిమిత్తం హైకోర్టు న్యాయమూర్తి నవీన్‌రావు సీనియర్ లాయర్ల కమిటీని గతంలో ఏర్పాటు చేసిన విషయం విదితమే. సీనియర్ లాయర్లు ఎస్.నిరంజన్‌రెడ్డి, శ్రీరఘురాం, రఘునందన్‌రావులతో ఏర్పాటైన కమిటీ గురువారం హైకోర్టుకు నివేదికను సీల్డు కవర్‌లో అందజేసింది.పిటిషనర్ల వ్యాజ్యాల తర్వాత ఫలితాల్ని నిలిపివేయవద్దని, వైట్‌నర్ వాడింది తక్కువ మంది అభ్యర్థులే ఉన్నారని, వారందరి కోసం మొత్తం ఫలితాల్ని ఆపరాదంటూ కూడా వ్యాజ్యాలు దాఖలయ్యాయి. సీనియర్ లాయర్ల నివేదికపై హైకోర్టు న్యాయమూర్తి నవీన్‌రావు శుక్రవారం విచారించే అవకాశముంది.

గౌడ సామాజిక ఆకాంక్షలను నెరవేర్చిన నేత కెసిఆర్ : బూర నర్సయ్యగౌడ్

మన తెలంగాణ/హైదరాబాద్: గౌడ సామాజిక వర్గ ఆకాంక్షలను నెరవేర్చిన నేత సిఎం కెసిఆర్ అని టిఆర్‌ఎస్ ఎంపి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. మరణి ంచిన, శాశ్వత అంగవైకల్యం పొందిన గీతకార్మికులకు పరిహారం చెల్లించడంలో గత ప్రభుత్వాలు తీవ్ర జాప్యం చేసిందని, రాష్ట్రం ఏర్పడేనాటికి రూ.6.38 కోట్లు బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిఎం కెసిఆర్ గీత కార్మికులకు ఉన్న చెట్ల పన్ను బకాయిలను మాఫీ చేయడంతో పాటు చెట్లపైన పన్ను విధానాన్ని రద్దు చేసినందుకు ఆయన సిఎం కెసిఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కెసిఆర్ కిట్ పథకం ఓ విజన్

❑ సిఎం కెసిఆర్ ముందుచూపుకు నిదర్శనం ❑ వైద్య సేవలు మరింత మెరుగు ❑ శాసనమండలిలో మంత్రి లక్ష్మారెడ్డి





మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'కెసిఆర్ కిట్' పథకం ఒక విజన్ లాంటిదని, ఆయన ముందుచూపుకు నిదర్శనమని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి అన్నారు. ఇప్పటి వరకూ పాలకులంతా ఓటుబ్యాంకు లక్ష్యంగా పథకాలను ప్రవేశపెట్టారని, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత మానవీయ కోణంలో రూపొందించినట్లు చెప్పారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా 'ఆరోగ్య తెలంగాణ' సాధనకు చర్యలు చేపట్టిందని, ఇందుకు కెసిఆర్ కిట్ పథకమే ప్రత్యక్ష నిదర్శనమన్నారు. శాసనమండలిలో గురువారం ఈ అంశంపై జరిగిన లఘుచర్చ బిజెపి శాసనసభపక్ష నేత రాచందర్‌రావు, ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎంఎల్‌లు కాటేపల్లి జనార్ధన్‌రెడ్డి, పబావత్ రాములు నాయక్, ఎలిమినేటి కృష్ణారెడ్డి, ఫరూక్‌హుస్సేన్, తదితరులు ప్రసంగించారు. పథకం లక్ష్యాన్ని, సాధించిన ప్రగతిని మంత్రి సభకు వివరించారు. గర్భిణీల ఆత్మగౌరవాన్ని పెంపొందించడం, అనవసరపు అపరేషన్లను తగ్గించడం, సాధ్యమైనంత వరకు సహజ ప్రసవాలతో పాటు శిశువులకు వంద శాతం టీకాలు వేయడమే ధ్యేయంగా ఈ పథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. అనతి కాలంలోనే ఈ పథకం అత్యంత జనాదరణతో కొనసాగుతుందన్నారు. పథకం ప్రారంభమైన తర్వాత ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు 55 శాతం పెరిగాయన్నారు. ఆరోగ్య, వైద్య సూచికలో మాతా, శిశు మరణాలు కూడా గణనీయంగా తగ్గాయని, ఇప్పటివరకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో 1,96,702 ప్రసవాలు జరిగితే ఇందులో 1,05,888 సహజ ప్రసవాలేనని తెలిపారు. 4.60లక్షల మంది గర్భిణీల పేర్లు నమోదైనట్లు తెలిపారు. ఆడ శిశువుకు రూ.13వేలు, మగ శిశువుకు రూ.12వేల చొప్పున మొత్తం రూ.201.37 కోట్ల పంపిణీ జరిగిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కేవలం 30 శాతం ప్రసవాలు మాత్రమే ప్రభుత్వ దవాఖానాల్లో జరిగేవన్నారు. గర్భిణీల్లో రక్తహీనత, మాతా శిశు మరణాలను దృష్టిలో పెట్టుకుని గర్భధారణ సమయం నుంచే ప్రభుత్వ సేవలను ప్రారంభించి ప్రసవం తర్వాత కూడా అందిస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసమే ఈ పథకానికి రూ. 605 కోట్లను బడ్జెట్‌లో కేటాయించినట్లు చెప్పారు. ప్రభుత్వ దవాఖానాల్లో మాతా మరణాల రేటు 92% నుంచి 70%కి, శిశు మరణాలు రేటు 31 శాతానికి తగ్గిందని చెప్పారు.

వైద్య సేవల పెంపునకు చర్యలు

రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో పెరుగుతున్న రద్దీని తట్టుకోవడానికి అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రస్తుతమున్న ఆసుప్రతుల్లో 24 గంటల పాటు సేవలందించడానికి ఉన్న అవకాశాలను గుర్తించడం, అందుకు తగిన రీతిలో తీర్చిదిద్దే చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే కొత్తగా 15 మాతా శిశు వైద్యశాలలను, జిల్లా, బోధన ఆసుప్రతుల్లో పడకల సంఖ్యను పెంచడం, కొత్తగా 104 అల్ట్రాసౌండ్ మిషన్లను సమకూర్చడం చేస్తున్నట్లు చెప్పారు. మానవ వనరులకు అవసరమైన అనుమతులు తీసుకొని 5 వేల పోస్టులకు నియామకాలను చేపట్టామన్నారు. సిబ్బందికి ప్రత్యేక శిక్షణిస్తున్నామన్నారు. ప్రసవాలు అధికంగా చేస్తున్న వారికి ప్రోత్సాహం కింద రెండు వేలను అదనంగా ఒక్కో ప్రసవానికిస్తున్నట్లు చెప్పారు. సహజ ప్రసవాల పెంపుకోసం మిడ్ వైఫరీ క్యాడర్‌ను పెంచుతూ వారికి తగిన శిక్షణిస్తున్నామని చెప్పారు. పేట్లబురుజు, నిలోఫర్, సుల్తాన్‌బజార్ ఆసుప్రతుల్లో ఎంఐసియూ యూనిట్లను కూడా ఏర్పాటు చేశామని మంత్రి వివరించారు.

ఏజెన్సీలకూ కెసిఆర్ కిట్ అమలు చేయండి

మన తెలంగాణ / హైదరాబాద్ : కెసిఆర్ కిట్ పథకాన్ని ఏజెన్సీ ప్రాంతాల్లోనూ అమలయ్యేలా చూడాలని శాసన మండలిలో బిజెపి పక్షనేత రాంచందర్‌రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శాసనమండలిలో గురువారం కెసిఆర్ కిట్ పథకంపై జరిగిన లఘు చర్చ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో డాక్టర్లు అందుబాటులోలేక మహిళలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, గిరిజనులు అధికంగా ఉండే జిల్లాల్లో ఈ పథకం అమలు తీరు సరిగా లేదఅన్నారు. ఆర్థికంగా తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళలకు ఈ పథకం ఉపయోగకరంగా ఉంటున్నా గిరిజన జిల్లాలైన ఆదిలాబాద్, భూపాలపల్లి తదితర చోట్ల మాత్రం పగడ్బందీగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనివల్ల గిరిజనులకు మంచి జరుగుతుందని అన్నారు.

ఆర్‌ఎంపిలపై నిఘా పెట్టాలి: ఫరూక్ హుస్సేన్

కెసిఆర్ కిట్ పథకానికి కొందరు దూరంగా ఉండడానికి ఆర్‌ఎంపిలే కారణమవుతున్నారని ఎమ్మెల్సీ ఫరూక్‌హుస్సేన్ ఆరోపించారు. ప్రైవేటు ఆసుప్రతులు ఇచ్చే డబ్బుకు ఆశపడి పలువురు ఆర్‌ఎంపిలు గర్భిణీలను ప్రభుత్వ దవాఖానాలకు కాకుండా ప్రైవేటు ఆసుప్రతులకు పంపిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఆర్‌ఎంపిలపై నిఘా పెట్టాల్సి ఉందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు ఆసుప్రతులను ఆశ్రయిస్తే లక్షలకు లక్షలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రైవేటు ఆసుప్రతులపై కూడా ప్రభుత్వం నిఘా పెట్టాల్సిన అవసరముందన్నారు.

సామాజిక సంబంధాలు మెరుగు: పల్లా

కేసీఆర్ కిట్ పథకం వల్ల సామాజిక సంబంధాలు కూడా మెరుగుపడుతున్నాయని శాసనమండలిలో ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. సాధారణంగా మొదటి కాన్పు తల్లిగారింటి వద్ద చేస్తారని, కానీ ఈ పథకం అమలుతో ఎక్కడైనా ఫర్వాలేదనే భావన కలుగుతోందన్నారు. ఆర్థిక సమస్యలే ఇందుకు కీలక పాత్రను పోషించాయని తెలిపారు. అయితే ప్రస్తుతం అత్తా, కొడలు మధ్య సంబంధాలు కూడా బలపడుతున్నాయని తెలిపారు.

నిబంధనలు పాటించని ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకుంటాం

మన తెలంగాణ / హైదరాబాద్ : నిబంధనలు పాటించని ఆసుపత్రులు,నకిలీ వైద్యుల మీద కఠిన చర్యలు తీసుకుంటామని వారు ఎంత పెద్ద వారయినా వదిలి పెట్టే ప్రసక్తి లేదని వైద్యఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి హెచ్చరించారు. శాసన మండలిలో గురువారం జరిగిన ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో భాగంగా సభ్యులు ఎంఎస్.ప్రభాకరరావు,పురాణం సతీష్ మాదిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పూల రవీందర్‌లు నకిలీ వైద్యులు,నిబంధనలు పాటించిన ఆసుపత్రుల మీద తీసుకున్న చర్యలు ఏమిటి అన్న ప్రశ్నకు ఆయన సమాధానం చెప్పారు. రాష్ట్రంలో మెడికల్ ప్రాక్టీషనర్ చట్టంలోని సెక్షన్ 20 ద్వారా రిజిస్టర్ మెడికల్ ప్రాక్టీషనర్స్ మాత్రమే వైద్యం చేయడానికి అర్హులని, దీన్ని ఉల్లంఘించిన సెక్షన్ 22 కింద శిక్షార్హులన్నారు. మెడికల్ ప్రాక్టీషనరీ రిజిస్ట్రేషన్ ఎంసిఐ, డిసిఐ, ఆయుష్ కౌన్సిళ్ళకు లోబడి జరుగుతుందన్నారు. రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్స్, ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్స్‌లను కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వ చట్టాలు కేవలం కమ్యూనిటీ పారామెడిక్‌గా మాత్రమే గుర్తించినట్లు చెప్పారు అర్హతలు లేకుండా మెడికల్ ప్రాక్టీస్ చేస్తున్న వారిపై, ఆసుపత్రులపై క్రిమినల్ కేసులు పెట్టేందుకు తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌కు అధికారం ఉందని పేర్కొన్నారు. డాక్టర్ ఇష్రతుల్లా ఖాన్ ఎంబిబిఎస్ వైద్యుడు అక్రమంగా ఛాన్ హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ క్లినిక్‌ను నడుపుతున్నట్లుగా గుర్తించి అతని రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ రెండు సంవత్సరాల పాటు అతని రిజిస్ట్రేషన్‌ను సస్పెండ్ చేస్తూ శిక్ష విధించిందన్నారు.

డిగ్రీ గెస్ట్ ఫ్యాకల్టీ వేతనం పెంపు

మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రభుత్వ డిగ్రీ కళాశాలల గెస్ట్ ఫ్యాకల్టీ వేతనం పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ లెక్చరర్లకు ఇచ్చే వేతనాన్ని గంటకు రూ.100 నుంచి రూ.300 పెంచుతున్నట్లు విద్యాశాఖ స్పెషల్ సిఎస్ రంజీవ్ ఆర్ ఆచార్య ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నెలకు గరిష్టంగా 72 గంటలకు, రూ.21,600 ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ పెంపు వల్ల 184 మంది గెస్ట్ ఫ్యాకల్టీ లబ్ధి పొందనున్నారు.

దాతలు ముందుకొస్తే రైతు బజార్లు నిర్మిస్తాం

కొన్ని ప్రాంతాల్లో స్థలం కరువు : హరీశ్‌రావు



మన తెలంగాణ / హైదరాబాద్ : అందరికీ అందుబాటులో ఉండే చోట స్థలం ఇచ్చేందుకు ఎవరైనా దాతలు ముందుకు వస్తే రైతు బజార్లను నిర్మించి ఇస్తామని మార్కెటింగ్ శాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. రైతు బజార్లకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్గాల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని, కాని స్థలం అందుబాటులో లేని కారణం వాటిని ఏర్పాటు చేయలేక పోతున్నామన్నారు. కొన్ని ప్రాంతాల్లో స్థలం అందుబాటులో ఉన్నా అవి ఊరికి దూరంగా, ఇటు రైతులకు ,అటు వినియోగదారులకు అందుబాటులో లేకుండా ఉన్నాయని, దాంతో వాటిని ఏర్పాటు చేయడం కష్టంగా ఉందన్నారు. రైతు బజార్లు సాధారణంగా బస్టాండ్‌కు సమీపంలో కాని, టౌన్ మధ్యలో కాని ఉంటే అన్ని వర్గాలకు ప్రయోజనం ఉంటుందన్నారు. సిద్ధిపేటలో మాదిరిగా రాష్ట్రంలో ఇతర ప్రాంతాల్లో కూడా మోడల్ రైతు బజార్ల నిర్మాణంపై సభ్యులు పాతూరి సుధాకర్ రెడ్డి, ఫరూక్ హుస్సేన్, భూపాల్ రెడ్డి శాసన మండలిలో ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో భాగంగా ఆయన పై విధంగా సమాధానం చెప్పారు. సిద్దిపేట మూడు అంతస్తుల భవనంలో ఆధునిక సదుపాయలతో రైతు బజార్‌ను ఏర్పాటు చేశామన్నారు. సిద్దిపేటలోనే కాకుండా మహబూబ్‌నగర్, భువనగిరి, చేరియాల, జోగిపేట, సిరిసిల్ల, మెదక్, జమ్మికుంట, హుజూరాబాద్ మొదలు పట్టణాల్లో వీటి నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. రైతులు తమ కూరగాయలను కింద పెట్టుకోవడంతో అనేక రకాల క్రిమికీటకాలు వచ్చి చేరుతున్నాయని దాంతో అవి త్వరగా పాడవతున్నయన్నారు. వీటి పరిష్కారం కోసం భూమికి మూడు అడుగుల ఎత్తులో అరుగులు నిర్మాణం చేట్టి తద్వారా రైతులు కూరగాయలు పాడవ్వకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అదే విధంగా గోదాములు సామర్థ్యాన్ని పెంచేందుకు తీసుకుంటున్న చర్యలపై సభ్యులు ప్రశ్నించగా రాష్ట్రం ఏర్పడిన అనంతరం గోదాంల సామర్థ్యం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని వాటిలో రూ.1024.50 కోట్ల వ్యయంతో 18.30 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల 364 గాదాములు నిర్మించామని వీటికి రూ. 818.14 కోట్ల నిధులను ఖర్చు చేసినట్లు చెప్పారు.

'పౌరసరఫరాల' ప్రాజెక్టులు దేశానికి ఆదర్శం



మన తెలంగాణ/హైదరాబాద్ : పౌరసరఫరాల శాఖ చేపట్టిన ఐటి ఆధారిత సేవలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని ఆ శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. 2017–18 రబీ కార్యాచరణపై గురువారం కమిషనర్ సి.వి.ఆనంద్‌తో కలిసి మంత్రి జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'ఇ–పాస్' నెట్‌వర్క్ సమస్యలు, రేషన్ పోర్టబిలిటి, గోదాముల్లో సిసి కెమెరాల పనితీరు పరిశీలన, కిరోసిన్ బకాయిల వసూలు, దీపం కనెక్షన్లు తదితర అంశాలపై చర్చించారు. గత ఏడాది రబీలో ఎన్నడూ లేనివిధంగా పౌరసరఫరాల శాఖ రైతుల నుంచి కనీస మద్దతు ధరకు 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రికార్డ్ సృష్టించిందన్నారు. ఈ రబీలో కూడా పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పౌరసరఫరాల శాఖ కమిషనర్ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ, ఈ ఏడాది ఖరీఫ్‌లో 18 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, ఈ రబీలో 36 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గోనె సంచుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్లను ఆదేశించారు. గతంలో ఐటి ప్రాజెక్టుల అమలులో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ 24వ స్థానంలో ఉండగా, ప్రస్తుతం మొదటి స్థానానికి చేరిందని చెప్పారు. తెలంగాణ చేపట్టిన ఐటి ఆధారిత సేవలను ఇప్పటివరకు 12 రాష్ట్రాల అధికారులు అధ్యయనం చేశారని పేర్కొన్నారు. రాష్ట్రంలో 23 లక్షల మంది ఆహార భద్రత కార్డుదారులకు ఎల్‌పిజి గ్యాస్ కనెక్షన్లు లేవని, త్వరితగతిన వీరికి 'దీపం' పథకం కింద ఎల్‌పిజి కనెక్షన్లు మంజూరు చేయాలని సూచించారు. ఈ విషయంలో జెసిలు మరింత దృష్టి సారించాలని కమిషనర్ అన్నారు.

రైతులక్ష్మి కాదు.. 'రైతు బంధు'

సాగుపనులకంటే ముందే చెక్కుల పంపిణీ

ప్రతి ఎకరం భూమికీ ఆర్థిక సాయం

బ్యాంకర్లతో వ్యవసాయ కార్యదర్శి సమీక్ష



మన తెలంగాణ / హైదరాబాద్ : వచ్చే నెల నుంచి అమల్లోకి రానున్న 'సాగుకు పెట్టుబడి సాయం'పై బ్యాంకు అధికారులతో వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి గురువారం సమీక్ష నిర్వహించారు. చెక్కుల పంపిణీలో క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సాధకబాధకాలు, సాంకేతిక సమస్యలపై వ్యవసాయ శాఖ అధికారులు, ఎన్‌ఐసి (నేషనల్ ఇన్ఫర్మేటిక్స్) నిపుణులు, ఆర్థిక శాఖ అధికారులతో పాటు ఏడు బ్యాంకులకు చెందిన అధికారులతో లోతుగా చర్చించారు. తొలుత ఈ పథకం పేరును 'రైతులక్ష్మి'గా నిర్ణయించినప్పటికీ ముఖ్యమంత్రి కెసిఆర్ సూచనల మేరకు 'రైతుబంధు'గా మారిందని తెలిపారు. వానాకాలం సాగు పనులు ప్రారంభం కావడానికి ముందే చెక్కుల పంపిణీ ప్రక్రియ పూర్తికావాలని బ్యాంకర్లను ఆదేశించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో పహాణీలో ఉన్న అంశాలన్నీ ఇప్పుడు భూ రికార్డుల్లో సమగ్రంగా పొందుపరిచామని, ప్రతి ఎకరం భూమికి ఈ పథకం ద్వారా రైతులకు ఆర్థిక సాయం అందుతుందని తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తి పెంపొందాలనే ముఖ్యమంత్రి లక్ష్యం మేరకు ఎక్కడా పొరపాట్లకు ఆస్కారం లేకుండా పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు పార్థసారధి తెలిపారు. భూ రికార్డుల ప్రక్షాళన అనంతరం భూముల వివరాలు, గణాంకాలన్నీ రెవిన్యూశాఖ దగ్గర అందుబాటులో ఉన్నాయని, దీన్ని వెబ్‌సైట్‌లోకి ఎక్కిస్తున్నారని, తాసీల్దార్ల సంతకాల అనంతరం వాటిని ఎన్‌ఐసి నిపుణులు కంప్యూటర్‌లోకి ఎక్కిస్తున్నారని తెలిపారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో తీసుకున్న నిర్ణయంమేరకు మండలస్థాయి నోడల్ బ్యాంకు ద్వారానే చెక్కుల పంపిణీ జరుగుతుందని, వ్యవసాయ శాఖతో పాటు రెవిన్యూ శాఖ, బ్యాంకు అధికారులు, ఎన్‌ఐసి విభాగం సవాలుగా తీసుకుని సమన్వయంతో దీన్ని విజయవంతం చేయాలని స్పష్టం చేశారు. సాగు పనులు ప్రారంభం కావడానికి ముందే చెక్కుల పంపిణీ పూర్తిస్థాయిలో ముగించాలని భావిస్తున్నామని, గ్రామాల పేర్ల అక్షర క్రమంలో పంపిణీ ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం స్థిరీకరించిన వివరాల ప్రకారం రాష్ట్రం మొత్తంమీద 60 లక్షలకుపైగా రైతుల భూఖాతాలు ఉన్నట్లు తేలిందని, కొన్ని చోట్ల ఒకే రైతులకు వివిధ గ్రామాల్లో రెండుకన్నా ఎక్కువ పాస్ బుక్‌లు ఉండే అవకాశాలపై ఈ సమావేశంలో చర్చించామని, ఇలాంటి సందర్భాల్లో బ్యాంకులు ఏ గ్రామం నుంచి చెక్కులు అందిస్తే అక్కడి నుంచే రైతులు తీసుకునేలా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. బ్యాంకు అధికారులు ప్రస్తావించిన సమస్యలను దృష్టిలో పెట్టుకుని క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జిల్లా కలెక్టర్ నేతృత్వంలో రెవిన్యూ శాఖ అధికారుల సహకారంతో కచ్చితమైన పద్ధతిలో చెక్కుల పంపిణీని పూర్తిచేయాలనుకుంటున్నట్లు తెలిపారు. చెక్కు పైన లబ్ధిదారుని పేరు, పట్టాదారు పాస్‌బుక్ నెంబర్ (12 అంకెల యూనిక్ కోడ్), రెవిన్యూ గ్రామం పేరుతో పాటు అందిస్తున్న నగదు వివరాలు ఉంటాయని తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ కమిషనర్ జగన్‌మోహన్, ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి సాయిప్రసాద్‌లతో పాటు ఇండియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, కార్పొరేషన్ బ్యాంకు, సిండికేట్ బ్యాంకు, కెనరాబ్యాంకు, భారతీయ స్టేట్ బాయంకు, ఆంధ్రా బ్యాంకు ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

కరెన్సీ నోట్ల కొరత వాస్తవమే

శాసన మండలిలో ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్

మన తెలంగాణ/ హైదరాబాద్ : పెద్ద నోట్లు రద్దు చేసిన తర్వాత రాష్ట్రంలో కరెన్సీ కొరత ఉందని, ఈ విషయాన్ని రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ కూడా నిర్ధారించిందని ఆర్థిక ,ప్రణాళికా శాఖ మంత్రి ఈటెల రాజేందర్ అన్నారు. రాష్ట్రంలో ఎటిఎంలు,బ్యాంక్ బ్రాంచ్‌లలో కరెన్సీ నోట్ల తీవ్ర కొరతపై శాసన మండలిలో ప్రశ్నోత్తరాల సందర్భంగా సభ్యులు సయ్యద్ అమీనుల్ హసన్ జాఫ్రీ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం చెప్పారు. కరెన్సీ కొరతకు ప్రధాన కారణం ఆర్‌బిఐ సరిపడా కరెన్సీని సరఫరా చేయక పోవడమేనన్నారు. రాష్ట్ర ప్రజల డిమాండ్‌ను తీర్చడానికి సరిపడా నగదును సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌బిఐ గవర్నర్‌కు, కేంద్ర ప్రభుత్వానికి గతంలోనే తెలియ చేసిందన్నారు. ఆహార భద్రత కార్డులను మంజూరు నిలిపివేతపై సభ్యులు ఎన్. రామచందర్ రావు అడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతూ...ఇపిఓఎస్(ఈపాస్)ప్రాజెక్టు పూర్తి అయిన నేపథ్యంలో మార్చి 1 నుంచి నగరలో రేషన్ కార్డులను తిరిగి ప్రారంభించినట్లు తెలిపారు. జిహెచ్‌ఎంసి ప్రాంతాలో ఈపాస్ ఏర్పాటు పూర్తయిన తర్వాత తెలంగాణలోని మిగిలిన జిల్లాల్లో ఈ పాస్ అమలు చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు జిహెచ్‌ఎంసి ప్రాంతాల నుంచి గ్రామీణ ప్రాంతాలకు,అదే విధంగా గ్రామీణ ప్రాంతాల నుంచి జిహెచ్‌ఎంసి ప్రాంతాలకు వలసపోవడం వల్ల అనేక సాంకేతిక సమస్యలు ఎదరువుతున్నాయన్నారు. నకిలీలను నివారించే కార్యక్రమంలో భాగంగా ఆహార భద్రత కార్డుల జారీలో జాప్యం ఏర్పడిందన్నారు. కొన్ని సందర్భాల్లో సాంకేతిక లోపాలు, అనర్హత ప్రమాణాల కారణంగా కొన్ని సార్లు కార్డులను తొలగించినట్లు కూడా చెప్పారు. విచారణ అనంతరం 20298 కార్డులను పునరుద్దరించినట్లు చెప్పారు.




పరిశీలనలో 4,695 కి.మీ రోడ్ల పునరుద్ధరణ పనులు : జూపల్లి

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్ర వ్యాప్తంగా 4,695 కిలోమీటర్ల రోడ్డు పునరుద్ధరణ పనులు చేపట్టాల్సి ఉందని, ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉందని పంచాయితీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు తెలిపారు. గురువారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు సోలిపేట రామలింగారెడ్డి తో పాటు పలువురు సభ్యులు పంచాయతీరాజ్ రోడ్ల దుస్థితిపై అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ఈ రోడ్ల పునరుద్ధరణకు రూ.900 కోట్లు అవసరమవుతాయని, 2004 నుండి 2014 వరకు ఉమ్మడి రాష్ట్రంలో రూ.416 కోట్ల ఖర్చుతో 14,980 కి.మీ. రోడ్లను పునరుద్ధరిస్తే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత మూడున్నరేళ్ళలో రోడ్ల పునరుద్ధరణకు రూ. 2,246 కోట్లు మంజూరయ్యాయని, ఇందులో ఇప్పటికే రూ.1700 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఇంతకుముందు చేయని బిటి రోడ్ల పునరుద్ధరణను పంచాయితీరాజ్, ఆర్ అండ్‌బి శాఖ ఇప్పుడు చేపడుతోందని అన్నారు. బిటి రోడ్డు ఉపరితల జీవితకాలం ఐదు సంవత్సరాలు ఉంటుందని, తనిఖీ నివేదిక తర్వాతనే ఆ రోడ్డు పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని ఆధునీకరించడానికి ఎంపిక చేస్తున్నామని తెలిపారు. దుబ్బాక నియోజకవర్గంలో రోడ్లకు బిటి ఆధునీకరణను పూర్తి చేయకపోవడం వల్ల అనేక రోడ్లు దుర్భర స్థితిలో ఉన్నట్లు ప్రభుత్వ దృష్టికి వచ్చిందని తెలిపారు.

మీడియా పాయింట్

రాజ్యసభ ఎన్నికల్లో పాల్గొనం : బిజెపి



మన తెలంగాణ / హైదరాబాద్ : నేడు పోలింగ్ జరుగనున్న రాజ్యసభ ఎన్నికల్లో తాము ఎవరికీ ఓటు వేయబోమని, టిఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీకి సమదూరంలో ఉంటామని బిజెపి స్పష్టం చేసింది. అసెంబ్లీలో ఐదుగురు ఎంఎల్‌ఏలం ఉండి కూడా తమ అభిప్రాయాలను అసెంబ్లీ సాక్షిగా ప్రజలకు తెలియజేసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించడం లేదని బిజెపి ఎంఎల్‌ఏ డా. లక్ష్మణ్ అన్నారు. పార్టీ ఎంఎల్‌ఏ కిషన్ రెడ్డితో కలిసి ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడారు. త మకు సహకరించని అధికార పార్టీకి, అలాగే కేంద్రంలో ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీకి సమదూరంగానే ఉంటామన్నారు. అందుకే రాజ్యసభ ఎన్నికల్లో ఓటింగ్‌కు దూరంగా ఉంటున్నట్లు తెలిపారు. రెండు పార్టీలకు కూడా ఓటు వేయడం లేదన్న విషయాన్ని తమ పార్టీ అధిష్టానానికి కూడా తెలియజేశామని లక్ష్మణ్ వెల్లడించారు.

నేడు 'ఛలో అసెంబ్లీ' : రైతు రుణమాఫీ అంశాన్ని ముఖ్యమంత్రి కెసిఆర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఇందుకు నిరసనగా శుక్రవారం 'ఛలో అసెంబ్లీ'కి పిలుపునిచ్చినట్లు బిజెపి ఎంఎల్‌ఏ డా. లక్ష్మణ్ అన్నారు. బిజెపి రైతు విభాగం కిసాన్ మోర్చాతో కలిసి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఇందుకోసం తమ పార్టీ కిసాన్ మోర్చా ఇప్పటికే ఆందోళనకు సంబంధించిన కార్యాచరణను రూపొందించిందన్నారు. ఎవరు అడ్డువచ్చినా 'ఛలో అసెంబ్లీ' నిర్వహించి ప్రభుత్వ తప్పును గుర్తు చేస్తామన్నారు.

'ఛలో అసెంబ్లీ' అర్థరహితం : పల్లా



రైతాంగ సమస్యల పేరుతో బిజెపి 'ఛలో అసెంబ్లీ'కి పిలుపునివ్వడం అర్థరహితమని ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర రెడ్డి విమర్శించారు. ఎంఎల్‌ఏ వేముల వీరేశంతో కలిసి అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ, రైతాంగానికి వ్యవసాయాన్ని లాభదాయకం చేసేందుకు తమ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపట్టిందన్నారు. రైతులకు ఐదు లక్షల రూపాయల వరకు పంట బీమా, ఏప్రిల్ నుండి అమలులోకి రానున్న పెట్టుబడి పథకం ఎంతో లాభదాయకమన్నారు. సాగునీటి ప్రాజెక్టులు మొదలుకొని , ఎరువులు, విత్తనాలను అందిస్తున్నామన్నారు. కేవలం రాజకీయంగా తమపై బురద జల్లేందుకు 'ఛలో అసెంబ్లీ'కి బిజెపి పిలుపునిచ్చిందని విమర్శించారు. నాటి కాంగ్రెస్ పార్టీ హయాంలోనే రైతు ఆత్మహత్యలు ఎక్కువగా జరిగాయన్నారు. 2000 సంవత్సరంలో 14 వందల మంది రైతులు ఆత్మహత్యలు, బలవన్మరణాలు చేసుకోగా ఆ సంఖ్య తాజాగా 2016 నాటికి 645కు త గ్గిందన్నారు. 53.9 శాతం మరణాల సంఖ్య తగ్గిందని ఈ గణాంకాలే వెల్లడిస్తున్నాయన్నారు. రైతు ఆత్మహత్యలపై ఒక పత్రికలో వచ్చిన కథనాన్ని పల్లా రాజేశ్వర రెడ్డి ప్రస్తావిస్తూ గణాంకాలను వివరించారు.

టిఆర్‌ఎస్ సమితులా? : కిషన్‌రెడ్డి



మన తెలంగాణ / హైదరాబాద్ : రైతు సమన్వయ సమితులను ప్రభు త్వం టిఆర్‌ఎస్ కార్యకర్తలతో నింపేస్తోన్నదని బిజెపి ఎంఎల్‌ఏ కిషన్ రెడ్డి ఆరోపించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం కూడా అంగీకరించడం సిగ్గు చేటన్నారు. అందుకే తాము గురువారం నాటి అసెంబ్లీ ప్రశ్నోత్తరాలను బహిష్కరించి సభ నుంచి బయటికి వచ్చినట్లు తెలిపారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో పార్టీ మరో శాసన సభ్యుడు ఎన్‌వివిఎస్‌ఎస్ ప్రభాకర్‌తో కలిసి కిషన్‌రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వ వైఖరి బాబా సాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. సమైక్య రాష్ట్రంలో గతంలో తెలుగుదేశం పార్టీ జన్మభూమి, కాంగ్రెస్ పార్టీ ఆదర్శరైతుల లాగానే ఈ రైతు సమన్వయ సమితుల్లో టిఆర్‌ఎస్ కార్యకర్తలను పెట్టారని విమర్శించారు. ప్రభుత్వ ఈ చర్య సర్పంచుల హక్కులను కాలరాసే విధంగా ఉందన్నారు.

ఉర్దూ లెక్చరర్ల పోస్టులను భర్తీ చేయండి: జాఫర్ హుస్సేన్

మన తెలంగాణ/హైదరాబాద్: ఉర్దూ లెక్చరర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఎంఐఎం సభ్యులు జాఫర్ హుసేన్ మీరజ్ ప్రభుత్వాన్ని కోరారు. శాసనసభలో గురువారం ఎస్‌సి,ఎస్‌టి,బిసి, మైనార్టీ, పాఠశాల, ఉన్నత విద్య, సాంకేతిక విద్య, గృహనిర్మాణ, మహిళా శిశు సంక్షేమ, వికలాంగుల సంక్షేమ, క్రీడలు, వైద్యం ఆరోగ్య శాఖల పద్దులపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల సందర్భంగా రెండు పడకగదుల ఇళ్ళను నిర్మిస్తామని టిఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలన్నారు. ఉర్దూ విద్యాలయాల్లో మౌలిక వసతులను కల్పించాలన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులను నియంత్రించాలని, మహిళా శిశుసంక్షేమ శాఖ నుంచి వికలంగుల శాఖను వేరుచేయాలని సూచించారు. వికలాంగుల పెన్షన్‌ను రూ 1500ల నుంచి రూ. రూ 3,000లకు పెంచాలని కోరారు. ఆసరా పెన్షన్ జారీలో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలన్నారు.

సిఎంకు గౌడ ఎంఎల్‌ఏల కృతజ్ఞతలు

మన తెలంగాణ / హైదరాబాద్ : గౌడ కులస్తుల సంక్షేమం కోసం పలు నిర్ణయాలను ప్రకటించిన ముఖ్యమంత్రి కెసిఆర్‌కు మంత్రి పద్మారావు, ఎంఎల్‌ఏలు శ్రీనివాస్ గౌడ్, ప్రకాశ్‌గౌడ్, కెపి. వివేకానంద గౌడ్, ఎంఎల్‌సి విజి. గౌడ్‌లు కృతజ్ఞతలు తెలిపారు. శాసన సభలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో ఈ మేరకు వారు సిఎం కెసిఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు చెప్పారు. అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఎంఎల్‌ఏలు శ్రీనివాస్ గౌడ్, విజి. గౌడ్ మాట్లాడుతూ కల్లుగీత కార్మికుల సంక్షేమం కోసం సిఎం కెసిఆర్ చేసిన ప్రకటన ఆ వృత్తిదారుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపిందన్నారు. మత్స్యకారులు, గీత కార్మికులే కాదు సబ్బండ వర్గాల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కెసిఆర్ ఒక లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారన్నారు. కాంగ్రెస్ హయాంలో నాటి సిఎం వైఎస్ రాజశేఖర రెడ్డి తదితరులు గ్రేటర్ హైదరాబాద్‌లో కల్లు దుకాణాలను మూసివేయించడంతో కల్లు గీత కార్మికులు, గౌడ కులస్తులు అనేక రకాలుగా ఆర్థిక ఇబ్బందులకు గురయ్యారన్నారు. 'నీరా' కల్లుకు పూర్వ వైభవం తెచ్చేందుకు సిఎం కెసిఆర్ చేస్తున్న ప్రయత్నాలను గౌడ సోదరులంతా హర్షిస్తున్నారని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు.



నేడు రాజ్యసభ ఎన్నికలు

❑ సొంత బలంతోనే గెలవనున్న టిఆర్‌ఎస్ అభ్యర్థులు ❑ ఓటింగ్‌కు బిజెపి, టిడిపి, సిపిఎం దూరం ❑ గెలిచేందుకు 27 ఓట్లు చాలు

మన తెలంగాణ/ హైదరాబాద్ : రాష్ట్రంలో మూడు రాజ్యసభ స్థానాలకు శుక్రవారం జరిగే ఎన్నికలు లాంఛనప్రాయంగా మారాయి. టిఆర్‌ఎస్ స్వంత బలంతోనే మూడు స్థానాలు గెలుచుకోనుంది. ఈ స్థానాలకు శాసన సభ ప్రాంగణంలోని కమిటీ హాల్‌లో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఆ వెంటనే సాయంత్రం ఐదు గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. రెండు గంటలలోపు ఫలితాలు వెల్లడయ్యే అవకాశముంది. టిఆర్‌ఎస్ తరుపున పోటీ చేస్తున్న జోగినిపల్లి సంతోష్‌కుమార్, బడుగుల లింగయ్య యాదవ్, బండా ప్రకాశ్‌ల గెలుపు ఖాయంగా మారింది. కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్ బరిలో ఉన్నప్పటికీ ఏ మాత్రం పోటీ ఇచ్చే అవకాశం కనిపించడం లేదు. ఓటింగ్‌కు దూరంగా ఉంటామని బిజెపి, టిడిపి, సిపిఐ(ఎం) ప్రకటించాయి. దీంతో ఒక అభ్యర్థి నెగ్గేందుకు 27 మొదటి ప్రాధాన్యత ఓట్లు సరిపోతాయి. ము గ్గురు టిఆర్‌ఎస్ అభ్యర్థులకు కలిపి 81 ఓట్లు అవసరమవుతాయి. ప్రస్తుతం టిఆర్‌ఎస్‌కు అధికారికంగా 82 మం ది ఎంఎల్‌ఏల బలం ఉంది. ఫలితంగా ఎవరి మద్దతు లేకుండానే టిఆర్‌ఎస్ మూడు స్థానాలను కైవసం చేసుకోనుంది. మరో వైపు కాంగ్రెస్‌కు 17 మంది ఎంఎల్‌ఏలు, ఒక అనుబంధ సభ్యుడు ఉన్నారు. అయితే ఏడుగురు టిఆర్‌ఎస్‌లో చేరడంతో ఆ పార్టీ వాస్తవ బలం ఆధారంగా 11 ఓట్లు వచ్చే అవకాశం ఉంది. టిఆర్‌ఎస్‌కు ఎంఐఎం మద్దతు పలుకుతుండగా, కాంగ్రెస్‌కు ఇతర పక్షాల మద్దతు లభించలేదు.

మొత్తం ఓట్లు 117: రాజ్యసభ ఎన్నికల్లో నామినేటెడ్ ఎంఎల్‌ఏ మినహా ఎంఎల్‌ఏలందరికీ ఓటు హక్కు ఉంటుంది. ఆ మేరకు శాసనసభలో 119 ఎంఎల్‌ఏలకు ఓటు ఉంటుంది. ఇటీవల కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు సభ్యులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎస్.ఎ.సంపత్‌కుమార్‌ల సభ్యత్వాన్ని శాసనసభ రద్దు చేయడంతో రెండు స్థానాలు ఖాళీ అయ్యాయి. దీంతో ఓట్ల సంఖ్య 117కు తగ్గింది. రాజ్యసభ ఎన్నికల్లో ప్రాధాన్యత క్రమంలో ఓటు వేసే విధానాన్ని అవలంభిస్తారు. ప్రస్తుతం నలుగురు అభ్యర్థులు బరిలో ఉండడంతో ఒక్కో ఓటరుకు నాలుగు ప్రాధాన్యత ఓట్లు ఉంటాయి. అభ్యర్థుల ఎదురుగా ఉండే కాలమ్‌లో తమకు నచ్చిన ప్రాధాన్యతా క్రమంలో 1,2,3, 4 అని అంకెలు వేయాల్సి ఉంటుంది. ఇందుకు పోలింగ్ కేంద్రంలో ఇచ్చిన పెన్నునే వాడాలి. బ్యాలెట్‌లో నోటా కూడా ఉంటుంది. ఈ ఎన్నికలకు శాసనసభ కార్యదర్శి డాక్టర్ వి.నరసింహాచార్యులు రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తారు. రాష్ట్ర ఎన్నికల ముఖ్యఅధికారి రజత్ కుమార్ కూడా ఎన్నికల కేంద్రంలో పరిశీలకులుగా ఉంటారు.



పోలింగ్ ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి డాక్టర్ వి.నరసింహాచార్యులు

అసెంబ్లీలో వివిధ పక్షాల బలాబలాలు

- టిఆర్‌ఎస్–82
- కాంగ్రెస్–17
- ఎంఐఎం–7
- బిజెపి–5
- టిడిపి–3
- సిపిఐ–1
- సిపిఐ(ఎం)–1
- స్వతంత్ర–1
- ఖాళీలు–2

ఓటు చూపించాలి : అన్ని ఎన్నికలకు భిన్నంగా రాజ్యసభ ఎన్నికల్లో బహిరంగ ఓటు విధానాన్ని అమలు చేస్తున్నారు. పోలింగ్ కేంద్రంలో అభ్యర్థుల తరుపున ఏజెంట్‌లతో పాటు రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా ఉంటారు. ఎంఎల్‌ఏలు ఓటు వేసిన తరువాత తాము ఎన్నికైన పార్టీ ప్రతినిధికి బ్యాలెట్‌ను చూపిస్తేనే చెల్లుబాటు అవుతుంది. ఏ ఇతర పార్టీ ప్రతినిధికి చూ పించినా అది చెల్లదు. ఈ విషయంపై ఇప్పటికే ఆయా పార్టీల తమ ఎంఎల్‌ఏలకు తగిన సూచనలు ఇచ్చాయి. టిఆర్‌ఎస్ ఎంఎల్‌ఏలకు వరుసగా మూడు రోజులు మాక్ పోలింగ్ నిర్వహించారు. తెలంగాణ భవన్‌లో గురువారం సాయంత్రం జరిగిన మాక్ పోలింగ్‌కు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు హాజరై ఎంఎల్‌ఏలకు జాగ్రత్తలు చెప్పారు. కాంగ్రెస్ ఎంఎల్‌ఏలు కూడా గురువారం సాయంత్రం నగరంలోని ఒక హోటల్‌లో సమావేశమై ఓటింగ్ రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. పోలింగ్ కేంద్రంలో టిఆర్‌ఎస్ పార్టీ ప్రతినిధిగా ఎం.రమేశ్ రెడ్డి, ఏజెంట్‌లుగా శ్రవణ్‌రెడ్డి, గట్టు రామచంద్రరావు, రాజేశ్‌రావులను నియమించారు. కాంగ్రెస్ తరుపున మాజీ ఎంఎల్‌ఏ కోదండరెడ్డి పార్టీ ప్రతినిధిగా వ్యవహరిస్తారని తెలిసింది.

భూమి ఉన్నవాళ్లకే రైతు సమితుల్లో చోటు : పోచారం



మన తెలంగాణ / హైదరాబాద్ : అసంఘటితంగా ఉన్న రైతులను సంఘటితపరిచి రైతులకు సహాయ సహకారాలు అందించేందుకే రైతు సమన్వయ సమితులను ఏర్పాటుచేస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు చింతా ప్రభాకర్, చెన్నమనేని రమేష్, వేముల వీరేశం, వెంకట్రావు, జి.కిషన్ రెడ్డి తదితరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ గత ప్రభుత్వాలు ఆటో డ్రైవర్లు, అధికార పార్టీ అనుచరులు ఆదర్శ రైతులేనని, వ్యవసాయం లేకపోయినా అదర్శ రైతులుగా నియమించారని, అయితే తమ ప్రభుత్వం అసలుసిసలైన రైతులనే సమితుల్లో నియమించిందని తెలిపారు. గ్రామ రైతు సమన్వయ సమితిల్లో 15 మందిని, మండల రైతు సమన్వయ సమితుల్లో 24 మందిని, జిల్లా సమితుల్లో 24 మంది రైతులను తీసుకున్నామని, ఇందులో మూడో వంతు మహిళలేనని, ప్రతి వర్గానికి, మతానికి, భూమి ఉన్న రైతులకే ప్రాతినిధ్యం కల్పించామని తెలిపారు. త్వరలోనే రాష్ట్ర స్థాయిలో రైతు సమన్వయ సమితుల సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతు సమన్వయ సమితులు రైతులకు సహకరిస్తాయని, రైతులను సమన్వయపరుస్తాయని తెలిపారు. రైతులు గిట్టుబాటు ధరను పొందడానికి రాష్ట్ర రైతు సమన్వయ కమిటీ, గ్రామ, మండలం, జిల్లా సమితులతో సమన్వయం చేసుకుంటుందని తెలిపారు. వీటికి ప్రభుత్వ పూచీకత్తును ఇవ్వడం ద్వారా ప్రభుత్వం బ్యాంకు రుణాలను సమకూర్చుతుందని మంత్రి తెలిపారు.

పాఠశాలల్లో సదుపాయాలు మెరుగుపర్చండి

ప్రభుత్వాన్ని కోరిన ఎంఎల్‌ఎలు

మన తెలంగాణ / హైదరాబాద్ : ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేనందున డబు ల్ బెడ్‌రూమ్‌లను లబ్ధిదారులకు ఉన్న సొంత స్థలాలలోనే నిర్మించుకునేందుకు అనుమతించాలని, ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లు, తదితర మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపర్చాలని, ప్రహరిగోడలను నిర్మించాలని, కనీస మౌలిక సదుపాయాలను కల్పించాలని పలువురు ఎంఎల్‌ఎలు శాసనసభలో గురువారం ప్రభుత్వాన్ని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఎస్‌సి,ఎస్‌టి, బిసి వర్గాలకు రుణాలను మంజూరు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. శాసనసభలో గురువారం ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, పాఠశాల, ఉన్నత విద్య, సాంకేతిక విద్య, గృహనిర్మాణ, మహిళా శిశు సంక్షేమ, వికలాంగుల సంక్షేమ, క్రీడలు, వైద్యం ఆరోగ్య శాఖల పద్దులపై జరిగిన చర్చలో టిఆర్‌ఎస్ సభ్యులు జలగం వెంకట్రావు, విఠల్‌రెడ్డి, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, సతీష్ కుమార్, వేముల వీరేశం, పువ్వాడ అజయ్, వి. మనోహర్‌రెడ్డి, సిపిఐ(ఎం) సభ్యులు సున్నం రాజయ్య పాల్గొన్నారు. సింగరేణి, ఆర్‌టిసి ఆస్పత్రులలో కూడా కెసిఆర్ కిట్ పథకాన్ని అమలు చేయాలని వెంకట్రావు అన్నారు. వీరేశం మాట్లాడుతూ ప్రభుత్వం దళితులకు ఇప్పటి వరకు 4900 ఎకరాల భూమిని పంపిణీ చేసిందన్నారు. పువ్వాడ అజయ్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిలో డెలివరీలు జరగాలన్నారు.

మరో ఐదు నగరాలకు టి హబ్

● ప్రఖ్యాత కంపెనీలు కలిసివస్తాయి ● హైదరాబాద్ రోడ్లకు రూ.వెయ్యికోట్లు ఖర్చుచేస్తాం : మంత్రి కెటిఆర్

మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాలోని మరో ఐదు నగరాలకు 'టి హబ్'ను విస్తరింపజేయనున్నట్లు ఐటి శాఖ మంత్రి కె.తారకరామారావు తెలిపారు. గురువారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో సభ్య లు బి. గణేష్, పువ్వాడ అజయ్ కుమార్ తదితరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ రాష్ట్రంలోని వరంగల్, ఖమ్మం, నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్ నగర్ నగరాల్లో ఐటిను విస్తరించబోతున్నట్లు తెలిపారు. 3 లక్షల 60 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో టి హబ్ ఫేజ్–2 నిర్మాణం ఈ సంవత్సరం పూర్తవుతోందన్నారు. ఇంటెల్, సిస్కో, డిబిఎస్, మైక్రోసాఫ్ట్, గుగూల్ తదితర సంస్థలతోపాటు సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ కంపెనీలు, బ్యాంకింగ్ , ఫార్మా లాంటి అనేక కంపెనీలు టి హబ్‌తో కలిసి



పనిచేస్తున్నట్లు మంత్రి వివరించారు. రాబోయే రోజుల్లో స్టార్టప్‌ల ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగాలు వస్తాయని, గ్రామీణ ఆవిష్కరణలకు కూడా ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. ఆవిష్కరణ ఏ రంగం నుంచి వచ్చినా పెద్ద పీట వేస్తామని తెలిపారు. ఇప్పటికే మన టి హబ్ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని, గోవా, అస్సాం, ఢిల్లీ లాంటి నగరాలకు ఇన్నోవేషన్‌లో దిశా నిర్దేశం చేస్తున్నామని మంత్రి తెలిపారు. హైదరాబాద్ రోడ్ల స్థితిగతులపై సభ్యులు టి.ప్రకాశ్ గౌడ్, ఎం.గోపినాథ్, మౌజం ఖాన్‌లు అడిగిన ప్రశ్నలకు మంత్రి కెటిఆర్ సమాధాన మిస్తూ మున్సిపల్ బాండ్ల ద్వారా నిధులు సమీకరిస్తున్నామని తెలిపారు. మొత్తం వెయ్యి కోట్లు పూర్తిగా హైదరాబాద్ రోడ్లకే ఖర్చు చేయనున్నామని తెలిపారు. కేంద్రం నుండి సహాయం కోసం సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు. నగరంలో 3 వేల కోట్లతో పనులు జరుగుతున్నాయని, 20 వేల కోట్ల పనులకు సంబంధించిన ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రాధాన్యత ప్రాజెక్టుగా చేపట్టామన్నారు.

బడ్జెట్ కేటాయింపులకు, ఖర్చులకు పొంతన లేదు : ఎన్‌విఎస్‌ఎస్ ప్రభాకర్

మన తెలంగాణ/హైదరాబాద్: ప్రభుత్వం చేసిన బడ్జెట్ కేటాయింపులకు చేస్తున్న ఖర్చులకు పొంతనే లేదని బిజెపి సభ్యులు ఎన్‌విఎస్‌ఎస్ ప్రభాకర్ వ్యాఖ్యానించారు. మద్యం బార్లను ఆదాయ వనరులుగా భావిస్తే భవిష్యత్తులో ప్రజల ఆరోగ్య పరిస్థితులు క్షీణిస్తాయని, ప్రమాదకర పరిస్థితులు వస్తాయన్నారు. శాసనసభలో గురువారం ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, పాఠశాల, ఉన్నత విద్య, సాంకేతిక విద్య, గృహనిర్మాణం, మహిళా శిశు సంక్షేమ, వికలాంగుల సంక్షేమ, క్రీడలు, వైద్యం ఆరోగ్య శాఖల పద్దులపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యలు, అత్యాచారాలు, నేరాల వెనక మద్యం ప్రభావం కూడా ఉన్నదన్నారు. ప్రభుత్వం బార్ల అనుమతులను, సమయపాలనను సరళతరం చేసిందన్నారు. తెలంగాణ ఉద్యమంలో తమ సమస్యలు పరిష్కారవుతాయని, తమ జీవితాలు బాగుపడుతాయని సకల జనులు ఉద్యమించి రాష్ట్రాన్ని సాధించినా వారి సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదన్నారు. అందుకే అన్నివర్గాలు మరోసారి ఉద్యమబాట పట్టేందుకు సన్నద్ధమవుతున్నాయని తెలిపారు. స్థానికంగా జరుగుతున్న పరిస్థితులు, సమస్యలను ఉన్నతస్థాయి దృష్టికి తీసుకెళ్తేనే పరిష్కారానికి నోచుకుంటున్నాయని, ఇలాంటి పరిస్థితులు రావడం బాధకరమన్నారు. కళ్యాణలక్ష్మి కి రూ.132 కోట్లు కేటాయిస్తే కేవలం రూ. 74 కోట్లు మాత్రమే ఖర్చు చేశారన్నారు.

ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా యూనిఫాం



మన తెలంగాణ/హైదరాబాద్: విద్యా వ్యవస్థను పటిష్టం చేసి ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి తెలిపారు. అందులో భాగంగా విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయల కల్పన, ఖాళీ పోస్టుల భర్తీ, తదితర చర్యలు చేపట్టిందని తెలిపారు. అన్ని రకాల ప్రభుత్వవిద్యా సంస్థలలో 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న సుమారు 5.17 లక్షల విద్యార్థులకు దాదాపు రూ. 34.31 కోట్ల ఖర్చుతో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఉచితంగా యూనిఫామ్‌ను ఇవ్వనున్నట్లు కడియం శ్రీహరి ప్రకటించారు. శానససభలో గురువారం తొమ్మిది శాఖలకు సంబంధించిన పద్దులపై జరిగిన చర్చ


అసెంబ్లీ పద్దులకు మంత్రుల సమాధానం

కు మంత్రులు సమాధానమిచ్చారు. విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి, రెవెన్యూ మంత్రి మహమద్ మహమూద్‌అలీ, గృహనిర్మాణ శాఖ మంత్రి ఎ. ఇంద్రకరణ్‌రెడ్డి, ఎస్‌సి అభివృద్ధి శాఖ మంత్రి జి. జగదీశ్‌రెడ్డి, ఎస్‌టి అభివృద్ధి శాఖ అజ్మీరా చందూలాల్, బిసి సంక్షేమ శాఖ మంత్రి జోగురామన్న, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, క్రీడలు, యువజన సేవల శాఖ మంత్రి టి.పద్మారావుగౌడ్, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి వారి శాఖలకు సంబంధించిన జరిగిన చర్చలపై సమాధానమిచ్చారు. కడియం శ్రీహరి సమాధానమిస్తూ అన్ని కస్తూర్బా గాంధీ బాలిక విద్యా సంస్థలను పటిష్టపరుస్తున్నామన్నారు. పాఠశాల విద్యలో అనేక సంస్కరణలను తీసుకొచ్చామన్నారు. తాము అధికారంలోనికి వచ్చే నాటికి కళాశాలల పరిస్థితి అధ్వాన్నంగా ఉండేదని, ప్రస్తుతం రాష్ట్రంలో దాదాపు రూ.315 కోట్లతో 404 జూనియర్ కళాశాలలను, రూ. 100కోట్లతో డిగ్రీ కళాశాలలను, మరో రూ 143 కోట్లతో సంక్షేమ హాస్టళ్ల భవనాలను మెరుగుపరుస్తున్నట్లు చెప్పారు. టిఎస్‌పిఎస్ ద్వారా చేపట్టిన 8792 కొత్త ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియను మే నాటికి పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. జూనియర్ కళాశాలలో 1200 పోస్టులు, డిగ్రీ కళాశాలలో 1384 పోస్టులు, పాలిటెక్నిక్‌లలో 519 పోస్టులు, విశ్వవిద్యాలయాల్లో 1551 పోస్టుల భర్తీకి పరిపాలన అనుమతులను మంజూరు చేశామని వివరించారు. మంత్రి జి.జగదీశ్‌రెడ్డి సమాధానమిస్తూ దళితుల సంక్షేమంపై ముఖ్యమంత్రి కెసిఆర్‌కు ఒక విజన్ ఉన్నదని, వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదన్నారు. రాష్ట్రంలో దళితులు పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందాలన్నదే తమ లక్ష్యమన్నారు. గత మూడేళ్లలో కళ్యాణ లక్ష్మి కోసం రూ. 459 కోట్లను, దళితుల భూపంపిణీకి రూ. 554 కోట్లను, స్వయం ఉపాధి పథకాలకు రూ. 737 కోట్లను, గుడుంబా తయారీదార్ల పునరావాసానికి రూ. 20 కోట్లను, విదేశీ విద్యకు రూ. 44 కోట్లను ఖర్చు చేసినట్లు వివరించారు. స్కాలర్‌సిప్‌లను, మెస్‌ఛార్జీలను శాస్త్రీయపద్ధతిలో నిర్ణయించామని, రూ. 311 కోట్లతో సంక్షేమ గురుకుల పాఠశాలలకు కొత్త భవనాలను నిర్మించనున్నట్లు ప్రకటించారు. మంత్రి ఎ. ఇంద్రకరణ్‌రెడ్డి సమాధానమిస్తూ ప్రభుత్వం హామీ ఇచ్చిన రెండున్నర లక్షల డబుల్ బెడ్ రూమ్‌ల ఇండ్ల నిర్మాణానికి తగిన స్థలం అందుబాటులో లేనందున ఎంఎల్‌ఏల విజ్ఞప్తి మేరకు లబ్ధిదారులకు ఉన్న సొంత స్థలంలోనే ఇండ్లు కట్టించే అంశాన్ని ప్రభుత్వం ఆలోచిస్తున్నదని చెప్పారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లకు దేవాదాయ భూములను కేటాయించే విషయంపై కోర్టు ఆదేశాలకు అనుగుణంగా పరిశీలిస్తామని చెప్పారు. రాష్ట్రంలో మొత్తం 2.72 లక్షల డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లను మంజూరు చేయగా 2.19 లక్షల ఇళ్ళకు టెండర్లు ఆహ్వానించామని, వాటిలో 1.78 లక్షల టెండర్లను ఆమోదించామని, 1.50 లక్షల ఇండ్ల నిర్మాణ ప్రక్రియ ప్రారంభం కాగా, ఇప్పటి వరకు 9,522 ఇండ్ల నిర్మాణం పూర్తయిందని ఆయన వివరించారు.

వికలాంగుల పెన్షన్ పెంపు?

మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సమాధానమిస్తూ వికలాంగులకు ఇస్తున్న పెన్షన్‌ను పెంచే విషయాన్ని పరిశీలిస్తున్నామని, మహిళా శిశు సంక్షేమ శాఖలో విలీనం చేసిన వికలాంగుల శాఖను విడదీసి యథాతథంగా కొనసాగించేందుకు ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డి సమాధానమిస్తూ ప్రభుత్వ ఆస్పత్రులను కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అవసరమైన చోట కొత్త ఆపరేషన్ థియేటర్లను, నీలోఫర్ ఆస్పత్రిలో కార్డియాలజీ, న్యూరోలాజీ విభాగాలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. హోమియో, యునాని వైద్య సదుపాయాలను మెరుగుపర్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. వికారాబాద్‌లోని అనంతగిరిలో ప్రకృతి చికిత్సాలయాన్ని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు.





“ గడచిన కాలమే గతాన్ని పూడ్చిపెడుతుంది.
అనంతమైన భవిష్యత్తు మీ ముందుంది.
– స్వామి వివేకానంద ”

సంపాదకీయం

‘ఫేస్’ కోల్పోయిన ‘ఫేస్‌బుక్’

ప్రజాస్వామ్యంలో ప్రజలే రాజులంటారు. ఎందుకంటే ఓటర్లు తమ విచక్షణనుపయోగించి తమ ప్రతినిధులను ఎన్నుకుంటారు. అయితే సిద్ధాంతాలు వెనక్కుపోయి ధనబలం, కండబలం, కుల, మత ప్రభావాలు ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తున్నాయి. ఇటీవల కాలంలో డిజిటల్ టెక్నాలజీ మరో ముప్పుగా తయారైనట్లు ప్రస్తుతం తీవ్రమైన చర్చనీయాంశంగా మారిన ‘ఫేస్‌బుక్’ నుంచి పెద్ద ఎత్తున వ్యక్తుల సమాచార లూటీ ఉదంతం వెల్లడిస్తున్నది. అనతికాలంలోనే ప్రపంచవ్యాప్తంగా 200కోట్ల మంది వినియోగదారులను సంపాదించిన ఫేస్‌బుక్ అతిపెద్ద ‘సోషల్ మీడియా’గా ప్రాచుర్యం పొందింది. వారంతా తమ వ్యక్తిగత సమాచారాన్ని తమ ఫేస్‌బుక్ అక్కౌంట్లలో పొందుపరిచారు. ఖాతా తెరవటానికి తప్ప దాని ఇతరత్రా ప్రయోజనాలేమిటో అత్యధికులకు తెలియదు. తమకు తోచిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై పోస్టింగ్‌లు పెట్టటం, మిత్రుల్ని సంపాదించుకోవటం వంటి ప్రయోజనాలే వారికి తెలుసు. కొన్ని సమస్యలపై ప్రజలను చైతన్యపరచటానికి, ఆందోళనల కొరకు ప్రజల సమీకరణకు ఈ మీడియా ఉపయోగపడుతున్నది. అయితే టెక్నాలజీ రెండంచుల పదునుగల కత్తి అని మరోసారి రుజువైంది. వ్యక్తుల సమాచారాన్ని విశ్లేషించి, వారి అభిరుచులనుబట్టి ప్రచార, ప్రలోభ పద్ధతులు రూపొందించి, తాము కాంట్రాక్టు తీసుకున్న పార్టీలకు లేక అభ్యర్థులకు అనుకూలంగా ఓటర్లను ప్రభావితం చేసే సంస్థలు పనిచేస్తున్నాయని వెల్లడైంది. బ్రిటిష్ కంపెనీ ఎస్‌సిఎల్ గ్రూపుకు అమెరికాలో అనుబంధ సంస్థ కేంబ్రిడ్జి ఎనలిటికా(సిఎ). అది ఫేస్‌బుక్ నుంచి 5కోట్ల మంది అమెరికన్ వినియోగదారుల వ్యక్తిగత సమాచారాన్ని తస్కరించి అధ్యక్ష ఎన్నికల్లో డోనాల్డ్ ట్రంప్‌కు అనుకూలత సృష్టించేందుకు పనిచేసినట్లు వెల్లడైంది. సిఎకు ఇటువంటి ప్రచార నిర్వహణలో పాతికేళ్ల అనుభవముందట. అమెరికాలోనే గాక థాయిలాండ్, ట్రినిడాడ్ అండ్ టొబాగో, సైంట్ కిట్స్, నెవిస్, దక్షిణాఫ్రికా, కెన్యా, మలేసియా, ఇండోనేషియా, ఇటలీ, కొలంబో, భారత్‌ల్లో తమ క్లైంట్‌లవరకు రాజకీయ ప్రచారం నిర్వహించినట్లు దాని వెబ్‌సైట్ తెలుపుతున్నది. స్వేచ్ఛాయుత సమాచార వేదిక ఫేస్‌బుక్, ఇందులో ఎవరి జోక్యం ఉండదంటూ దాన్ని అధునాతన ప్రసార మాధ్యమంగా ప్రచారంలోకి తెచ్చిన దాని అధినేత మార్క్ జుకెర్‌బర్గ్ తమ సర్వర్‌లనుంచి వ్యక్తుల సమాచార చౌర్యంపై అమాయకత్వం నటిస్తున్నాడు. అది ఎవరి కొరకో, దేనికొరకో పనిచేస్తున్నదని ఇప్పుడు విదితమైంది. బ్రిటన్, అమెరికాలు సిఎ వివాదంపై దర్యాప్తు చేస్తున్నాయి. ఈ కుంభకోణాన్ని బట్టబయలు చేసింది అమెరికన్ జర్నలిస్టులే. కష్టమర్లుగా కేంబ్రిడ్జి అనలిటికా సిఇఓ అలెగ్జాండర్ నిక్స్ (ఇప్పుడు సస్పెండ్ అయినారు)ను కలిసిన జర్నలిస్టులతో అతడు తమ కంపెనీ ఎలా సమాచారం సంపాదించిందో, ట్రంప్‌కు అనుకూలంగా ఎలా ఉపయోగించిందో గొప్పగా చెప్పుకున్నారు. ఆ సిడి విడుదల కల్లోలం సృష్టించింది. ప్రజాస్వామ్యంపై దాడిలో ఫేస్‌బుక్ పాత్ర ఉండడం మరో పెద్ద కుంభకోణం. సిఇఓ జుకెర్‌బర్గ్‌ను ప్రశ్నించటానికి పలువురు విలేకరులు సిలికాన్ వ్యాలీలోని ఫేస్‌బుక్ కేంద్ర కార్యాలయానికి వెళ్లగా వారిని కలవకుండా వెనక్కు పంపారు. ఫేస్‌బుక్, ఇతర సోషల్ మీడియాలు అవి చెప్పుకుంటున్నట్లు తటస్థ వేదికలు కావని, ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసేందుకు, ఎవరి ప్రయోజనాల కొరకో దాన్ని ప్రభావితం చేసేందుకు పనిముట్లుగా పనిచేస్తున్నట్లు విదితమవుతున్నది.

ఈ కుంభకోణం ప్రభావం మనదేశంలో ప్రతిధ్వనించింది. సిఎ సేవలను ఉపయోగించుకున్నట్లు బిజెపి, కాంగ్రెస్ పరస్పర ఆరోపణలు చేసుకున్నాయి. సమాచార మంత్రిగా వాస్తవాలను దర్యాప్తు చేయించాల్సిన రవిశంకర్ ప్రసాద్ బిజెపి నాయకుడిలాగా కాంగ్రెస్‌పై దాడికి దిగారు. అయితే 2010బీహార్ ఎన్నికల్లో బిజెపి మిత్రపక్షం జెడి(యు)ఎస్‌సిఎల్ అనుబంధ సంస్థ ఒబిఐ సేవలు ఉపయోగించుకున్నట్లు, 2014 ఎన్నికల్లో, అనేక అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి ఉపయోగించుకున్నట్లు కాంగ్రెస్ ప్రత్యారోపణ చేసింది. 2009 ఎన్నికల్లో రాజ్‌నాథ్‌సింగ్ ఉపయోగించుకున్నారట! ఒబిఐ అధిపతి బిజెపి మిత్రపక్షం జెడియు ఎంపి కెసి త్యాగి కుమారుడు అమ్రిష్ త్యాగి. అందువల్ల తప్పుత్రోవ పట్టించే నిందలు మానుకుని ప్రజలకు వాస్తవం తెలిసేలా భారత్‌లో అటువంటి చొరబాట్లపై సమగ్ర దర్యాప్తు ఆదేశించాలి.

నీటి యుద్ధాల కాలం రాబోతోంది

చూపు

భవిష్యత్తులో యుద్ధాలు నీటి కోసం జరుగుతాయని, మూడవ ప్రపంచ యుద్ధం నీటికోసమే జరగొచ్చని చాలామంది నిపుణులు హెచ్చరించారు. అనేక నదులు ప్రవహించే భారతదేశంలో నీటికి కరువొస్తుందా? గుక్కెడు తాగు నీటి కోసం మైళ్ళకొద్దీ నడిచే గ్రామీణ ప్రాంతాలు నేటికి కూడా ఉన్నాయన్నది మరిచిపోరాదు. నీటివనరులు దేశంలో పుష్కలంగా ఉన్నప్పటికీ వాటర్ మేనేజిమెంట్ అనేది కనబడదు. జలసంపద అమూల్యమైనది. దాని విలువను భారత ప్రభుత్వాలు గుర్తించినట్లు కనబడడం లేదు. దేశంలో దాదాపు అరవై కోట్ల మంది ప్రజలు నీటి అవసరాల కోసం కేవలం రుతుపవనాలపై ఆధారపడే పరిస్థితి ఉంది. వానరాకడ ఎప్పుడో చెప్పలేని పరిస్థితి. రుతుపవనాలు ఆలస్యమైతే నీటి కష్టాలు ప్రారంభమవుతాయి. అయినా నీటివనరుల నిర్వహణ విషయంలో ప్రభుత్వాలు శ్రద్ధ చూపడం లేదు. రుతుపవనాల విషయంలో ఖచ్చితంగా చెప్పడం ఎన్నడూ సాధ్యం కాదు. గ్లోబల్ వార్మింగ్ వల్ల ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితులు మారిపోతున్నాయి.

ప్రపంచంలో అనేక ప్రాంతాల్లో నీటి ఎద్దడి గురించి వార్తలు చదువుతున్నాం. కొన్ని నగరాల్లో ప్రభుత్వాలు నీటి సరఫరాకు రేషన్ విధించింది. దక్షిణాఫ్రికాలో రోజుకు పాతిక లీటర్ల రేషను లెక్కన ప్రజలకు నీటిని అందిస్తున్న వార్తలు కూడా చదివాం. ఇంకా అనేక ప్రాంతాల్లో నీటిఎద్దడి గురించిన వార్తలు వస్తూనే ఉన్నాయి. మైళ్ళ దూరం నుంచి ట్రక్కుల్లో, వాటర్ ట్యాంకర్లలో నీటిని సరఫరా చేస్తున్న పరిస్థితులున్నాయి. మన దేశంలోను కొన్ని ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితులున్నాయి. దూరప్రాంతాల నుంచి నీటిని సరఫరా చేయవలసి వస్తోంది. ప్రపంచ జనాభాలో ఆరవభాగం జనాభా మనదేశంలోనే ఉంది. కాని ప్రపంచంలోని భూభాగంలో కేవలం 2.4 శాతం నేల మాత్రమే భౌగోళికంగా మనవద్ద ఉంది. ప్రపంచంలోని తాగునీటిలో కేవలం 4 శాతం మాత్రమే మనకు అందుబాటులో ఉంది. దీన్ని బట్టి దేశంలో జనాభాకు అవసరమైనంత తాగు నీటి నిల్వలు ఉన్నాయో లేదో అర్థం చేసుకోవచ్చు. దేశంలో దాదాపు సగం జనాభా నీటి ఎద్దడిని ఎదుర్కుంటుంది. దేశంలో నివసిస్తున్న 120 కోట్ల మంది ప్రజల్లో 74 కోట్ల 20 లక్షల మంది కేవలం వ్యవసాయం ప్రధానంగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. రుతుపవనాల వల్ల కురిసే వర్షాలే భూగర్భజలాలకు కూడా ఆధారం. వర్షాల వల్లనే 68 శాతం భూగర్భంలో నీటినిల్వలు చేరుతున్నాయి. కాలువలు, సాగునీరు, చెరువులు వగైరాల నుంచి భూమిలోకి నీరు ఇంకడం వల్ల భూగర్భంలో నీరు చేరడం అన్నది కేవలం 32 శాతమేనని తెలుస్తోంది.

దేశ జనాభాను దృష్టిలో ఉంచుకుంటే భారతదేశంలో నీటి నిర్వహణ అన్నది చాలా లోపాలతో కూడుకున్నది. నీటి సమస్య విషయంలో దీర్ఘకాలిక పరిష్కారాల కోసం ప్రభుత్వాలు పనిచేయడం లేదు. ఏదన్నా సమస్య వచ్చినప్పుడు తాత్కాలిక ఉపశమనాలతో చేతులు దులుపుకుంటున్నాయి. నీటి వనరులను సమర్థవంతంగా నిర్వహించడానికి వ్యవసాయరంగం, పారిశ్రామికరంగం, నగరాల్లో వాటర్ వర్క్స్ అందరూ కలిసి సమన్వయంతో వ్యవహరించవలసి ఉంటుంది. మరో ముఖ్యమైన విషయమేమంటే మనం రోజువారి నీటి వాడకంలో చాలా నీటిని వ్యర్థం చేస్తాం. ఇలా వ్యర్థమయ్యే నీరు 40 నుంచి 60 శాతం వరకు ఉంటుందని అంచనా. చాలా దేశాల్లో ఇలా నీటిని వ్యర్థంగా వాడడం జరగదు. నిజానికి భారతదేశం నీటివనరులు పుష్కలంగా ఉన్న దేశం. చాలా పెద్దపెద్ద నదులు ఇక్కడ ఉన్నా యి. ఏటా సగటున 1170 మిల్లీమీటర్ల వర్షం కురుస్తుంది. ఏటా రిన్యూవబుల్ వాటర్ రిజర్వులు 1608 బిలియన్ క్యూబిక్ మీటర్లు. ప్రపంచంలో తాగునీటి రిజర్వుల్లో దాదాపు తొమ్మిదో వంతు ఇక్కడే ఉన్నాయి. భారతదేశంలో నీటిఎద్దడికి ముఖ్యమైన కారణం కేవలం నిర్వహణ లోపమే. దేశంలో చాలా భాగాల్లో పుష్కలంగా వానలు కురుస్తుంటాయి. విచిత్రమేమంటే దేశంలో వరదలకు గురయ్యే ప్రాంతాల్లోనే ఆ తర్వాత నీటి ఎద్దడి కూడా ఉంటుంది. దేశంలో చిన్నా పెద్ద 4525 డ్యాములున్నాయి. అయినా దేశంలో తలసరి నీటి నిల్వ కేవలం 213 క్యూబిక్ మీటర్లు మాత్రమే. రష్యాలో ఇది 6,103 క్యూబిక్ మీటర్లు, ఆస్ట్రేలియాలో 4,733 క్యూబిక్ మీటర్లు, చైనాలో 1111 క్యూబిక్ మీటర్లు. అంటే మన ప్రభుత్వాలు ఆఫ్ సీజను కోసం నీటినిల్వలకు సరయిన ఏర్పాట్లు చేయనేలేదని చెప్పాలి. నీటి నిర్వహణ విషయంలో ఇస్రాయీల్ చాలా ప్రగతి సాధించింది. డ్రిప్ ఇరిగేషన్, వ్యర్థజలాలను సాగుకు వాడడం, ఇండ్లల్లో ఉపయోగించిన నీటిలో 80% శుద్ధి చేసి వ్యవసాయానికి వాడడం జరుగుతోంది. అక్కడ సాగునీటిలో దాదాపు 50% ఇలా శుద్ధిచేసిన జలా లే.



ఆసియన్ డెవలప్మెంట్ బ్యాంకు ప్రకారం 2030 నాటికి భారతదేశం 50 శాతం నీటికరువును ఎదుర్కోబోతోంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఏటా మనకు 1100 బిలియన్ క్యూబిక్ మీటర్లు అవసరం. 2025 నాటికి 1200 బిలియన్ క్యూబిక్ మీటర్లు అవసరమవుతాయి. 1951 లెక్కల ప్రకారం దేశంలో సగటున ప్రతి మనిషికి ఏటా 5200 క్యూబిక్ మీటర్ల నీళ్ళు లభించేవి. అప్పుడు జనాభా 35 కోట్లు మాత్రమే. 2010 నాటికి జనాభా చాలా పెరిగింది. సగటున ప్రతి మనిషికి ఏటా లభించే నీళ్ళు 1600క్యూబిక్ మీటర్లకు తగ్గిపోయాయి. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం చూస్తే ఇది నీటి ఎద్దడిగానే భావించాలి. ప్రస్తుతం 2018లో దేశంలో సగటున ప్రతిఒక్కరికి 1400 క్యూబిక్ మీటర్లు మాత్రమే లభిస్తున్నాయి. రాబోయే ఒకటి రెండు దశాబ్దాల్లో ఇది సగటును 1000 క్యూబిక్ మీటర్లకు పడిపోవచ్చన్న అనుమానాలున్నాయి. మరో ముఖ్యమైన విషయమేమంటే లభిస్తున్న నీటిలో చాలా భాగం వాడకానికి పనికివచ్చేది కాదని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హైడ్రాలజీ చెబుతోంది. ప్రస్తుతం సగటున ప్రతి ఒక్కరికి కేవలం 938 క్యూబిక్ మీటర్ల నీరు మాత్రమే వాడకానికి తగినది దొరుకుతోందని తెలుస్తోంది. భూమిపై నీటిలో కేవలం 2.5% నీరు మాత్రమే మంచినీరు. జలం జీవాధారం. అందుకే ఐక్యరాజ్యసమితి 2010 జులై 28వ తేదీన నీటిని పొందడం మానవహక్కుగా తీర్మానించింది. సిటీ బ్యాంక్ చీఫ్ ఎకనమిస్ట్ విలియం బీటర్ నీటి ప్రాముఖ్యం గురించి రాస్తూ రానున్న కాలంలో చమురు, విలువైన లోహాల కన్నా నీరు విలువైందిగా మారిపోతుందన్నాడు. ప్రపంచంలో పర్యావరణ మార్పుకు గురయ్యే అవకాశాలు అధికంగా ఉన్న దేశాల్లో భారతదేశం కూడా ఒకటి. చాలా దేశాలు క్లయిమేట్ ఛేంజ్ తట్టుకోడానికి సంసిద్ధమవుతున్నాయి. కాని మనం అలాంటి ప్రయత్నాలే చేస్తున్నట్లు కనబడడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయానికి, పశువులకు నీటి ఎద్దడి సమస్య. బిందెడు నీళ్ళ కోసం మైళ్ళ కొద్ది నడుస్తున్న మహిళలు, మరోవైపు పవర్ ప్లాంట్లకు తరలిపోతున్న నీరు వీటన్నింటి గురించి ఆలోచించేది ఎవరు? కొన్ని ప్రాంతాల్లో నేల, నీరు చవగ్గా పరిశ్రమలకు కట్టబెడుతున్న ప్రభుత్వాలు పునరాలోచంచవలసిన అవసరం ఉంది. వర్షపాతం వల్ల లభించే నీటిలో 35% మాత్రమే నేడు ఉపయోగానికి వస్తుందన్న లెక్కలున్నాయి. వర్షపునీటిని నిల్వ ఉంచడానికి ఉపయోగపడే చెరువులు, కుంటలను పునరుద్ధరించడం, సాంప్రదాయిక జలపరిరక్షణ విధానాలను ప్రోత్సహించడం, ప్రజలను కూడా నీటి నిర్వహణలో భాగస్వాములు చేయడం చాలా అవసరం.

(కౌంటర్ కరెంట్స్ లో మొయిన్ ఖాజీ వ్యాసానికి సంక్షిప్త అనువాదం)

ఫేస్‌బుక్ వలలో ప్రజాస్వామ్యం విలవిల

ఫేస్ బుక్ ఒక సోషల్ నెట్వర్కింగ్ సైట్. బిజి బిజీ జీవితాల్లో మన మిత్రులు, బంధువులతో మాట్లాడుకోడానికి, పరిచయాలు పెంచుకోడానికి ఇంకా ఉపయోగపడే సోషల్ నెట్వర్కింగ్ సైట్. కాని దీని వెనుక ప్రజాస్వామ్యాన్ని వలేసి నిర్బంధించే భయంకరమైన కుట్రలు కూడా కొనసాగవచ్చని ఇటీవల కేంబ్రిడ్జ్ ఎనలిటికా గురించిన వార్తల ద్వారా తెలుస్తోంది. ఫేస్‌బుక్ లో అనేక యాప్స్ యూజర్స్‌కు సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తుంటాయి. చిన్నచిన్న క్విజులు, పర్సనాలిటీ గురించిన ప్రశ్నలు సరదాగా ఉంటాయి. చాలా సరదాగా ఈ ప్రశ్నలను ఆన్సర్ చేసి మన మిత్రులకు, బంధువులకు మన గురించి ఫేస్ బుక్కేం చెప్పిందో చూడండని షేర్ చేస్తుంటాం. కాని ఇక్కడే అసలు మోసం ఉంది. ఇక్కడే అసలు వ్యాపారం ఉంది. చాలా సరదాగా కనిపించే క్విజ్, ప్రశ్నావళి ఏదో సరదా కోసం కాదు. దాని వెనుక పెద్ద కుట్రే ఉంటుంది.

ఈ ప్రశ్నలు, క్విజుల ద్వారా సేకరించే డాటా యే ఫేస్ బుక్ వ్యాపారం. కనెక్టెడ్‌గా ఉండడం కోసం ఫేస్ బుక్ యూజర్స్ అనేక పోస్టులకు లైక్ చేస్తుంటారు, షేర్ చేస్తుంటారు, కామెంట్లు చేస్తుంటారు. ప్రతి యూజర్ భయాలు, ఆలోచనలు, భ్రమలు, ఆశలు, ధోరణలు ఫేస్ బుక్ యాక్టివిటీలో, ఈ డాటాలో తెలుస్తాయి. ఈ డాటా దుర్వినియోగం అవుతుంది. అదెలా అవుతుందంటే, డెమొగ్రాఫిక్స్ అన్న పదం చాలామంది వినే ఉంటారు. మార్కెటింగ్ కంపెనీలు ఈ పదాన్ని వాడుతాయి.

మార్కెటులో స్త్రీలెంత మంది, పురుషులెంతమంది, ఏ భాష మాట్లాడేవారెంత మంది, వివిధ వయసుల వారితో ఎంత మంది ఉన్నారు వగైరా వివరాలు సేకరించి, ఉత్పత్తుల అమ్మకాలకు ఏ గ్రూపును ఎలా టార్గెట్ చేయాలి నిర్ణయించుకుని, అందుకు అవసరమైన వ్యూహాలతో వ్యాపా ర ప్రకటనలు తయారు చేస్తారు. ఇప్పుడు సైకోగ్రాఫిక్స్ అనే కొత్త పదం కూడా వాడకంలోకి వచ్చింది. ప్రతి వ్యక్తి ఎలాంటి ఆలోచనలు, భయాలు, భ్రమలు, ఆశలు, ఆసక్తు లు, విలువలు, ధోరణులు కలిగి ఉంటాడో గ్రహించి వ్యక్తిగతమైన ప్రొఫైల్ తయారు చేయడం. దీనికి కావలసిన డాటా ఫేస్ బుక్ ద్వారా లభిస్తుంది. ఎలాంటి పోస్టులు లైక్ చేస్తున్నారు, షేర్ చేస్తున్నారు, కామెంట్లు చేస్తున్నారు మాత్రమే కాదు, వివిధ యాప్స్‌లో అడిగే ప్రశ్నలకు ఇస్తున్న జవాబులు ఇవన్నీ సైకోగ్రాఫిక్స్ ద్వారా ఎనలైజ్ చేసి ప్రొఫైలింగ్ చేయడం జరుగుతుంది. ఉత్పత్తుల అమ్మకానికి సంబంధించిన వ్యాపార ప్రకటనల కోసమై తే ఒక ఉత్పత్తిని ఎవరు కొనే అవకాశాలున్నాయో గ్రహించడానికి ఇది ఉపయోగపడుతుంది. ఈ డాటాను సునాయాసంగా సేకరిస్తోంది ఫేస్ బుక్. ప్రతిరోజు కోట్లాది మంది తమ ఆలోచనలేమిటో ఫేస్ బుక్కు చెబుతున్నారు. నైతిక ప్రమాణాలకు కట్టుబడి ఈ డాటాను ఉపయోగిస్తే, అంటే మీ ఆలోచనలకు అనుగుణమైన ఒక చెప్పులో, మొబైల్ ఫోనులో న్యూస్ ఫీడులో చూపించడంలో పెద్ద తప్పేమీ లేదు. కాని సమాజంలో వివిధ ఆలోచనలున్న వారిని ఎలా ప్రభావితం చేయాలో వ్యూహాత్మకంగా నిర్ణయించుకోడానికి, ప్రభావితం చేసేలా ప్రచారం చేయడానికి, భయాలను రెచ్చగొట్టడానికి, ఆశలు కల్పించడానికి ఈ డాటాను ఉపయోగించడం అనైతికం.ఫేస్ బుక్ అలాంటి పనులకు వేదికయ్యిందిప్పుడు.

బ్రిటన్‌లో ఉన్న కేంబ్రిడ్జ్ ఎనలిటికా ఇలా సేకరించిన సమాచారాన్ని అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఉపయోగించిం ది. అమెరికా ఓటర్లలో ఎవరు ఎలాంటి ఆలోచనలతో ఉన్నారు? ఎవరు తటస్థంగా ఉన్నారు? తటస్థంగా ఉన్నవారిని ప్రభావితం చేయగల విషయాలేమిటి? ఈ సమాచారం చేతుల్లో పెట్టుకుని, వారిని ప్రభావితం చేసేలా వ్యక్తిగతంగా వర్చువల్ స్పేస్ ద్వారా వారి చెవుల్లో ఊదే పనే కేంబ్రిడ్జ్ ఎనలిటికా చేసింది. అంటే ఓటర్లను ప్రభావితం చేయడం. ప్రతిమనిషిలోను కొన్ని భయాలుంటాయి. వాటిని లక్ష్యం చేసుకుంటే ఆ మనిషి ఎవరికి ఓటేస్తాడో ప్రభావితం చేయవచ్చు. ఫేస్బుక్ ఈ సమాచారాన్ని అమ్ముతుందంటే ప్రత్యక్షంగా బేరం పెట్టి అమ్మడం జరగదు. అకడమిక్ రిసెర్చర్ల అధ్యయనానికి డాటా అందుబాటులో ఉంచుతున్నామని చెప్పింది. అనేక మంది సైకాలజిస్టులు చిన్న చిన్న ప్రశ్నలు అడగడం ద్వారా యూజర్ల మానసిక స్థితిని అధ్యయనం చేసే అవకాశం కల్పిస్తున్నామని చెప్పింది. ఈ ప్రశ్నలకు రాజకీయాలకు పెద్ద సంబంధం ఉన్న ట్లు పైకి కనిపించదు. మనం ఉపయోగించే వెబ్ బ్రౌజరేది అని అడిగిన చాలా చిన్న ప్రశ్న కూడా సైకాలజికల్ ప్రొఫైలింగ్ లో ఉపయోగపడుతుంది. యూజర్ల టైమ్ లైనులో పోస్టు చేసిన ఫోటోలు, వీడియోలు, పుట్టిన తేదీ, మతం, దేశం, ప్రాంతం... వివరాలన్నీ వారి దగ్గర ఉన్నాయి. ప్రతి యూజర్ ఫ్రెండ్స్ లిస్టులోని వారందరి జాబితాలతో సహా. ఏ పోస్టులు లైక్ చేశారు. ఎలాంటి ఆహారం తింటారు.. ఒకటేమిటి ఒక వ్యక్తికి సంబంధించిన సమస్త సమాచారం ఇప్పుడు ఫేస్ బుక్ సేకరిస్తోంది. ఈ సమాచారాన్ని అనైతికంగా కేంబ్రిడ్జ్ ఎనలిటికా వంటి సంస్థలకు అందుబాటులో ఉంచారు. ఈ సమాచారాన్ని విశ్లేషించడం ద్వారా ఎలాంటి రాజకీయ సందేశాలు ఎవరికి ఇవ్వాలి? ఎలా ఇవ్వాలి? ఎవరికి ఎలా చెబితే ప్రభావితం అవుతారన్నది తెలుసుకుంటారు. ప్రభావితమైన వారు ఇతరులను ప్రభావితం చేస్తారు. అందుకు అవసరమైన వెబ్‌సైట్లు, ప్రకటనలు, బ్లాగులు రూపొందించి ఫేస్ బుక్ యూజర్ ట్రాఫిక్ అటు మళ్ళిస్తారు. ఫేస్ బుక్ ఆదాయం యాప్స్ ద్వారా వస్తుంది. యాప్స్ సమాచారం సేకరించకుండా ఫేస్ బుక్ కఠినమైన చర్యలు తీసుకోవడం జరగదు. ఒక యాప్ అడిగిన ప్రశ్నలకు ఒక యూజర్ సమాధానమిస్తే ఆ ఒక్క యూజర్‌కు సంబంధించిన డాటా మాత్రమే కాదు, ఆ యూజర్ ఫ్రెండ్స్ లిస్టులోని వారికి సంబంధించిన సమాచారం కూడా షేర్ అవుతుంది. కేంబ్రిడ్జ్ ఎనలిటికా ఈ సమాచారాన్ని విశ్లేషించడం ద్వారా అమెరికాలో ప్రభావితం చేయగలిగిన ఓటర్లను పెద్ద సంఖ్యలో గుర్తించామని, ట్రంప్ ప్రచారంలో ఈ ఓటర్లను ప్రభావితం చేసేలా వ్యూహాత్మకంగా వ్యవహరించామని ఆ కంపెనీ సియిఓ స్వయంగా ఒప్పుకున్నాడు. ప్రతి అమెరికన్ కు సంబంధించిన 5000 డాటా పాయింట్లు తమ వద్ద ఉన్నాయని చెప్పాడంటే ఎంత భారీస్థాయిలో జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. ఓటర్లను ప్రభావితం చేయడానికి అబద్ధాలు ప్రచారంలో పెడతారు, ఫేక్ న్యూస్ ప్రచారంలో పెడతారు. అమెరికా ఎన్నికల్లో 115ఫేక్ న్యూస్ స్టోరీలు ప్రచారంలో పెట్టారని తెలిసింది. ఫేస్ బుక్ లో ఈ వార్తా కథనాలు మూడు కోట్లకు పైగా షేర్ అయ్యాయి. ఈ ప్రచారం కోసం ట్రంప్ కోట్లాది డాలర్లు కేంబ్రిడ్జ్ ఎనలిటికా కు ఇచ్చారు.

వాస్తవాలకు సంబంధించిన వార్తాకథనాలు బహిరంగంగా ప్రకటించడం, వాటిపై చర్చ జరగడం వేరు. బహిరంగ సభ లు సమావేశాలు, డిబేట్లు వేరు. కాని ఈ సైకోగ్రాఫిక్స్ ద్వారా సంపాదించిన సమాచారంతో ప్రతివ్యక్తిని వ్యక్తిగతంగా లక్ష్యం చేసుకుని అతనిలోని భయాలను మరింత పెంచేలా, అతనికి మాత్రమే వినిపించేలా గుసగుసల రహస్య ప్రచారమిది. ఆ వ్యక్తి అలాంటి భయాలే ఉన్న మరో వ్యక్తికి ఇది షేర్ చేస్తాడు. కాస్త మొరటుగా చెప్పాలంటే, ఎవరికి ఎలాంటి భయాలున్నాయో తెలుసుకుని, ఎవరికి ఎలాంటి ఆశలున్నాయో తెలుసుకుని అందుకు అనుగుణమైన పుకార్లను సృష్టించి ప్రచారంలో పెట్టడమే ఈ వ్యూహం. ఓట్లు వేయడం అన్నది సైద్ధాంతిక ప్రాతిపదికలపై జరగదు. భయాలు, ఆశలు, ఇవి రెండే మనిషిని ప్రభావితం చేస్తాయి. చాలా మందికి తమలో ఉన్న భయాలేమిటో, ఆశలేమిటో స్పష్టంగా తెలియకపోవచ్చు. కాని సైకోగ్రాఫిక్స్ విశ్లేషణ ద్వారా వాటిని కనిపెట్టి ఆ వ్యక్తికి తెలియకుండానే ప్రభావితం చేసే పుకార్ల ప్రచారమే ఇప్పుడు ఆన్ లైన్లో నడుస్తోంది. ఫేస్ బుక్‌లో ప్రతి వ్యక్తి ఏం చేస్తుంటాడన్నది అతని భయాలు, ఆశలను బట్టబయలు చేసే డాటాగా మారుతుంది.

కేంబ్రిడ్జ్ ఎనలిటికా 2010లో బీహారు అసెంబ్లీ ఎన్నికలను కూడా ప్రభావితం చేసిందని ఆ సంస్థ వెబ్ సైటులో చెప్పుకుంది. కేంబ్రిడ్జ్ ఎనలిటికా 2013లో ఏర్పాటైంది. అంతకు ముందు స్ట్రాటజిక్ కమ్యునికేషన్స్ లేబరేటరీ సంస్థలో భాగంగా ఉండేది. యస్ సి ఎల్ సంస్థ భారతదేశంలోను పనిచేసింది. బీహారులో 2010 ఎన్నికల్లో జనతాదళ్ (యు) క్లయింటుగా ఈ సంస్థ సేవలను తీసుకుంది. బీహారులో ఎలక్టోరల్ ఎనాలిసిస్ కోసం ఈ సంస్థ సేవలను జనతాదళ్ (యు) తీసుకుందంట. ఈ విశ్లేషణ ద్వారా తటస్థంగా ఉన్న ఓటర్లను గుర్తించి వారిని ప్రభావితం చేసే వ్యూహాలు అమలు చేశారు. ఈ విధంగా లక్ష్యం చేసుకున్న సీట్లలో 90 శాతం సీట్లలో విజయం సాధించారంట. 2010లో కూడా జనతాదళ్(యు) అధికారంలోనే ఉంది. అయితే ఆ పార్టీ సీట్లు 88 నుంచి 115 కి పెరిగాయి. మొత్తం బీహారు అసెంబ్లీ స్థానాలు 243. బీహారు అసెంబ్లీ ఎన్నికల్లో తమ విశ్లేషణ, తమ వ్యూహాల వల్ల అద్భుతమైన విజయం జనతాదళ్(యు)కు లభించిందని ఇప్పుడు కేంబ్రిడ్జ్ ఎనలిటికా చెప్పుకుంది. 2015 ఎన్నికల్లోను సోషల్ మీడియా ప్రచారం బీహారులో ఎక్కువగానే జరిగింది. నితీష్ కుమార్ ఎవరో తాంత్రికుడిని కౌగిలించుకున్న వీడియో వైరల్ అయ్యింది. దానికి జవాబుగా వెంటనే బిజెపికి చెందిన స్మృతి ఇరానీ రాజస్థాన్‌లో ఒక జ్యోతిష్కుడికి చెయ్యి చూపించుకున్న ఫోటో వైరల్ చేశారు. ఇది ఒక విధంగా ఓటర్లను ప్రభావితం చేసే సోషల్ మీడియా యుద్ధం.

ఎప్పుడో జరిగిన బీహారు ఎన్నికలు కానీ, అమెరికా అధ్యక్ష ఎన్నికలు కానీ, చివరకు లోక్‌సభ ఎన్నికలు కానీ ప్రస్తుతం ఎన్నికల్లో సోషల్ మీడియాను ఉపయోగించడం చాలా ఎక్కువయ్యిందన్నది కాదనలేని యదార్థం. లోక్ సభ ఎన్నికలు 2014లోను సోషల్ మీడియాను విపరీతంగా వాడుకున్నారు. ఫేక్ వార్తలు కూడా ప్రతిసారి ఎన్నికల్లో ప్రచారంలో పెట్టడం చూస్తూనే ఉన్నాం. సోషల్ మీడియా ప్రచారం అంటే పుకార్ల ప్రచారంగా మారింది.

ఈ పుకార్లు వ్యక్తిగతంగా ప్రతి మనిషిని లక్ష్యం చేసుకుని అతని ఓటింగ్ బిహేవియర్ ప్రభావితం చేసేలా కొనసాగుతుంది. ఆధార్‌కు సంబంధించిన ప్రైవసీ వ్యవహారాలు కూడా ఈ కోణంతోనే చూడవలసి ఉంటుంది. ప్రతి మనిషి వ్యక్తిగత జీవితంలోకి తొంగి చూడ్డానికి డిజిటల్ యుగంలో చాలా అవకాశాలు లభించాయి. సోషల్ నెట్ వర్కుల్లో వివిధ పార్టీల ట్రోల్స్ ఎలా పనిచేస్తున్నారో మనకు “ఐ యామ్ ఏ ట్రోల్” పుస్తకంలో స్వాతి చతుర్వేది చాలా వివరంగా తెలియజేశారు. డిజిటల్ యుగంలో ఎన్నికలు పార్టీల మధ్య, సిద్ధాంతాల మధ్య కాదు, పుకార్ల యుద్ధాలుగా సోషల్ మీడియా వేదికలపై నడుస్తున్నాయి. ప్రజాస్వామ్యం ఇప్పుడు ఈ వలలో విలవిలలాడుతోంది.

* సభ

కారుణ్యమరణం – ఇస్లామ్



ముహమ్మద్ ముజాహిద్

‘నా ప్రాణానికి ప్రాణంగా నిన్ను ప్రేమిస్తున్నాను. నీ కోసం ప్రాణమైనా ఇస్తాను’ యువకుడు తన ప్రేయసితో అనే మాటలు. ‘నా ప్రాణమైనా ఇస్తాను. కానీ నీకు చిల్లి గవ్వ కూడా ఇచ్చేది లేదు’ అని డబ్బు విషయంలో తన వారితో తెగేసి చెప్పేమాటలివి. డబ్బును ఎంతగా ప్రేమిస్తారో ఈ మాటలు అర్థం పడతాయి.

‘నా ప్రాణం ఉన్నంత వరకూ పోరాడుతూనే ఉంటాను’ ఓ రాజకీయనాయకుడి డైలాగు. అయితే ప్రాణాలమీదకు వచ్చేసరికి ఇవన్నీ ఒట్టిమాటలేనని తేలిపోతాయి. ఎందుకంటే ప్రాణాలు కాపాడుకోవడానికి మనిషి జీవితంలో దేన్నయినా త్యాగం చేస్తాడు. మనిషి తను బ్రతికేందుకు యావదాస్తి మొత్తాన్ని తాకట్టుపెట్టటానికైనా వెనుకంజవేయడు.

మనిషి పుట్టుకను ఉత్తమ పుట్టుకగా ఖుర్‌ఆన్ అభివర్ణించింది. మనిషి ఆయువు దేవుని అప్పగింత. మనిషి ప్రాణానికి దైవమే యజమాని, ప్రభువు. మనిషి కేవలం కాపలాదారుడే. మనిషికి తన ఆత్మపై, తన ప్రాణంపై ఎలాంటి అధికారమూ లేదు. ఇతరుల ప్రాణాలతో చెలగాటమాడే అధికారం ఏ ఒక్కరికీ లేదు. ఇదే ఖుర్‌ఆన్ మనిషి ప్రాణ రక్షణకిచ్చిన నిర్వచనం. చంపడమూ, చావడమూ రెండూ ఖుర్‌ఆన్ బోధనల స్ఫూర్తికి బద్ధ విరుద్ధమైనవి.

“విషం తిని ఆత్మహత్య చేసుకున్నవాడు నరకాగ్నిలో పడి చేతిలో విషం పట్టుకుని ఎల్లప్పుడూ తింటూఉంటాడు. ఏదైనా లోహపు వస్తువుతో పొడుచుకుని చచ్చినవాడు చేతిలో ఆ లోహపు వస్తువు పట్టుకుని మాటిమాటికీ కడుపులో పొడుచుకుంటూ శాశ్వతంగా నరకాగ్నిలో మాడిపోతూ ఉంటాడు. – (బుఖారి)

పై ప్రవక్త బోధన ‘ఆత్మహత్య’ మహాపాతకంగా తేల్చి చెప్పింది. ఆత్మహత్యను ఇస్లామ్ నిషేధించింది. ఆత్మహత్య ఎంత ఘోరపాపమో, దానికెంతటి శిక్ష అనుభవించాలో పై బోధన స్పష్టం చేస్తుంది. బలవన్మరణానికి ఎలా పాల్పడతాడో ప్రళయ మైదానంలో అల్లాహ్ అతనికి అదే శిక్ష విధిస్తాడు. తుపాకితో కాల్పులు జరుపుకుని ప్రాణాలు తీసుకున్నవాడు ప్రళయం రోజున నరకంలో మాటిమాటికీ కాల్పులు జరుపుకుని తన్ను తాను కాల్చుకుంటూ నరకంలో కాలుతుంటాడు. ఎలా ఆత్మహత్యకు పాల్పడితే ప్రళయం రోజున అదే శిక్ష అతనికి పడుతుంది. అయితే మనిషి తన ఇష్టప్రకారం చనిపోయే స్వేచ్ఛ ఇవ్వాలనే డిమాండు ఈ మధ్యన తరచూ తెరపైకి వస్తోంది. రోగతీవ్రత భరించలేని పరిస్థితిలో చావలేక బ్రతకలేక గడ్డు పరిస్థితుల్ని ఎదురుచూస్తున్న వారికి కారుణ్యమరణం ప్రసాదించాలని కొందరి వాదన.

ఈ కారుణ్య మరణం చర్చకు కారణం నలభై ఏళ్లపాటు మంచానికే పరిమితమై అపస్మారక స్థితిలో ఉండిపోయిన అరుణ అనే నర్సు. ఆమె ముంబైలోని నర్సుగా పనిచేస్తూ అదే ఆసుపత్రిలోని ఒక కీచకుడి చేతిలో అత్యాచారానికి గురైంది. పర్యవసానంగా ఆమె మెదడుకు ఆక్సిజన్ అందక అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. ఆమె చలనరహిత స్థితిని చూసి చలించి ఆమె సన్నిహితులు ఆమెకు కారుణ్య మరణం ప్రసాదించాలని 2011లో సర్వోన్నత న్యాయస్థానం తలుపుతట్టారు. అప్పుడు న్యాయస్థానం కారుణ్య మరణాన్ని తిరస్కరించింది. 2015లో ఆమె కన్నుమూశారు.

2011లో సుప్రీంకోర్టు స్పందిస్తూ కారుణ్య మరణానికి అనుమతినివ్వడమనేది చట్టవ్యతిరేకమని అప్పట్లో ఇచ్చిన ఆ తీర్పుపై పలువురు వైద్యశాస్త్రవేత్తలు, సామాజిక శాస్త్రవేత్తలు సుదీర్ఘకాలం చర్చలు జరిపారు. కారుణ్య మరణం సమ్మతమా కాదా అన్నదానిపై భిన్నాభిప్రాయాలు వచ్చాయి. 2018, మార్చి 9న సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పుకు విరుద్ధంగా మరో తీర్పునిచ్చింది. మరణం వాయిదా వేయడం మినహా మరే ఆశ లేనప్పుడు, శారీరక బాధను భరించలేని దయనీయ పరిస్థితిలో.. రోగి లేదా అతని తరఫున నమ్మకమైన వ్యక్తి అనుమతితో కారుణ్య మరణం ప్రసాదించవచ్చని పేర్కొంటూ పరోక్ష కారుణ్య మరణానికి (పాసివ్ యుథనేసియా) సమ్మతించింది. గౌరవప్రదమైన మరణం కూడా జీవించే హక్కులో భాగమేనని ఈ సందర్భం గా సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రోగిని తన బాధనుంచి విముక్తి కలిగించేందుకే ఈ గౌరవమరణానికి కారణమని సుప్రీం తేల్చి చెప్పింది. రోగి బాధనుంచి ఉపశమనం కలిగించడమే ఈ మరణానికి కారణం. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం మనిషి తన ప్రాణానికి తానే యజమాని. అందుకే తన ప్రాణాన్ని ఎప్పుడు కావాలంటే అప్పుడు తీసుకునే స్వేచ్ఛ అతనికి దక్కాలి. ఇది అతని హక్కు అని కోర్టు తేల్చి చెప్పింది. ఇస్లామ్ స్ఫూర్తి దీనికి పూర్తి విరుద్ధం. ఇస్లామ్ ప్రకారం మనిషి ప్రాణానికి అల్లాహ్ యే యజమాని. పుట్టుక, మరణం అన్నీ అల్లాహ్ చేతిలోనే ఉన్నాయి. ఆయనే మన ప్రాణంపై సర్వాధికారం కలిగి ఉన్నాడు. ప్రతీ మనిషికి ప్రాణమనే గొప్ప అప్పగింతను అల్లాహ్ మన చేతిలో పెట్టాడు. ఎవరి ప్రాణాన్ని వాళ్ల సంరక్షించడం, కాపాడుకోవడం వాళ్ల వాళ్ల బాధ్యత అన్నది ఇస్లామ్ ఇచ్చే నిర్వచనం. జీవితాన్ని తన ఇష్ట ప్రకారం గడపలేడు. జీవితంలోని ప్రతీక్షణం తన ప్రాణానికి ప్రభువైన అల్లాహ్ అనుజ్ఞ ప్రకారమే గడపాలన్నదే ఇస్లామ్ సిద్ధాంతం. మనిషి తన హక్కులను కాపాడుకోవడమే కాదు, తోటి వారి హక్కులకు కూడా హామీగా నిలవాలి. ఏ సాకుతో ఆత్మహత్య చేసుకున్నా అది ముమ్మాటికీ నిషిద్ధమే. రోగ తీవ్రతతో రోగి మంచంలో ఎంత వేదన భరించాల్సి వచ్చినా మృత్యువు ముంచుకొచ్చే వరకు ఆగాల్సిందే. జీవించడం అనేది అతని హక్కు. కారుణ్యమరణం వల్ల కొన్ని సామాజిక దౌష్ట్యాలు కూడా పుట్టుకొచ్చే ప్రమాదమూ లేకపోలేదు. రోగి ఆస్తులపై కన్నేసి ఉంచిన బంధువులు అతన్ని వీలయినంత త్వరగా కాటికి పంపేసి ఆస్తి కాజేయాలనే కుట్రతో కారుణ్య మరణాన్ని దుర్వినియోగం చేయవచ్చు. అంతేకాక రోగికి వైద్యం అందించేందుకు ఖర్చు భరించలేక త్వరగా చంపేస్తే పీడ విరగడ అవుతుందనే దురుద్దేశమూ పుడుతుంది.

రోగ పీడితులు వీలయినంత మంచి వైద్యం చేయించుకుని స్వస్థత పొందాలన్నది ప్రవక్త బోధన సారాంశం. తీవ్రమైన ఆకలి బాధతో ఉండి కూడా రోజులతరబడి పస్తులుండటం వాంఛనీయం కాదు. కావాలని పస్తులుండి తనకు తాను తన ఆరోగ్యాన్ని క్షీణింపచేసుకొని మృత్యుఒడికి చేరుకోవడం మహాపాపం. ఇది కూడా ఆత్మహత్యలాంటిదే. ‘గౌరవప్రదమైన మరణం’ పరోక్ష కారుణ్య మరణానికి అనుమతినివ్వడం ఎంతకూ సమంజసం కాదు. దీనివల్ల కొత్తకొత్త సమస్యలు పుట్టుకొస్తాయి. రోగికి మోతాదుకు మించి మందులిచ్చి మరణానికి చేరువయ్యేలా చేయడం, చికిత్సను నిలుపుచేసి పరోక్షంగా మృత్యువుకు దగ్గరచేయడం రెండూ హత్యకిందకే వస్తాయి. నిండుప్రాణాన్ని బలిగొనే హక్కు ఏ ఒక్కరికీ లేదు. అనారోగ్యం బారిన పడేవారికి, వృద్ధాప్యం మీదపడే వారికి ఇది ప్రాణంతకంగా కూడా పరిణమించవచ్చని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. వీలయినంత త్వరగా పీడవదిలించుకోవాలనే దురుద్దేశం ఉన్నవారు, ఆస్తులను కాజేయాలనే దుర్బుద్ధి ఉన్నవారు రోగిని ఒప్పించే ప్రమాదమూ లేకపోలేదు. కారుణ్యం శాపంలా మారుతుందా?

ఎన్ఎండీసీ, హైదరాబాద్

* సంస్థ: నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ), హైదరాబాద్.
* వర్క్ లొకేషన్: నాగర్నార్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్, జగదల్‌పూర్, చత్తీస్‌గఢ్.
* పోస్టులు: జూనియర్ మేనేజర్, డిప్యూటీ మేనేజర్
* ఖాళీలు: 11 అర్హత: ఆయా సబ్జెక్టులు/ బ్రాంచుల్లో బీఈ/ బీటెక్, డిగ్రీ, పీజీ, డిప్లొమా. దివ్యాంగ అభ్యర్థులు మాత్రమే అర్హులు.
* వయసు: 55 ఏళ్లకు మించకూడదు.
* ఎంపిక: ఇంటర్వ్యూ ఆధారంగా.
* దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్.
* చివరితేది: 14.05.2018
* వెబ్‌సైట్: https://www.nmdc.co.in/




గమ్యం


జీకే – కరెంట్ అఫైర్స్

అంతర్జాతీయ దినోత్సవాలు

ప్రపంచ నవ్వుల దినోత్సవం (జనవరి 10)
ప్రపంచ శాంతి దినోత్సవం (జనవరి19)
అంతర్జాతీయ ఉత్పాదక దినోత్సవం, అంతర్జాతీయ ఎక్సైజ్ దినోత్సవం (జనవరి 25)



అంతర్జాతీయ కస్టమ్స్ దినోత్సవం (జనవరి 26)
ప్రేమికుల దినోత్సవం (ఫిబ్రవరి 14)
ప్రపంచ మాతృభాషా దినోత్సవం (ఫిబ్రవరి 21)
అంతర్జాతీయ మహిళా దినోత్సవం (మార్చి 8)
ప్రపంచ వినియోగదారుల దినోత్సవం, ప్రపంచ వికలాంగుల దినోత్సవం (మార్చి 15)
ప్రపంచ అటవీ దినోత్సవం, అంతర్జాతీయ జాతి వివక్ష నిర్మూలన దినోత్సవం (మార్చి 21)
ప్రపంచ నీటి దినోత్సవం (మార్చి 22)
ప్రపంచ వాతావరణ దినోత్సవం, వరల్ మెటలర్జికల్ డే (మార్చి 23)
ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం (మార్చి 24)
ఆల్ ఫూల్స్ డే (ఏప్రిల్ 1)
ప్రపంచ ఆరోగ్య దినోత్సవం (ఏప్రిల్ 7)
ప్రపంచ అంతరిక్ష యాత్ర, విమానయాన దినోత్సవం (ఏప్రిల్ 12)
ప్రపంచ హీమోఫీలియా దినోత్సవం (ఏప్రిల్ 16)
ప్రపంచ సాంస్కృతిక దినోత్సవం (ఏప్రిల్ 18)
ప్రపంచ ధరిత్రీ దినోత్సవం (ఏప్రిల్ 22)
ప్రపంచ పుస్తకాల, కాపీరైట్ దినోత్సవం (ఏప్రిల్ 23)
చెర్నోబిల్ దినం, ప్రపంచ అహింసా దినోత్సవం, ప్రపంచ మేధోహక్కుల దినోత్సవం (ఏప్రిల్ 26)
ప్రపంచ పశు చికిత్సా దినోత్సవం (ఏప్రిల్ 28)
ప్రపంచ నృత్య దినోత్సవం (ఏప్రిల్ 29)
అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మే 1)
పత్రికా స్వేచ్ఛా దినోత్సవం, అంతర్జాతీయ శక్తి దినోత్సవం (మే 3)
ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవం (మే 5)
ప్రపంచ పెంపుడు జంతువుల దినోత్సవం (మే 6)
ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం (మే 8)
ప్రపంచ తలసీమియా దినోత్సవం (మే 9)
అంతర్జాతీయ నర్సుల దినోత్సవం (మే 12)
ప్రపంచ టెలికాం దినోత్సవం (మే 17)
ప్రపంచ మ్యూజియాల దినోత్సవం (మే 18)
ప్రపంచ థైరాయిడ్ దినోత్సవం (మే 25)
ఎవరెస్ట్ దినోత్సవం (మే 29)
పొగాకు వ్యతిరేక దినోత్సవం (మే 31)
అంతర్జాతీయ పాల దినోత్సవం (జూన్ 1)
అంతర్జాతీయ అమాయక, పీడిత బాలల దినోత్సవం (జూన్ 4)
ప్రపంచ పర్యావరణ దినోత్సవం (జూన్ 5)
ప్రపంచ రక్తదాన దినోత్సవం (జూన్ 14)
ప్రపంచ శరణార్థుల దినోత్సవం (జూన్ 20)
అంతర్జాతీయ మత్తు పదార్థాల దుర్వినియోగ వ్యతిరేక దినోత్సవం (జూన్ 26)
ప్రపంచ డయాబెటిక్ దినోత్సవం (జూన్ 27)
ప్రపంచ వైద్యుల దినోత్సవం, ప్రపంచ ఆర్కిటెక్చర్ డే (జులై 1)
అంతర్జాతీయ సహకార దినోత్సవం (జులై 3)
ప్రపంచ రేబీస్ దినోత్సవం, ప్రపంచ జంతు కారక వ్యాధి దినోత్సవం (జులై 6)
ప్రపంచ జనాభా దినోత్సవం (జులై 11)
ప్రపంచ తల్లిపాల దినోత్సవం (ఆగస్టు 1)
ప్రపంచ గిరిజన దినోత్సవం (ఆగస్టు 9)
అంతర్జాతీయ యువజన దినోత్సవం, అంతర్జాతీయ గ్రంథాలయాధికారుల దినోత్సవం (ఆగస్టు 12)
అంతర్జాతీయ స్వదేశీవాదుల దినోత్సవం (ఆగస్టు 18)
ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం (ఆగస్టు 19)
కొబ్బరికాయల దినోత్సవం (సెప్టెంబర్ 2)
అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం (సెప్టెంబర్ 8)
ఇంజనీరుల దినోత్సవం (సెప్టెంబర్ 15)
ప్రపంచ ఓజోన్ దినోత్సవం (సెప్టెంబర్ 16)



అల్జీమర్స్ దినోత్సవం (సెప్టెంబర్ 21)
రోజ్ డే (క్యాన్సర్ రోగగ్రస్థుల సంక్షేమం) (సెప్టెంబర్ 22)
ప్రపంచ హృద్రోగ దినోత్సవం (సెప్టెంబర్ 24)
ప్రపంచ బధిరుల దినోత్సవం (సెప్టెంబర్ 26)
ప్రపంచ పర్యాటక దినోత్సవం (సెప్టెంబర్ 27)
అంతర్జాతీయ అహింసా దినోత్సవం, ప్రపంచ జంతువుల దినోత్సవం, ప్రపంచ శాకాహార దినోత్సవం (అక్టోబరు 2)
ప్రపంచ ఆవాస దినోత్సవం (అక్టోబరు 3)
ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం, ప్రపంచ జంతు సంక్షేమ దినోత్సవం (అక్టోబరు 4)
ప్రపంచ ఉపాధ్యాయుల దినోత్సవం (సెప్టెంబర్ 5)



ప్రపంచ తపాలా దినోత్సవం (అక్టోబరు 9)
ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం (అక్టోబరు 10)
ప్రపంచ దృష్టి దినోత్సవం (అక్టోబరు 12)
ప్రపంచ ప్రకృతి వైపరీత్యాల నిరోధక దినోత్సవం (అక్టోబరు 13)
ప్రపంచ ప్రయాణాల దినోత్సవం (అక్టోబరు 14)
ప్రపంచ అంధుల సహాయక దినోత్సవం (వరల్ వైట్ కేన్ డే) (అక్టోబరు 15)
ప్రపంచ ఆహార దినోత్సవం (అక్టోబరు 16)
అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం (అక్టోబరు 17)
ప్రపంచ అయోడిన్ లోప నివారణ దినోత్సవం (అక్టోబరు 21)
ఐక్యరాజ్య సమితి దినోత్సవం, వరల్ డెవలప్‌మెంట్ ఇన్ఫర్మేషన్ డే (అక్టోబరు 24)
ప్రపంచ పొదుపు దినోత్సవం (అక్టోబరు 30)
ప్రపంచ న్యూమోనియా దినోత్సవం (నవంబర్ 2)
ప్రపంచ రవాణా దినోత్సవం (నవంబర్ 10)
ప్రపంచ మధుమేహ (డయాబెటిస్) దినోత్సవం (నవంబర్ 14)
ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ సహన దినం (నవంబర్ 16)
ప్రపంచ బాలల దినోత్సవం (నవంబర్ 20)
మహిళలపై హింసా నిరోధక దినోత్సవం (నవంబర్ 25)
ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం (డిసెంబర్ 1)
ప్రపంచ కంప్యూటర్ అక్షరాస్యతా దినోత్సవం (డిసెంబర్ 2)
అంతర్జాతీయ వికలాంగుల/ బలహీనుల దినోత్సవం (డిసెంబర్ 3)
మానవ హక్కుల దినోత్సవం (డిసెంబర్ 10)
యూనిసెఫ్ దినోత్సవం (డిసెంబర్ 11)

వివిధ దేశాల దినోత్సవాలు

క్యూబా విమోచన దినోత్సవం, పాలస్తీనా విప్లవ దినోత్సవం, సూడాన్ జాతీయ దినోత్సవం (జనవరి 1)
మయన్మార్ స్వాతంత్ర్య దినోత్సవం (జనవరి 4)
ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ స్థాపక దినోత్సవం (జనవరి 8)
క్రొయేషియా జాతీయ దినోత్సవం (జనవరి 15)
ఆస్ట్రేలియా జాతీయ దినోత్సవం (జనవరి 26)
శ్రీలంక జాతీయ దినోత్సవం (ఫిబ్రవరి 4)
ఇరాన్ జాతీయ దినోత్సవం (ఫిబ్రవరి 11)
కువైట్ జాతీయ దినోత్సవం (ఫిబ్రవరి 25)
ఈజిప్ట్ స్వాతంత్ర్య దినోత్సవం (ఫిబ్రవరి 28)
మారిషస్ గణతంత్ర దినోత్సవం (మార్చి 12)
బంగ్లాదేశ్ జాతీయ దినోత్సవం (మార్చి 26)



జింబాబ్వే స్వాతంత్ర్య దినోత్సవం (ఏప్రిల్ 18)
దక్షిణాఫ్రికా స్వాతంత్ర్య దినోత్సవం (ఏప్రిల్ 27)
ఆఫ్రికా దినోత్సవం (మే 23)
కామన్‌వెల్త్ దినోత్సవం (మే 24)
గయానా స్వాతంత్ర్య దినోత్సవం (మే 26)
దక్షిణాఫ్రికా జాతీయ దినోత్సవం (మే 31)
ఆఫ్రికా బాలల దినోత్సవం (జూన్ 16)
గోవా విప్లవ దినోత్సవం (జూన్ 17)
అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం (జులై 4)
అల్జీరియా జాతీయ దినోత్సవం (జులై 5)
అర్జెంటీనా జాతీయ దినోత్సవం (జులై 9)
ఫ్రాన్స్ జాతీయ దినోత్సవం (జులై 14)
నాగసాకి డే (ఆగస్టు 9)
పాకిస్థాన్ స్వాతంత్ర్య దినోత్సవం (ఆగస్టు 14)
బహ్రెయిన్ స్వాతంత్ర్య దినోత్సవం, కొరియా స్వాతంత్ర్య దినోత్సవం (ఆగస్టు 15)
ఇండోనేషియా స్వాతంత్ర్య దినోత్సవం (ఆగస్టు 17)
ఖతార్ స్వాతంత్ర్య దినోత్సవం (సెప్టెంబర్ 3)
న్యూజిలాండ్ స్వాతంత్ర్య దినోత్సవం (సెప్టెంబర్ 26)
నైజీరియా స్వాతంత్ర్య దినోత్సవం (అక్టోబర్ 1)
ఉగాండా స్వాతంత్ర్య దినోత్సవం (అక్టోబర్ 9)
జాంబియా స్వాతంత్ర్య దినోత్సవం (అక్టోబర్ 24)
మలేషియా స్వాతంత్ర్య దినోత్సవం (అక్టోబర్ 31)
యు.ఎ.ఇ. స్వాతంత్ర్య దినోత్సవం (డిసెంబర్ 2)
ఐర్లాండ్ స్వాతంత్ర్య దినోత్సవం (డిసెంబర్ 6)
కెన్యా స్వాతంత్ర్య దినోత్సవం (డిసెంబర్ 12)
బంగ్లాదేశ్ విమోచన దినోత్సవం (డిసెంబర్ 16)

వివిధ రాష్ట్రాల దినోత్సవాలు

రాజస్థాన్ దినోత్సవం (మార్చి 30)
మహారాష్ట్ర దినోత్సవం (మే 1)
తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం (జూన్ 2)
గోవా విప్లవ దినోత్సవం (జూన్ 17)
గోవా విముక్తి దినోత్సవం (డిసెంబర్ 19)
అరుణాచల్ ప్రదేశ్ దినోత్సవందినోత్సవం (డిసెంబర్ 20).



'నీది నాది ఒకే కథ' ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో శర్వానంద్, నారారోహిత్, శ్రీవిష్ణు, దేవీప్రసాద్, వేణు ఊడుగుల తదితరులు

శ్రీవిష్ణుకు పెద్ద ఫ్యాన్‌నయ్యా : శర్వానంద్

శ్రీవిష్ణు హీరోగా వేణు ఊడుగుల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'నీది నాది ఒకే కథ'. అరాన్ మీడియా వర్క్స్, శ్రీవైష్ణవి క్రియేషన్స్ బ్యానర్‌లపై ప్రశాంతి, కృష్ణ విజయ్, అట్లూరి నారాయణరావు కలిసి నిర్మించిన చిత్రమిది. ఈ చిత్రం శుక్రవారం విడుదలకానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నారా రోహిత్, శర్వానంద్, రాజ్ కందుకూరి, జి.నాగేశ్వరరెడ్డి, దేవీ ప్రసాద్, సురేష్ బొబ్బిలి తదితర ప్రముఖులతో పాటు చిత్ర బృందం పాల్గొంది. ఈ సందర్భంగా శర్వానంద్ మాట్లాడుతూ ''ట్రైలర్ చూడగానే ఈ సినిమా చూడాలనిపించింది. ఇలాంటి మంచి సినిమాలు ఈమధ్య ఎక్కువగా వస్తున్నాయి. గత ఏడాది, ఈ ఏడాది కొత్త దర్శకులు మంచి కథలతో సినిమాలు చేస్తున్నారు. ట్రైలర్ చూసి శ్రీవిష్ణుకి నేను పెద్ద ఫ్యాన్ అయ్యాను. ఇది నా కథలాగా అనిపించింది''అని అన్నారు. నారా రోహిత్ మాట్లాడుతూ ''ఈ కథను శ్రీవిష్ణు నాకు చెప్పినప్పుడు నా స్నేహితుడు ఒకడు గుర్తుకువచ్చాడు. తను ఇంటర్ చదివే రోజుల్లో నేషనల్ బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపికైతే ఇంట్లోవాళ్లు ఒప్పుకోకపోవడంతో తను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయ్యాడు. అలాంటి వాళ్ల జీవితాలను తెరపై చూపే చిత్రమిది. అందరికీ ఖచ్చితంగా కనెక్ట్ అవుతుంది''అని చెప్పారు. శ్రీవిష్ణు మాట్లాడుతూ ''దర్శకుడు వేణు ఈ కథ చెప్పగానే ఈ సినిమా చేయాలనిపించింది. పక్కింట్లోనో, ఎదురింట్లోనే ఉంటూ నన్ను గమనించి ఈ సినిమా కథ రాసుకున్నారనిపించింది. నా జీవితాన్ని సినిమాగా చూసుకోవాలని ఈ చిత్రం చేశాను. ఈ సినిమా చేసినందుకు చాలా గర్వంగా ఉంది. తల్లిదండ్రులు తమ పిల్లల్ని నమ్మాలని చెప్పే చిత్రమిది. అందరికీ దగ్గరగా ఈ సినిమా ఉంటుంది''అని పేర్కొన్నారు.

కళామతల్లిపై అభిమానం తగ్గలేదు

మలయాళంలో సూపర్ డూపర్ హిట్ అయిన 'ఆనందం' చిత్రాన్ని అదే పేరుతో సుఖీభవ మూవీస్ అధినేత ఎత్తరి గురురాజ్ తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. గణేశ్‌రాజ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. మలయాళం స్టార్ హీరో నివిన్ పాలీ గెస్ట్ రోల్ చేసిన ఈ చిత్రంలోని నటీనటులు అందరూ దాదాపుగా కొత్తవారే. సీనియర్ నిర్మాత ఆర్.సీతారామరాజు సమర్పిస్తున్న ఈ చిత్రానికి వీరా వెంకటేశ్వరరావు, వి.ఆర్.బి.రాజు, రవివర్మ చిలువూరి సహ నిర్మాతలు. ఈ సినిమా గురించి నిర్మాత ఎత్తరి గురురాజ్ మాట్లాడుతూ చెప్పిన విశేషాలు...

మధురమైన సన్నివేశాలతో...

'ఆనందం' చిత్రాన్ని చూసిన ప్రతి ఒక్కరికీ 'హ్యాపీడేస్'ను చూస్తున్న ఫీలింగ్ కలుగుతుంది. కాలేజీ విద్యార్థులు పిక్నిక్ వెళ్లినప్పుడు చోటుచేసుకున్న మధురమైన సన్నివేశాలతో ఈ చిత్రం తెరకెక్కింది. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా సినిమా రూపుదిద్దుకుంది.

కాలేజ్ రోజులను గుర్తుచేస్తుంది...

సినిమా యూత్‌కి బాగా కనెక్ట్ అవుతుంది. అదేవిధంగా చిన్న, పెద్ద అనే తేడా లేకుండా అందరికీ తమ కాలేజ్ రోజులను గుర్తుచేస్తుంది ఈ చిత్రం. అద్భుతమైన ఫొటోగ్రఫీ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది.

ఈ సినిమా మంచి ఉదాహరణ...

ఈ చిన్న సినిమాలో మలయాళ స్టార్ హీరో నివిన్ పాలీ అతిథి పాత్రలో నటించడం హైలైట్‌గా ఉంటుంది. మన వద్ద చిన్న సినిమాలను బతికించాలని చెబుతుంటారు. కానీ ఏ ఒక్క స్టార్ కూడా చిన్న సినిమాలను ప్రోత్సహించడానికి ముందుకు రారు. మలయాళంలో స్టార్ హీరోలు చిన్న సినిమాలకు అందిస్తున్న సహకారానికి ఈ చిత్రం ఒక మంచి ఉదాహరణ.

తప్పకుండా ఆదరిస్తారు...

కథను నమ్ముకొని కొత్త ఆర్టిస్టులతో కేవలం రూ.4 కోట్లతో రూపొందించిన సినిమా ఇది. ఈ సినిమా మలయాళంలో రూ.20 కోట్లు కలెక్ట్ చేసింది. మంచి కథతో తెరకెక్కిన చిత్రాలను తెలుగు ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారు. సరైన కంటెంట్ లేకపోతే ఎంత పెద్ద స్టార్ హీరో సినిమానైనా రిజెక్ట్ చేస్తారు. అందుకే మంచి కథతో తెరకెక్కిన ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నాము.

అందుకే మా బ్యానర్‌ను స్థాపించా...

మంచి నటుడిగా పేరు తెచ్చుకోవాలని చిత్ర పరిశ్రమలోకి వచ్చాను. కానీ నటుడిగా మనుగడ కష్టమైపోతుందేమోనని భావించి రియల్ ఎస్టేట్ రంగంలోకి అడుగుపెట్టాను. కానీ కళామతల్లిపై అభిమానం తగ్గలేదు. అందుకే సుఖీభవ మూవీస్ బ్యానర్‌ను స్థాపించి సినిమాలు నిర్మిస్తున్నాను.

త్వరలోనే ఓ క్రేజీ ప్రాజెక్ట్...

మా బ్యానర్‌లో భారీ సినిమాలు చేయాలనుంది. మంచి కథ ఉన్నా స్టార్ హీరోలు కాల్షీట్లు ఇవ్వరు. అందుకే కొన్ని రోజుల వరకు డబ్బింగ్ సినిమాలు చేయాలనుకుంటున్నాను. అయితే త్వరలోనే ఓ క్రేజీ ప్రాజెక్ట్‌ను నిర్మించాలనుకుంటున్నాను. ఆ సినిమా వివరాలను త్వరలోనే వెల్లడిస్తాను.



ఎత్తరి గురురాజ్



మనీష్‌బాబు, అక్షిత

'ప్రశ్నిస్తా'నంటున్న మనీష్‌బాబు

జనం ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై తన కుమారుడు మనీష్‌బాబును హీరోగా పరిచయం చేస్తూ సత్యారెడ్డి నిర్మిస్తున్న చిత్రం 'ప్రశ్నిస్తా'. రాజా వన్నెంరెడ్డి దర్శకత్వంలో తెరకెక్కే ఈ చిత్రాన్ని హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో సినీ, రాజకీయ ప్రముఖుల సమక్షంలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ మూవీలో హీరో మనీష్‌బాబుకు జోడీగా హీరోయిన్ అక్షిత నటిస్తుంది. ఈ సందర్భంగా నిర్మాత సత్యారెడ్డి రెడ్డి మాట్లాడుతూ ''గత 20 సంవత్సరాలుగా తెలుగు చిత్ర పరిశ్రమలో ఉంటూ పలు చిత్రాలను నిర్మించిన మా సంస్థ నుండి మనీష్‌బాబును హీరోగా పరిచయం చేస్తూ 'ప్రశ్నిస్తా' మూవీని నిర్మిస్తున్నాం. దర్శకుడు రాజా వన్నెంరెడ్డి గత రెండేళ్లుగా మనీష్‌కు నటనలో శిక్షణనిస్తూ డాన్స్‌లు, ఫైట్స్ నేర్పిస్తూ అతన్ని హీరోగా పరిచయం చేస్తున్నాడు. తెలుగమ్మాయి అక్షిత ఈ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంటుంది''అని అన్నారు. దర్శకుడు రాజా వన్నెంరెడ్డి మాట్లాడుతూ ''నిర్మాత సత్యారెడ్డి నన్ను నమ్మి తన కుమారుడు మనీష్‌బాబును నాకు అప్పగించారు. మనీష్‌బాబును మంచి హీరోగా తీర్చిదిద్దడానికి కావాల్సిన శిక్షణను ఇప్పించి అతన్ని చిత్ర పరిశ్రమకు పరిచయం చేస్తున్నాం''అని చెప్పారు. హీరో మనీష్‌బాబు మాట్లాడుతూ ''రాజా వన్నెంరెడ్డి మా ఇంట్లో మనిషిగా కలిసి పోయి నన్ను హీరోగా పరిచయం చేస్తున్నారు. మంచి కథాంశంతో వస్తున్న ఈ చిత్రం అందరికీ నచ్చుతుందని నమ్ముతున్నాను''అని తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః యోగిరెడ్డి, మ్యూజిక్ః ఎల్.ఎం.ప్రేమ్, ఎడిటర్ః కోటగిరి వెంకటేశ్వరరావు, రచయితః రాజేంద్రకుమార్.



అమీజాక్సన్

సినిమాలకు గుడ్‌బై?

ముట్టుకుంటే మాసిపోతుందన్నట్లుగా ఉంటుంది అందాలతార అమీజాక్సన్. ఎంతోమంది కలల రాణిగా నిలిచిన ఆమె తాజాగా ఓ షాకింగ్ నిర్ణయాన్ని తీసుకుందంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఎప్పుడు ఎవరేం చేస్తారో అర్థం కాని రీతిలో ఇటీవల సినిమా ఇండస్ట్రీలో పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. పెళ్లి ఎప్పుడు? అంటే అప్పుడేనా అంటున్న నటీమణులు గుట్టుచప్పుడు కాకుండా పెళ్లి చేసేసుకుంటున్న వైనం ఒక్కొక్కటిగా తెరపైకి వస్తున్న వేళ... తాజాగా అమీ జాక్సన్ సంచలన నిర్ణయాన్ని తీసుకుందని చెబుతున్నారు. ఇక కెనడాకు చెందిన అమీ... దర్శకుడు విజయ్ దృష్టిలో పడటంతో ఆమెను 'మదరాసు పట్టణం' చిత్రంలో హీరోయిన్‌గా తీసుకున్నాడు. ఈ చిత్రం ఘన విజయం సాధించడంతో మంచి క్రేజ్ తెచ్చుకున్న ఈ బ్యూటీ ఆతర్వాత తమిళ్, తెలుగు చిత్రాలతో పాటు బాలీవుడ్ సినిమాలు కూడా చేసి ప్రేక్షకులను అలరించింది. శంకర్ దర్శకత్వంలో సౌతిండియా సూపర్‌స్టార్ రజనీకాంత్‌తో కలిసి అమీజాక్సన్ నటించిన రోబో సీక్వెల్ '2.0' చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. అయితే కొత్త సినిమా అవకాశాలు తగ్గిపోవడంతో తన కెరీర్ విషయంలో ఆమె కీలక నిర్ణయాన్ని తీసుకున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం అమీజాక్సన్ ఒక ఇంగ్లీష్ సీరియల్‌లో నటిస్తోంది. అయితే ఆమె భారతీయ సినిమాల్లో నటించకూడదన్న నిర్ణయాన్ని తీసుకున్నట్లు చెబుతున్నారు. త్వరలోనే ఆమె ఆఫ్రికా దేశమైన మొరాకోలో సెటిల్ కావాలన్న నిర్ణయాన్ని తీసుకున్నట్లుగా చెబుతున్నారు. అసలు ఈ వార్తల్లో ఎంత వరకు నిజం ఉందో తెలుసుకోవాలంటే కొంత కాలం ఆగాల్సిందే.

ఇంద్రావతి జలాలు కాళేశ్వరానికి : కేంద్ర మంత్రి గడ్కరీ



న్యూఢిల్లీ : ఇంద్రావతి నది మిగులు జలాలను కాళేశ్వరం డ్యాంకు మళ్లిస్తారని కేంద్ర జలవనరుల మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. దేశంలో జల సంరక్షణకు అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రపంచ జలదినోత్సవం సందర్భంగా ఫిక్కి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గడ్కరీ మాట్లాడారు. మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లాలోని ఇంద్రావతి నది మిగులు జలాలు సాధారణంగా గోదావరిలో కలుస్తాయి. వీటిని తొలుత కాళేశ్వరం డ్యాంకు తరువాత మరో రెండు డ్యాంలకు అక్కడి నుంచి కావేరీ చివరి ఆయకట్టు భూములకు తరలించడం జరుగుతోందని వివరించారు. ఇదే విధంగా పోలవరం డ్యాం దిగువ జలాలను కావేరీకి మళ్లించడం జరుగుతోందని తెలిపారు. ఈ విధంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నీటి కటకటను తీర్చడం జరుగుతోందని వివరించారు. వివిధ మార్గాల ద్వారా జల ఆదాకు ప్రాధాన్యతను ఇస్తున్నట్లు చెప్పారు. పోలవరం డ్యాం జలాలను కృష్ణా నదిలోకి అక్కడి నుంచి కర్నాటకలోని పెన్నార్ నదికి అక్కడి నుంచి కావేరీకి తరలిస్తున్నట్లు తెలిపారు. ఒక అంచనా ప్రకారం 3000 టిఎంసి అడుగుల గోదావరి జలాలు సముద్రంలోకి తరలిపోతున్నాయి. వీటిలో కనీసం వేయి టిఎంసి అడుగుల నీరు కాపాడుకున్న భారీ స్థాయిలో సామాజిక ఆర్థిక మార్పులు తీసుకురావచ్చునని మంత్రి తెలిపారు.

జిల్లా, మండల రైతు సమితులకు శిక్షణ

రాష్ట్ర రైతు సమన్వయ సమితి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి





మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్ర రైతు సమన్వయ సమితి ఛైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత గుత్తా సుఖేందర్‌రెడ్డి తొలి రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని, జిల్లా సమితుల కోఆర్డినేటర్ల సమావేశాన్ని నగరంలో బుధవారం నిర్వహించారు. జిల్లా సమితుల కోఆర్డినేటర్ల సమావేశంలో విధి విధానాలు, బాధ్యతలు, వివిధ స్థాయి సమితులతో సమన్వయం తదితర అంశాలపై గుత్తా చర్చించారు. త్వరలోనే జిల్లా, మండల రైతు సమన్వయ సమితుల్లోని సభ్యులకు ఏడు విడతలుగా శిక్షణా శిబిరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒక్కో విడత శిక్షణను రెండు రోజుల పాటు నిర్వహిస్తామని పత్రికలకు విడుదల చేసిన ఒక ప్రకటనలో గుత్తా తెలిపారు. రైతులకు సంబంధించిన సమస్త, సమగ్ర సమాచారం జిల్ల కోఆర్డినేటర్ల దగ్గర ఎప్పుడూ సిద్ధంగా ఉండాలని, రైతుల సంక్షేమమే వారి ప్రధాన బాధ్యతగా గుర్తించాలని స్పష్టం చేశారు. వ్యవసాయశాఖతో పాటు అనుబంధ శాఖల అధికారులతో కూడా సమన్వయంలో ఉండాలని, రైతులకు అవసరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు చేరవేసే దూతలుగా ఉండాలని వివరించారు. ప్రభుత్వం నుంచి సమాచారం వీలైనంత తొందరగా అందించడంతో పాటు రైతులకు మేలు జరిగేలా చూడడానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అభివృద్ధికి వారధులుగా నిలవాలని, రైతు లు నిరాశా నిస్పృహలకు లోనుకాకుండా భరోసాగా, అండగా నిలవాలని తెలిపారు. పంట ఉత్పత్తుల కొనుగోళ్ళు సమగ్రంగా, సక్రమంగా, సకాలంలో జరి గేలా రైతు సమన్వయ సమితి సభ్యులు చొరవ తీసుకోవాలని, ఇందు కోసం స్థానిక అధికారులతో సంప్ర దింపులు జరుపుతూ సమన్వయం చేసుకోవాలని వారికి సూచించారు. రైతుల వేదికల నిర్మాణానికి అవసరమైన భూములను గుర్తించాలని, జిల్లా అధికార యంత్రాంగంతో సమన్వయం చేసుకోవాల్సిన బాధ్యత జిల్లా సమితుల కోఆర్డినేటర్లదేనని స్పష్టం చేశారు.

రైతు వేదికలకు నిర్దిష్ట లక్ష్యంతో పాటు బహుళ ప్రయోజనాలు ఉన్నాయని, రైతులతో పాటు వ్యవసాయ అధికారులు, ప్రతి ఐదు వేల ఎకరాలకు ఒకరు చొప్పున ఉండే వ్యవసాయ విస్తరణాధికారులు కూడా కూర్చునే సమావేశ స్థలంగా ఉంటుందని, ఆ తీరులో వేదికల నిర్మాణం జరగాలని స్పష్టం చేశారు. ఇప్పటికే కొన్నిచోట్ల స్థలాన్ని విరాళంగా ఇవ్వడానికి కొద్దిమంది రైతులు ముం దుకొచ్చారని,అలాంటి ఏర్పాట్లు లేనిచోట ప్రభుత్వ భూ ములను తీసుకుని వేదికల భవనాలను నిర్మిం చడంపై దృష్టి పెట్టాలని కోఆర్డినేటర్లకు గుత్తా సూచి ంచారు.

తొలి రాష్ట్ర కార్యవర్గ సమావేశం

రాష్ట్ర రైతు సమన్వయ సమితి తొలి కార్యవర్గ సమావేశం చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగింది. మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జగన్‌మోహన్, కార్యవర్గ సభ్యులు పార్థసారధి (వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి), ఎల్ వెంకట్రామిరెడ్డి (ఉద్యానవనశాఖ డైరెక్టర్), లక్ష్మీ బాయి (వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్),సాయి ప్రసాద్ (ఆర్థికశాఖ సంయుక్త కార్యదర్శి),'అపెడా' (అగ్రికల్చరల్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొ డక్ట్స్ అండ్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ) డిప్యూటీ జనర ల్ మేనేజర్ సుధాకర్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. రైతు సమన్వయ సమితి నిర్మాణం, విధి విధానాలు, విధులు, బాధ్యతలు, కార్యవర్గంను విస్తృతపర్చడం తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. పంటల కొనుగోళ్ళలో మార్క్ ఫెడ్ (మార్కెటింగ్ ఫెడరేషన్), ఆయిల్ ఫెడ్, పౌర సరఫ రాల శాఖ తదితర వ్యవస్థల ప్రమేయం ఉంటుంది కాబట్టి వాటి డైరెక్టర్లు లేదా మేనేజింగ్ డైరెక్టర్లు లేదా ఉన్నతాధికారులను రాష్ట్ర రైతు సమన్వయసమితి డైరెక్టర్ల బోర్డులో సభ్యులుగా చేర్చుకోవాల్సిన అవసరం ఉందని గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రతిపాదించారు. ప్రస్తుతం బోర్డులో ఉన్న డైరెక్టర్ల సంఖ్య పెరగాల్సిన అవసరాన్ని కూడా గుత్తా సుఖేందర్ రెడ్డి ఈ సమావేశంలో చర్చించారు.

విడియో ఫుటేజీకి మరింత గడువు

కోమటిరెడ్డి, సంపత్‌కుమార్ ఘటనలపై హైకోర్టును కోరిన అదనపు అడ్వకేట్ జనరల్

మన తెలంగాణ/ హైదరాబాద్: శాసనసభ్యత్వాల రద్దును సవాల్ చేస్తూ కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌కుమార్‌లు దాఖలు చేసిన కేసులో గురువారం హైకోర్టులో తాజా పరిణామాలు చోటు చేసుకున్నాయి. గవర్నర్ ప్రసంగ సమయంలో సభాగౌరవాన్ని దెబ్బతీసేలా వారిద్దరూ వ్యవహరించారని ఆరోపిస్తూ వారి శాసనసభ సభ్యత్వాలను రద్దు చేయడాన్ని సవాల్ చేసిన కేసులో సమావేశాల వీడియో ఫుటేజీ అందజేయాలని గతంలో హైకోర్టు ఆదేశించింది. అయితే వీడియో ఫుటేజీ అందజేయాలంటే సభ ఆమోదం విధిగా ఉండాలని, ఈ నేపథ్యంలో వీడియో ఫుటేజీ ఇచ్చేందుకు మరింత సమయం కావాలని గురువారం తెలంగాణ అదనపు అడ్వకేట్ జనరల్ రామచందర్‌రావు హైకోర్టుకు తెలియజేశారు. గత విచారణ సమయంలో హైకోర్టు ఆదేశాల మేరకు వీడియో ఫుటేజీ కావాలని అసెంబ్లీ సెక్రటరీకి అడ్వకేట్ జనరల్ ప్రకాష్‌రెడ్డి లేఖ రాశారని ఆయన చెప్పారు. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి బి.శివశంకర్‌రావు రికార్డుల్లో నమోదు చేసి వీడియో ఫుటేజీ ఇచ్చేందుకు సమయాన్ని ఈ నెల 27 వరకు పొడిగించారు. విచారణ కూడా ఆదే తేదీకి వాయిదా వేశారు. గవర్నర్ ఈ నెల 12న ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సమయంలో హెడ్‌ఫోన్ విసరడంతో అది శాసన మండలి చైర్మన్ స్వామి గౌడ్‌కు తగిలి గాయం అయిందని, ఈ కారణంగా తమ శాసనసభ సభ్యత్వాలను రద్దు చేయడం అన్యాయమని కోమటిరెడ్డి, సంపత్‌ల వాదన. అసెంబ్లీలో ఆరు వీడియో కెమెరాలు ఉంటాయని, రెండు గవర్నర్ ప్రసంగ వేదికపైన, మిగిలిన నాలుగు సభ్యులపై కేంద్రీకరించి వీడియోలు తీస్తాయని, వీడియో ఫుటేజీలను పరిశీలిస్తే తమపై చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని తేలుతుందని వారిద్దరూ హైకోర్టును ఆశ్రయించిన విషయం విదితమే. వీడియో ఫుటేజీ సమర్పించేందుకు ప్రభుత్వం సమయం కోరడంతో విచారణ 27కి వాయిదా పడింది.

గల్ఫ్ ఏజెంట్ల ఆట కట్టు!

వీసా ఇచ్చేటప్పుడే స్పష్టత, యుఎఇతో కుదిరిన ఒప్పందం?

మన తెలంగాణ / హైదరాబాద్ : ఏజెంట్ల చేతుల్లో మోసపోతున్న గల్ఫ్ కష్టాలకు త్వరలో పరిష్కారం లభించనుంది. ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్ళాలనుకునే యువతను మోసం చేయడం ఇక ఎంతమాత్రం వీలు కాకుండా ప్రత్యేక వ్యవస్థ ఉనికిలోకి రానుంది. వీసా కోసం చేసుకున్న దరఖాస్తును పరిశీలించే (స్క్రూటినీ) సమయంలోనే ఆ ఉద్యోగం నిజమైనదా బోగస్‌దా అనేది తేలిపోనుంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రభుత్వంతో మన దేశ విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఇప్పటికే ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆ శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. త్వరలోనే సౌదీ అరేబియా ప్రభుత్వంతో కూడా కుదురుతుందని తెలిపారు. ఈ నూతన వ్యవస్థ ప్రకారం వీసా కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు అందులో పేర్కొన్న కంపెనీ (ఆ దేశం)లో ఉద్యోగం ఉందా, ఆ సంస్థ నిజంగానే ఆఫర్ లెటర్ పంపిందా తదితర వివరాలన్నీ వెబ్ సైట్‌లో ప్రత్యక్షమవుతాయి. వివరాలు తప్పు అని తేలినట్లయితే వీసా మంజూరు కాదు. విమాన టిక్కెట్, ఏజెంటుకు ముడుపులు లాంటివాటికి లక్షలాది రూపాయలు ఖర్చుచేసి తీరా అక్కడకు వెళ్ళిన తర్వాత ఉద్యోగం లేక ఇబ్బందులు పడే అవస్థను తొలగించడానికి ఈ నూతన ఏర్పాట్లు చేసినట్లు ఆ అధికారి తెలిపారు. వీసా మంజూరు చేసే సమయంలో 'గుడ్ కాండక్ట్ సర్టిఫికెట్'ను తప్పనిసరి చేసే విధానాన్ని మన ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు ఇప్పటికే యుఏఇ తొలగించిందని, త్వరలో సౌదీ అరేబియా కూడా తొలగించనుందని, దానికి బదులుగా మన పాస్‌పోర్టు కార్యాలయం జారీచేసే 'పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్'ను ప్రాతిపదికగా తీసుకోనున్నాయని తెలిపారు.

ఈ రెండు దేశాలతో పాటు ఒమన్, కువైట్, ఇరాన్, ఇరాక్ తదితర గల్ఫ్ దేశాల్లో సుమారు 92 లక్షల మంది భారతీయులు ఉన్నారని, వారి సంక్షేమంపై మన దేశ విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ, ఆ దేశాల్లోని మన రాయబార కార్యాలయాలు ఎప్పుడూ అప్రమత్తంగా ఉంటున్నాయని తెలిపారు. కువైట్ ఇటీవల జారీ చేసిన డిక్రీ అనంతరం దాదాపు పదిహేను వేల మంది భారతీయులు తిరిగి ఇళ్ళకు రావడానికి సంసిద్ధత వ్యక్తం చేయడంతో వారి ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా అక్కడి మన రాయబార కార్యాలయం తగిన ఏర్పాట్లు చేసిందని ఆ అధికారి వివరించారు.

ప్రజల చెంతకు విదేశాంగ విధానం వివరాలు

వివిధ దేశాలతో మన దేశం కొనసాగిస్తున్న దౌత్యపర, స్నేహపూర్వక సంబంధాల గురించి గ్రామస్థాయి ప్రజలకు పెద్దగా తెలియడంలేదని, ప్రాంతీయ ప్రసార మాధ్యమాల ద్వారా తెలియజేయడం ద్వారా విదేశాలకు వెళ్ళాలనుకునేవారికి చాలా అంశాలపై అవగాహన ఏర్పడుతుందని విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి రవీష్‌కుమార్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన ప్రాంతీయ మాధ్యమాల వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడుతూ, మన దేశ ప్రసార మాధ్యమాల్లో దాదాపు 40% ప్రాంతీయ భాషలకు చెందినవేనని, ప్రజలకు అర్థమయ్యే భాషలో మన విదేశాంగ విధానాన్ని తెలియజేయడం ద్వారా ఉపాధినిమిత్తం ఏ దేశాలను ఎంచుకోవచ్చు, ఎలాంటి పొరపాట్లు చేయకూడదు, ఇబ్బందులెదురైనప్పుడు అనుసరించాల్సిన విధానం తదితరాలపై అవగాహన కలుగుతుందని పేర్కొన్నారు. ఇంతకాలం ప్రాంతీయ భాషల్లోని ప్రసార మాధ్యమాల ప్రాముఖ్యను తమ మంత్రిత్వశాఖ గుర్తించలేకపోయిందని, కానీ గతేడాది ఉర్దూ పాత్రికేయులు నిర్వహించిన సదస్సు సందర్భంగా వెలుగులోకి వచ్చిన అంశాలను పరిశీలించిన తర్వాత కసరత్తు ప్రారంభించామని తెలిపారు. ప్రాంతీయ ప్రసార మాధ్యమాలతో వర్క్‌షాపులను హైదరాబాద్ నుంచే ప్రారంభిస్తున్నామని, త్వరలో మరి కొన్ని నగరాలకు సైతం విస్తరింపజేస్తామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం రెండు ఎకరాల స్థలాన్ని ఇచ్చిందని, అక్కడ 'విదేశీ భవన్'ను నెలకొల్పనున్నామని తెలిపారు. మన విదేశాంగ విధానంపై ఆంగ్ల, హిందీ ప్రసార మాధ్యమాలకే పరిమితమైపోయిందనే సాధారణ అభిప్రాయం నెలకొనిందని, ఒక మేరకు వాస్తవమే అయినా ఇకపైన ఈ ఖాళీని భర్తీ చేయడానికి ప్రాంతీయ మాధ్యమాలను వినియోగించుకోవాలని భావిస్తున్నామని తెలిపారు. ఢిల్లీ నుంచి రాష్ట్రాల రాజధానుల వరకూ సమాచారం చేరవేయడానికి తమ మంత్రిత్వశాఖ ద్వారా కొన్ని ఏర్పాట్లు చేయనున్నామని తెలిపారు.

ఆయుష్మాన్ భారత్ రెడీ

(మొదటిపేజీ తరువాయి)

ఆమోద ముద్ర లభించింది. ప్రపంచంలోనే అతి భారీ ప్రభుత్వ ఆరోగ్య పథకంగా దీనిని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ పథకం పరిధిలోకి వచ్చే కుటుంబాల వారికి అన్ని రకాల వైద్య చికిత్సల ఖర్చులు ప్రభుత్వం భరిస్తుంది. ఆయుష్మాన్ పథకం సమగ్ర అమలుకు ప్రత్యేకంగా ఆయుష్మాన్ భారత్ జాతీయ స్వాస్థ్య పరిరక్షణ మండలి (ఎబి –ఎన్‌హెచ్ పిఎంసి) ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. దీనికి కేంద్ర ఆరోగ్య మంత్రి అధ్యక్షత వహిస్తారు. ఇక దీనికి సంబంధించి పాలక మండలి కూడా ఉంటుంది. ఆసుపత్రులలో చేరడానికి ముందు చేరిన తరువాత అయిన ఖర్చులన్నీంటినీ ఈ పథకం పరిధిలో కవర్ చేస్తారని , పాలసీ వర్తింపు నాటి నుంచి ఇప్పుడున్న నిబంధనలు వాటితో పాటు సౌకర్యాలు అన్ని కూడా లబ్ధిదారులకు వర్తిస్తాయని అధికార వర్గాలు తెలిపాయి. తాజా సామాజిక ఆర్థిక కుల జనగణన (ఎస్ఇసిసి) గణాంకాల మేరకు పేదలు, అణగారిన వర్గాల కుటుంబాలను గుర్తించి వారిని ఈ పథకం పరిధిలోకి చేరుస్తారని వెల్లడించారు. దాదాపు 10.74 కోట్ల కుటుంబాలు ఈ పథకం పరిధిలో ఆరోగ్య సాయం అందేందుకు వీలేర్పడుతుంది.

ఈ సమగ్ర ఆరోగ్య పథకం వివరాలు దాని అమలు తీరు

☛ పేద గ్రామీణ కుటుంబాలు, పట్టణాలలోని కార్మికుల కుటుంబాలకు ఈ పథకం వర్తిస్తుంది.

☛ ఇక పథకాన్ని క్షేత్రస్థాయిలో సమగ్రంగా అమలు పరిచేందుకు ప్రత్యేకంగా ఎబి ఎన్‌హెచ్‌పిఎం ఏజెన్సీని ఏర్పాటు చేస్తారు.

☛ ప్రాథమిక ఆరోగ్యపరిరక్షణను ఆరోగ్య స్వస్థత కేంద్రాల ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సమాజంలోని నిరుపేదలు, అవసరార్థులకు ఆరోగ్య చికిత్సలు అందేలా చూస్తారు.

☛ ఈ పథకం పరిధిలో పదికోట్లకు పైగా కుటుంబాలకు వర్తించే ఆరోగ్య సాయంతో దాదాపు 50 కోట్ల మంది వరకూ ఆరోగ్యచికిత్సలు పొందేందుకు వీలేర్పడుతుంది. కుటుంబంలోని సభ్యుల సంఖ్యపై ఏ విధమైన పరిమితి ఉండదు.

☛ ఎబి ఎన్‌హెచ్‌పిఎం ఏజెన్సీ పర్యవేక్షణకు పూర్తిస్థాయి ముఖ్య కార్యనిర్వాహణాధికారి (సిఇఒ)ను సెక్రెటరీ లేదా అదనపు కార్యదర్శి ర్యాంక్‌లో నియమిస్తారు.

☛ ప్రస్తుతము కేంద్రం పరిధిలో ఉన్న రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన, వయోవృద్ధ ఆరోగ్య బీమా పథకాలను ఈ నూతన పథకంలో విలీనం చేస్తారు.

☛ జాతీయ స్థాయిలో ఆరోగ్య పరిరక్షణకు ఈ పథకం తీసుకువస్తున్నందున రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాలు దీనిని అంకితభావంతో నిర్వహించేందుకు రాష్ట్రాల స్థాలో రాష్ట్ర ఆరోగ్య సంస్థలను ఏర్పాటు చేసుకోవల్సి ఉంటుంది.

☛ గ్రామీణ ప్రాంతాలలో నివాసం లేని వారు, అనాథలు, ఇతరుల దయాదాక్షిణ్యాలపై జీవిస్తున్న వారు. పారిశుధ్య పాకీపనుల కుటుంబాలు, పురాతన గిరిజన తెగలు, చట్టబద్ధంగా విముక్తి పొందిన వెట్టికార్మికులు ఈ పథకానికి అర్హులు అవుతారు. ఇక పట్టణ ప్రాంతాలలో 11 నిర్ధేశిత వృత్తులలోని వారు ఈ పథకం వర్తింపునకు అర్హులు.

టోటెం టోపీ

(మొదటిపేజీ తరువాయి)

లక్షల బహుమతి ఉంటుందని తెలిపింది. కంపెనీ ప్రమోటర్లు కన్పించకుండా పో య్యారని బ్యాంకు వారు కూడా ప్రకటించారు. ఈ దశలో రంగంలోకి దిగిన సిబిఐ ప్రమోటర్ల కొత్త నివాసాలను కనుగొంది. హైదరాబాద్‌లో ఒక ఇరుకు వీధిలో ఉన్న టోటెం కార్యాలయంతో పాటు సంస్థ డైరెక్టర్లు సలలిత్, కవిత ఇతరుల నివాసాలలో సోదాలు నిర్వహించి కీలక పత్రాలు స్వాధీనం చేసుకుంది. ఆర్థిక అక్రమాలకు దిగుతున్న వారు విదేశాలకు తరలుతున్న పరిస్థితిని గమనించి సిబిఐ తక్షణమే ప్రమోటర్ల కోసం లుకౌట్ నోటీసు జారీ చేసింది. వారు విదేశాలకు తరలివెళ్లకుండా చేసేందుకు, వారి కదలికలను గమనించేందుకు చర్యలు తీసుకుందని అధికార వర్గాలు తెలిపాయి. తాము కంపెనీకి ఇచ్చిన రూ 313.84 కోట్ల రుణాలకు చూపిన ఆస్తులు నిరర్థక ఆస్తులు (ఎన్‌పిఎ)గా వెల్లడయిందని, దీనితో ఈ మేరకు తమకు నష్టం జరిగిందని , ఈ ఎన్‌పిఎ గురించి తమకు 2012లో తెలిసిందని బ్యాంకు వారు తమ ఫిర్యాదులో తెలిపారు. ఎనిమిది బ్యాంకుల సముదాయానికి ఈ కంపెనీ రుణాల మొత్తం రూ 1394.43 కోట్ల వరకూ ఉంటుందని ఫిర్యాదులో తెలిపారు. నిర్మాణ పనుల పేరిట తీసుకున్న రుణాలను ఇతర పనులకు దారిమళ్లించారని , అంతేకాకుండా ప్రమోటర్ల వ్యక్తిగత ఖాతాలకు బదలాయించారని పేర్కొనడంతో కేసు దాఖలు చేసుకున్న సిబిఐ రంగంలోకి దిగింది. రోడ్ల నిర్మాణం, భవనాల కట్టడాలు, వాటర్ వర్క్స్ వంటి పలు ప్రాజెక్టుల నిర్మాణాలలో ఉన్నట్లుగా పేర్కొంటూ ఈ కంపెనీ వారు బ్యాంకుల నుంచి రుణాలు పొందినట్లు వెల్లడైంది. ప్రస్తుతం ఈ కంపెనీ యాజమానులు అజ్ఞాతంలో ఉన్నట్లు వెల్లడైంది. అయితే వారిని ఒక చోట అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు వెల్లడైంది. కానీ ఈ అంశాన్ని అధికార వర్గాలు నిర్ధారించలేదు.

గీతన్నలకు వరాలు

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రంలో ఈ పరిహారం చెల్లింపు కూడా మొక్కుబడిగా జరిగేదని, మరణిస్తే రెండు లక్షల రూపాయలు, అంగవైకల్యం చెందితే రూ. 50 వేలు ఇచ్చేదని, తెలంగాణ ప్రభుత్వం మాత్రం దీన్ని ఐదు లక్షల రూపాయలకు పెంచిందని తెలిపారు. ఆసరా పింఛన్‌ను వెయ్యి రూపాయలకు పెంచడం ద్వారా ప్రభుత్వ ఖజానాపై ఏటా ఆర్థిక భారం పడుతున్నప్పటికీ కార్మికుల సంక్షేమమే పరమావధిగా భావించి ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. తాటి, ఈత చెట్లపై పన్ను విధింపు విధానాన్ని పూర్తిగా ఎత్తేస్తున్నందువల్ల ప్రభుత్వంపై రూ. 16 కోట్ల ఆర్థిక భారం పడుతోందని తెలిపారు.

హరితహారంలో తాటి, ఈత మొక్కలు

రాష్ట్రంలో అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రభుత్వం చేపట్టిన 'హరితహారం' పథకంలో తాటి, ఈత మొక్కలను నాటే కార్యక్రమాన్ని కూడా చేపట్టినట్లు సిఎం తెలిపారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.70 కోట్ల తాటి, ఈత మొక్కలను నాటామని, ఎక్సయిజ్, అటవీ శాఖల సమన్వయంతో రానున్న కాలంలో గ్రామాల్లోని చెరువుగట్లమీద, చెరువుశిఖం భూముల్లోనూ, వాగులు వంకల వెంట, నదీ ప్రవాహానికి ఇరువైపులా తాటి, ఈత మొక్కలతో పాటు ఖర్జూర మొక్కలను కూడా విరివిగా నాటనున్నట్లు తెలిపారు. సిఎం కెసిఆర్ చేసిన ఈ ప్రకటనను ఎక్సయిజ్ శాఖ మంత్రి పద్మారావుగౌడ్ శాసనమండలిలో చదివి వినిపించారు. కెసిఆర్ తీసుకున్న ఈ నిర్ణయానికి గౌడ సామాజికవర్గానికి చెందిన పలువురు రాజకీయ నాయకులు స్వయంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఇంతకాలం కల్లుగీత కార్మికుల సొసైటీల్లో సభ్యులుగా లేని సుమారు 30 వేల మందికి ఇప్పుడు లబ్ది చేకూరనుందని, ప్రభుత్వ పథకాలన్నీ వర్తిస్తాయని కల్లుగీత కార్మిక సంఘం నాయకుడొకరు వ్యాఖ్యానించారు.

సమైక్య పాలనలో సామాజిక విధ్వంసం

కల్లుగీత కార్మికులను సమైక్య ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో పాటు వారికాళ్ళమీద వారు బతికే జీవనాధారాన్ని కూడా లేకుండా చేసిందని, మద్యం లాబీల ప్రలోభాలకు, వత్తిడికి తలొగ్గి కల్లు దుకాణాలను నిర్ధాక్షిణ్యంగా మూసేసిందని పేర్కొన్నారు. ఈ 'దుర్మార్గాన్ని' అప్పట్లో తెలంగాణ నాయకులు అడ్డుకోకపోగా సమైక్య పాలకులకు వంతపాడారని వ్యాఖ్యానించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గుడుంబా మహమ్మారి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతుంటే ఈ నాయకులే గుడ్లప్పగించి చూశారని, సమైక్య పాలకులు సృష్టించినీ సామాజిక విధ్వంసం కారణంగా ప్రజల ఆరోగ్యం పాడైపోయిందని, కల్లుగీత వృత్తి కల్లోలంలో పడిందని కెసిఆర్ వ్యాఖ్యానించారు. గౌడ సామాజిక వర్గానికి జరుగుతున్న అన్యాయాన్ని ఉద్యమం సమయంలోనే ప్రస్తావించామని, అధికారంలోకి వస్తే మూతపడిన కల్లు దుకాణాలను తెరిపిస్తామని తాను హామీ ఇచ్చానని, ప్రజల ఉద్యమం ఫలితంగా రాష్ట్రం ఏర్పడగానే హైదరాబాద్‌లో కల్లు దుకాణాలను తెరిపించామని గుర్తుచేశారు.

కల్లుగీత కార్మికుల పన్ను రద్దు హర్షణీయం

కల్లుగీత కార్మికుల పన్నును రద్దు చేస్తూ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావు అసెంబ్లీలో చేసిన ప్రకటన హర్షణీయమని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం ఎంవి. రమణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గీత కార్మికులు రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లిస్తున్న రూ. 16 కోట్లు రద్దును స్వాగతిస్తున్నామన్నారు. గీత కార్మిక కార్పొరేషన్‌కు రూ. ఐదు వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించి నామినేటెడ్ బాడీని నియమించాలని కోరారు. తాటి, ఈత చెట్ల పెంపకానికి భూమి, తాటి ఉత్పత్తుల పరిశ్రమ, కార్మికుల పిల్లలకు విద్యా, వ్యక్తిగత రుణాలు, హాస్టల్ నిర్మాణం చేపట్టాలన్నారు. గౌడ కుల యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎంవి. రమణ ప్రభుత్వానికి సూచించారు.

రథయాత్ర పిటిషన్ కొట్టివేత

మన తెలంగాణ/ హైదరాబాద్: తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ నుంచి హనుమాన్ జయంతి వరకు వీహెచ్‌పీ (విశ్వహిందూపరిషత్) నిర్వహించాలని భావించిన శ్రీరామ రథయాత్రకు అనుమతి ఇవ్వాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాన్ని హైకోర్టు కొట్టివేసింది. శ్రీరామ రథయాత్రకు తెలంగాణ రాష్ట్ర పోలీసులు అనుమతి ఇవ్వకపోవడాన్ని సవాల్ చేసిన కేసులో బుధవారం వాదనలు ముగిసిన విషయం విదితమే. ఈనెల 18న ఉగాదిని పురస్కరించుకుని 31న హనుమాన్ జయంతి వరకూ బాసర నుంచి హైదరాబాద్‌లోని తాడ్‌బడ్ హనమాన్ ఆలయం వరకూ శ్రీరామ రథయాత్ర నిర్వహించాలంటే అన్ని చోట్లా పోలీసుల రక్షణ అవసరం ఉన్నందున వీహెచ్‌పీ పిటిషన్‌ను తోసిపుచ్చుతున్నట్లు గురువారం హైకోర్టు న్యాయమూర్తి ఎం.సత్యనారాయణమూర్తి తీర్పు చెప్పారు. తాము చేపట్టబోయే రథయాత్ర బాసర నుంచి హైదరాబాద్ తాడ్‌బడ్ హనుమాన్ ఆలయం వరకూ నిర్వహించేందుకు ఎలాంటి షరతులు విధించినా తమకు అభ్యంతరం లేదని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) తెలంగాణ కార్యదర్శి ఎం.గాల్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించిన విషయం విదితమే. పోలీసులు కావాలనే అనుమతి ఇవ్వడం లేదని, శాంతియుతంగా యాత్ర నిర్వహిస్తామని, ఏమైనా షరతులు విధించినా తమకు అభ్యంతరం లేదనే వాదనను హైకోర్టు తోసిపుచ్చింది. పిల్లలకు పరీక్షలు జరుగుతున్నందున అనుమతి ఇవ్వలేమని, రథయాత్ర జరిగే అన్ని చోట్లా పోలీసుల రక్షణ ఏర్పాట్లు చేయడం కష్టమని ప్రభుత్వ వాదనను హైకోర్టు ఆమోదించి పిటిషన్‌ను డిస్మిస్ చేసింది.

ఆ భూములను విక్రయించొద్దు

మన తెలంగాణ/ హైదరాబాద్: విశాఖ జిల్లా యండాడ గ్రామంలో అనాథలు, వృద్ధుల ఆశ్రమం కోసం శ్రీహయగ్రీవ ఫర్మ్‌కు కేటాయించిన భూముల్ని విక్రయించడానికి వీల్లేదని హైకోర్టు ఆ సంస్థను ఆదేశించింది. కేటాయించిన భూమిని లీజుకు ఇవ్వడానికి కూడా వీల్లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి విజయలక్ష్మి లతో కూడిన డివిజన్ బెంచ్ గురువారం తేల్చి చెప్పింది. అనాథలకు, వృద్ధుల కోసం కుటీరాల నిర్మాణాలకు ఆ సంస్థ చేసుకున్న దరఖాస్తుపై ఏపీ సర్కార్ తగిన నిర్ణయం తీసుకోవాలని బెంచ్ ఆదేశించింది. ఆ గ్రామంలోని 92/3 సర్వే నెంబర్‌లోని 12.51 ఎకరాలను మార్కెట్ ధర ఎకరం రూ.రూ.45 లక్షల చొప్పున ఆ సంస్థకు ప్రభుత్వం 2008లో కేటాయించింది. తర్వాత భూమిని రిజిస్ట్రేషన్ కూడా చేసింది. ఇప్పుడు భూముల విలువలు పెరిగాయని చెప్పి ఆ కేటాయింపుల్ని ఏపీ సర్కార్ రద్దు చేయడాన్ని సింగిల్ జడ్జి తప్పుపట్టారు. దీనిపై ప్రభుత్వం చేసుకున్న అప్పీల్‌ను గురువారం బెంచ్ విచారించి భూముల్ని అమ్మరాదని, లీజుకు ఇవ్వరాదని తేల్చి చెప్పింది. భూమి విలువ వంద కోట్ల వరకూ ఉంటుందని, అందులో అరవై శాతం భూమిని అమ్మేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. భూమిని అమ్మబోమని, అనాథలు, వృద్ధులకు సేవ చేసేందుకే వినియోగిస్తామని సంస్థ లాయర్ చెప్పారు.

కాళోజీ వర్సిటీలో ప్రవేశానికి దరఖాస్తులు

హైదరాబాద్ : వైద్య కళాశాలల్లో పిజి ప్రవేశం కోసం నీట్‌లో అర్హత సాధించిన విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణకు కాళోజీ హెల్త్ యూనివర్సిటీ గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈనెల 23వ తేదీ నుంచి 28వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. అర్హులైన విద్యార్థులు www.knruhs.in వెబ్‌సైట్లో దరఖాస్తు చేసుకోవాలి.


భద్రాద్రిలో తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు

భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి రామయ్య ఆలయంలో తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. మార్చి 18 నుంచి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం అంకురారోపణ జరుగుతుంది. అర్చకులు గోదావరి నుంచి తీర్థ బిందె తెచ్చి బేడా మండపంలో పూజలు చేయనున్నారు.

భద్రాచలంలో నిర్బంధ తనిఖీలు

భద్రాచలంలో గురువారం ఉదయం పోలీసులు నిర్బంధ తనిఖీలు చేపట్టారు. ఎస్‌పి సంగ్రామ్ సింగ్ గణపతిరావు పాటిల్ ఆధ్వర్యంలో సిఐ సత్యనారాయణ రెడ్డి, 10 మంది ఎస్ఐలు, 200 మంది పోలీస్ సిబ్బంది సోదాలలో పాల్గొన్నారు. సరైన పత్రాలు లేని 12 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పలువురి అనుమానితులను విచారిస్తున్నారు.

తిరుమలలో భక్తుల రద్దీ సాధారణం



తిరుమల : తిరుమలలో గురువారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. శ్రీవారి దర్శనం కోసం భక్తులు తొమ్మిది కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్నారు. శ్రీవారి సర్వదర్శనానికి ఆరు గంటలు, కాలినడక భక్తులకు రెండు గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి రెండు గంటల సమయం పడుతోంది. బుధవారం శ్రీవారిని 65,350 మంది దర్శించుకున్నారు. 27,251 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. బుధవారం శ్రీవారి హుండీకి రూ.3.71 కోట్ల ఆదాయం సమకూరింది.

బిజెపికి నాగం రాజీనామా

(మొదటిపేజీ తరువాయి)

.సాధించుకున్న తెలంగాణ తర్వాత తెలంగాణ ఆత్మగౌరవ సభ సెంటిమెంట్‌తో జూన్ 3,2013 న నిజాం మైదానంలో రాజ్‌నాథ్‌సింగ్ సమక్షంలో బిజెపి పార్టీలో చేరిన తాను రాష్ట్ర నాయకునిగా గుర్తింపు తెచ్చుకున్నానన్నారు. టిఆర్‌ఎస్ ప్రభుతం చేస్తున్న పని తీరు, అవినీతి, కుంబకోణాలను ఎన్నోసార్లు బిజెపి ప్రభుత్వానికి తెలిపినా నాకు మద్దతు తెలపడం లేదని విసిగిపోయిన తాను భారతీయ జనతా పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. గతంలో గాలి జనార్ధన్‌రెడ్డి అవినీతిని బట్టబయలు చేసిందే నేనే నని అన్నారు. రాష్ట్ర అవతరణ తర్వాత తెలంగాణ ప్రజలకు మేలు చేయడానికి ఎన్నో ప్రయత్నాలు, ఆందోళన చేపట్టానన్నారు. టిడిపికి రాజీనామా చేసిన కార్యకర్తలు, ముఖ్య నాయకులు తన వెంటే ఉన్నారన్నారు. కార్యక్రమంలో వివిధ మండలాల ఎంపిటిసిలు, జడ్‌పిటిసిలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దటీజ్ కెసిఆర్

(మొదటిపేజీ తరువాయి)

కళ్యాణ లక్ష్మి , ఫీజు రీయంబర్స్ మెంట్ , ఆరోగ్యశ్రీ వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుండడంతో రైతులు వ్యవసాయ కార్మికుల్లో ధైర్యం పెరిగింది . తెలంగాణ లో సాగు నీటి ప్రాజెక్టులు వేగంగా చేపడుతుండడం వల్ల వ్యవసాయ భూముల ధరలు కూడా గతంలో కంటే నాలుగు , అయిదు రెట్లు పెరిగినయి . దీంతో సుమారు 60 లక్షల రైతు కుటుంబాలు తమకు మంచి భవిష్యత్ ఉందని విశ్వసిస్తున్నయి . తెలంగాణ లో సాగు నీటి ప్రాజెక్టులు ఈ రెండేళ్లలో పూర్తయి ముఖ్యమంత్రి కేసీఆర్ కలలు గంటున్న కోటి ఎకరాల సాగు సంకల్పం నెరవేరితే భవిష్యత్తులో తెలంగాణలో రైతులు , కూలీల ఆత్మహత్యలు జరిగే అవకాశమే లేదు .



ఎంఎల్ఏ అనుచిత వ్యాఖ్యలపై నిరసనలు

మనతెలంగాణ/ వరంగల్‌బ్యూరో : వరంగల్ రూరల్ జిల్లా కలెక్టర్ హరితపై నర్సంపేట ఎంఎల్ఎ దొంతి మాధవరెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా నిరసనలు పెల్లుబిక్కుతున్నాయి. గురువారం జిల్లా వాప్తంగా అన్ని మండల కేంద్రాలలోని ఉద్యోగులు విధులను బహిష్కరించి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలను చేపట్టారు. జిల్లా ట్రెసా, టిఎన్‌జిఓస్, టిజిఓ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టారు. నర్సంపేట ఎంఎల్ఎ దొంతి మాదవరెడ్డి బేషరత్‌కు వరంగల్ రూరల్ కలెక్టర్ హరితకు, ఉద్యోగులకు బేషరత్‌గా క్షమాపణలు చెప్పాలని ఉద్యోగ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. బుధవారం రోజున వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గంలోని ఖానాపూర్ మండలం పాకాలలో అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ అటవీ దినోత్సవ కార్యక్రమం జరిగింది.దీనితోపాటు నర్సంపేటలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను కలెక్టర్ సందర్శించారు. ఈ కార్యక్రమాలకు తనను ఆహ్వానించకపోవడంపై ఎంఎల్ఏ తీవ్రంగా స్పందించారు. ఈ క్రమంలోనే ఎంఎల్ఏ కలెక్టర్లు మస్కూర్లులాగా ప్రభుత్వానికి వ్యవహరిస్తున్నారనే వ్యాఖ్య చేయడంపై ఉద్యోగులు తీవ్రస్థాయిలో స్పందించారు.

వంద గుడిసెలు అగ్నికి ఆహుతి

● అగ్ని ప్రమాదంతో నిలువ నీడ కోల్పోయిన పేద ప్రజలు ● 75 లక్షల ఆస్తినష్టం

మన తెలంగాణ-/ హైదరాబాద్/మాదాపూర్: అక్కడ నివసించేవారు అందరూ పేదవారు రెక్కాడితేగాని డొక్కాడని వారు ప్రతి రోజూ ఉదయం వెళ్లి పనికిపోయి రాత్రికి తిరిగివస్తారు. అలాంటిది ఒక్కసారిగా వారి నివాసాలు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ సంఘటన మాదాపూర్‌లోని పత్రిక నగర్‌లో చోటుచేసుకుంది. కొండాపూర్ డివిజన్ లోని పత్రికనగర్‌లో సుమారుగా వంద గుడిసెలు వేసుకొని నివాసముంటూ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గురువారం ఉదయం 9 గంటల సమయంలో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తూ గుడిసెకు నిప్పు అంటుకుంది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి ఒక దానిఒకటి అనుకొని ఉండటంతో అక్కడ ఉన్న మిగతా గుడిసెలకు కూడా మంటలు అంటుకొని పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. విషయం తెలుసుకున్న మాదాపూర్ ఫైర్ సిబ్బంది 30 మంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నం చేశారు. అప్పటికే వంద గుడిసెలు అగ్నికి పూర్తిగా దగ్ధమైపోయాయి. ఇంట్లో ఉండే నిత్యావసర వస్తువులు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. అనంతరం ఈ విషయం తెలుసుకున్న నియోజకవర్గ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పత్రికనగర్‌ను సందర్శించారు. ఆయనతోపాటు డివిజన్ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్, వెస్ట్ జోన్ జోనల్ కమిషనర్ హరిచందన, ఉప కమిషనర్ మమత, మాదాపూర్ ఇన్స్‌స్పెక్టర్ కళింగరావులు సందర్శించి బాధితులకు



ధైర్యం చెప్పారు. ఉదయం పూట అగ్ని ప్రమాదం చోటుచేసుకోవడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదన్నారు. కాని ఆస్తి నష్టం జరిగిందన్నారు. అన్ని గుడిసెలలో 12 సిలిండర్లు పేలి పోవడంతో మంటల పెద్ద ఎత్తున చెలరేగడం జరిగిదని అందువలన అదుపులోకి తీసుకోవడం కష్టంగా మారిందన్నారు. ఎమ్మెల్యే గాంధీ బాధితులకు స్వయంగా మంచినీటి వసతితో పాటు ఆహార పదార్థలు ఏర్పాటు చేశారు. పూర్తిగా గుడిసెలు మంటలకు ఖాళీపోవడంతో బాధితులకు పునరావాసం ఏర్పాటుపై ఆయన కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి బాధితులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటానన్నారు. వారి వెంట జీహెచ్ఎంసీ ఈఈ సుదర్శన్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ హరి, ఎఎంహెచ్ఒ బిందు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి

మాదాపూర్ పత్రికనగర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో గుడిసెలు కాలిపోయి నిరాశ్రయులైన బాధితులను ప్రభుత్వం ఆదుకుని వారికి వెంటనే రెండు పడకల గదులను ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. మాదాపూర్ హైటెక్ సిటీకి కూతవేటు దూరంలో ఉన్న పత్రిక నగర్ లోని పేద ప్రజలు గుడిసెలు వేసుకొని కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారని అందుకు అగ్ని ప్రమాదంతో ఒక్క సారిగా పేద ప్రజలు నిరాశ్రయులైయ్యారన్నారు. సర్వం కోల్పోయి రోడ్డున పడ్డ వారికి తినడానికి తిండి గింజలు లేవన్నారు. తక్షణమే ప్రభుత్వం పేద ప్రజలకు ఆర్థిక సహాయం అందజేయలన్నారు. రెండు మూడు రోజులకు సహాయం అందజేసిన అప్పటి వరకు వారు ఎక్కడ ఉంటారని ఆయన అన్నారు. అందుకు వారికి ప్రభుత్వం తక్షణ సహాయం చేయలన్నారు. ఒక్క గుడిసె వేసుకోవడానికి రూ. 25 వేల రూపాయలు ఖర్చు అవుతుందని అన్నారు. అందుకుపేద ప్రజలకు పునరావాసం ఏర్పాటు చేయలని ఆయన డిమాండ్ చేశారు.

సోలార్ కంపెనీ ఏర్పాటులో రైతులను నట్టేట ముంచిన దళారులు

● బాధితులతో సోలార్ కంపెనీ ముందు ఎంఎల్ఏ చిన్నారెడ్డి ధర్నా

మన తెలంగాణ/ పెద్దమందడి: వనపర్తి జిల్లా పెద్దమందడి మండల పరిధిలోని అల్వాల గ్రామ శివారులో ఏర్పాటు చేస్తున్న సోలార్ కంపెనీ నిర్మాణంలో రైతులను నట్టేట ముంచి దళారులు కోట్లకు పడగెత్తిన ఉదంతం ఆలస్యంగా వెలుగు చూసింది. దీంతో బాధితులు లబోదిబోమంటూ తమకు న్యాయం చేయాలని సోలార్ కంపెనీ ముందు గురువారం ఆందోళన చేపట్టారు. రైతులు చేస్తున్న ఆందోళనకు వనపర్తి ఎంఎల్ఎ డా.జి.చిన్నారెడ్డి, కొల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి బీరం హర్షవర్ధన్‌రెడ్డిలు మద్దతు ప్రకటించి రైతులతో కలిసి ఆందోళనలో పాల్గొన్నారు. మండలంలోని మద్దిగట్ల ,పెద్దమందడి, అల్వాల,అమ్మపల్లి గ్రామాల్లోని శివారులో గల 280 ఎకరాల్లో సోలార్ కంపెనీ



ఏర్పాటు చేస్తున్నారు. కంపెనీ కొంత మంది మధ్యవర్తులకు ఎకరాకు రూ. 6.25 లక్షల కు ఒప్పందం కుదుర్చుకొంది. కాని కొంత మంది మధ్యదళారులు రైతులకు ఎకరాకు రూ. 50వేలు మొదలుకొని రూ. 3 లక్షల వరకు మాత్రమే చెల్లించి మిగతా డబ్బులు కాజేశారు. తమను మోసం చేసి తమ భూములను కొనుగోలు చేసిన వారు తమకు ఇవ్వాల్సినంత డబ్బులు ఇవ్వకుండా అక్రమంగా వెనకేసుకున్నారని సోలార్ కంపెనీ నిర్మాణంలో భూములు కోల్పోయిన వారికి ఉపాధి అవకాశం కల్పించకుండా అల్వాల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఎవరి పేరు సూచిస్తే వారికి మాత్రమే కంపెనీలో ఉపాధి కల్పిస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. శాశ్వతంగా తమ భూములను కోల్పోయి కుటుంబం వీధిన పడగా తమకు వచ్చింది కేవలం రూ. 50వేలు మొదలుకొని రూ. లక్షన్నర , మూడు లక్షల రూపాయల వరకు రాగా మధ్య దళారులు బాగుపడ్డారని తమకు న్యాయం చేయాలని వారు గురువారం ఆందోళనకు దిగారు. రైతుల ఆందోళనను తెలుసుకున్న ఎంఎల్ఎ చిన్నారెడ్డి రైతులతో కలిసి దాదాపు రెండు గంటలకు పైగా ఎండలో కూర్చొని ధర్నా చేపట్టారు. ఈనెల 25 తేదీ వరకు రైతులకు న్యాయం చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని ఎంఎల్ఏ డా.జి. చిన్నారెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

మనతెలంగాణ/ మంచాల: ట్రాన్స్‌పార్మర్‌పై ఫీజు పోవడంతో సరి చేయడానికి వెళ్లి ఓ గిరిజన రైతు విద్యుత్ షాక్ తగిలి అక్కడి కక్కడే మృతి చెందిన సంఘటన గురువారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే రంగారెడ్డి జిల్లా మంచాల మండల పరిధిలోని బోడకొండ గ్రామానికి చెందిన జాట్రోత్ రాములు(40) తన వ్యవసాయ పొలంలో పనులు చేసుకుంటున్నాడు. తన భావి వద్ద ఉన్న ట్రాన్స్ పార్మర్ పై ఫీజు పోవడంతో సరి చేయడానికి వెళ్లి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి ముగ్గురు పిల్లలు భార్య ఉన్నారు. విద్యుత్ షాక్‌తో మృతి చెందిన గిరిజన రైతు కుటుంబానికి ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం మృత దేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. గ్రామంలో ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మంచాల సిఐ రాజా గంగారాం పోలీసు బందో బస్తు ఎర్పాటు చేశారు.

కౌడీడ్ గ్రామంలో మరో రైతు

దౌల్తాబాద్ : పశువులకు పచ్చి మేతను కోస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కౌడీడ్ గ్రామంలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా దౌల్తాబాద్ గ్రామానికి చెందిన పల్లెర్ల చెంద్రప్ప (45) గ్రామంలో తనకున్న పొలంలో వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. అందులో బాగంగా గురువారం మధ్యాహ్నం పొలానికి వెళ్ళాడన్నారు. పొలం దగ్గర ఉన్న పశువులకు పొలంగట్లపై ఉన్న పచ్చి మేతను కోయడానికి వెళ్ళాడన్నారు. అందులో బాగంగా పొలంలో పచ్చిమేత కోస్తుండగా బోరుమోటారుకు కనెక్షన్ ఉన్న కేబుల్‌వైరును గమనించకుండా కొడవలితో గడ్డిని కోస్తుండగా ప్రమాదవశాత్తు వైర్ తెగి విద్యుత్‌షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్ళి శవ పరిశీలించారు.

విషపూరిత కంపెనీ మాకొద్దు

✻ సువెన్ ఫార్మా కంపెనీ విస్తరణ సమావేశంలో ప్రజల ఆందోళన ✻ అధికారుల ముందే గోడు వెల్లబోసుకున్న పరిసర ప్రాంత వాసులు



మన తెలంగాణ/ సూర్యాపేట : స్వచ్ఛమైన గాలి, నీరును తీసుకోవాల్సిన ఆ ప్రాంత ప్రజలు విషపూరితమైన జీవచ్ఛాలుగా రోజు రోజుకు మారిపోతున్నారు. మూలిగే నక్కపై తాటి పండు పడ్డ చందంగా ఉన్న ఫ్లోరైడ్ సమస్యకు ఈ కంపెనీ వ్యవహారం మరింత తోడవడంతో అట్టి పరిసర ప్రాంత ప్రజలు అంగవైకల్యానికి గురవుతున్నారు. జిల్లా కేంద్రానికి జాతీయ రహదారి 65ను ఆనుకొని ఉన్న సువెన్ ఫార్మా కంపెనీ మరో విష కోణంలా ప్రజల మధ్యకు విస్తరించబోయే ప్రయత్నం చేస్తుంది. కంపెనీ విస్తరణలో భాగంగా గురువారం మండలంలోని ఆ కంపెనీ పరిసర ప్రాంతంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజల అభిప్రాయ సేకరణ చేపట్టారు. ఇందుకు ప్రజలంతా పూర్తిగా వ్యతిరేక నినాదాలు చేశారు. ఫార్మా కంపెనీ ఇప్పటికే ఆరు గ్రామాలను బలితీసుకుందని ఇంకా మరెన్ని గ్రామాలను బలితీసుకుంటుందోనని వాపోయారు. టన్నుల కొద్ది కాలుష్యం భూగర్భ జలాల్లోకి పంపించడం ద్వారా పరిసర తండా వాసులు జీవచ్ఛాల్లా తయారయ్యారని ధ్వజమెత్తారు.

70 ఎకరాలలో విస్తరణ

సర్వే నంబర్ 99/101/109లలో 70 ఎకరాలలో ఇప్పటికే కంపెనీ విస్తరించి ఉందని అయినప్పటికీ సుమారు మరో వంద ఎకరాలలో ఈ కంపెనీ విస్తరించే ప్రయత్నం చేస్తే సహించబోమని పరిసర ప్రాంత వాసులు హెచ్చరించారు. ఈ కంపెనీలో సుమారు 82 రకాల మందులు ఉత్పత్తి అవుతున్నాయని వాటి నుండే కాలుష్యం, నీటి పైపుల ద్వారా భూగర్భ జలాల్లోకి చేరి త్రాగునీరు, సాగునీరు విషపూరితమవుతుందని ఆరోపించారు. చుట్టుపక్కల పరిసర ప్రాంతాలతో పాటు దాసాయిగూడెం గ్రామ పంచాయితీ కూడా కాలుష్య కోరల్లో చిక్కుకుందని సువెన్ కంపెనీ నుండి వచ్చే కాలుష్యం వల్ల రోగాల బారిన పడుతున్నారని వాపోయారు. దీనిపై ఎన్ని సార్లు అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయిందని అధికారుల ముందే ధ్వజమెత్తారు. ఫ్యాక్టరీ ఏర్పాటు సమయంలో తండా వాసులకు ఉద్యోగాలు ఇస్తామని గ్రామాలలో మౌళిక వసతులు కల్పిస్తామని చెప్పినప్పటికీ నేటికి నెరవేర్చలేకపోయారని మండిపడ్డారు. అంతేకాకుండా ఉన్న కంపెనీతో తీవ్ర అనారోగ్యం పాలవుతున్నా తాము మరో కంపెనీ ఏర్పాటు చేస్తే యాజమాన్యానికి తీవ్ర పరిణామాలు చోటు చేసుకుంటాయని పరిసర ప్రాంత వాసులు హెచ్చరించారు.

నకిలీ పట్టాపాస్ బుక్‌ల ముఠా అరెస్టు



మనతెలంగాణ/ కోదాడ : నకిలీ పట్టాదారుపాస్‌బుక్‌లు, టైటిల్‌లీడ్‌లు ఆర్డీవో, తహసీల్దార్ సంతకాలను ఫోర్జరీచేస్తూ బ్యాంకురుణాలను ఇప్పిస్తున్న ముఠా గుట్టురట్టు కావడంతో బ్యాంకుమేనేజర్ ఫిర్యాదుమేరకు అరెస్టుచేసినట్లు కోదాడ టౌన్‌సిఐ శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక టౌన్‌పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ అనంతగిరి మండలం పాలారం తండాకు చెందిన భూక్యానారాయణ పాలారం గ్రామవీఆర్వో రెడపంగు రామారావు, వసంతపురం గ్రామానికి చెందిన వీఆర్‌ఏ సాలె వెంకటనర్సయ్య ముగ్గురుకలిసి బ్యాంకుల ద్వారా పంటరుణాలు ఇప్పిస్తామని తెలపగా అప్పటికే త్రిపురవరం ఎస్‌బీఐ బ్యాంకుద్వారా రుణాలు పొందినట్లు రైతులు చెప్పగా త్రిపురవరం బ్యాంకులోపెట్టిన పట్టాపాస్‌పుస్తకాలను టైటిల్‌లీడ్‌ను నకళ్ళు తీసుకొని ఈ ముగ్గురుకలిసి నకిలీపట్టాదార్ పాస్‌పుస్తకాలు, టైటిల్‌లీడ్, నకిలీ మోసపూరితంగా తయారుచేసి వాటిపై వీఆర్వో రామారావు, తహసీల్దార్, ఆర్డీవోల సంతకాలను ఫోర్జరీచేసి పాలారంతండా రైతులను 2014లో కోదాడకు చెందిన కార్పోరేషన్‌బ్యాంకు ద్వారా రుణాలను ఇప్పించి బ్యాంకులను మోసంచేసినట్లు ఆయన తెలిపారు.తెలంగాణరాష్ట్రప్రభుత్వం చేపట్టిన భూరికార్డుల శుద్ధికరణకార్యక్రమంలో భాగంగా రైతుల డాక్యూమెంట్స్‌ను తహసీల్ధార్‌కార్యాలయానికి పంపగా రైతులవి నకిలీపట్టాదార్ పాస్‌బుక్‌లు, టైటిల్‌లీడ్ అని తేలడంతో కార్పోరేషన్‌బ్యాంకు మేనేజర్ ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి నింధితులను గురువారం ఆరెస్టు చేసినట్లు ఆయనతెలిపారు. ఈ కేసు తాలుకూ భూక్యా బాలాజీ, భూక్యాకోటేశ్వరరావు చనిపోయినట్లు తెలిపారు. పాలారంతండా వీఆర్వో రామారావు వద్ద నుండి నకిలీస్టాంపులను, పట్టాపాస్‌బుక్‌లను స్వాదీనంచేసుకున్నారు. గతంలో పాలారంతండాకు చెందిన భూక్యానారాయణ, భూక్యాబాలాజీ ఎస్‌బీహెచ్ త్రిపురవరం బ్యాంకు నందు నకిలీపట్టాదార్‌పాస్‌బుక్‌లు, టైటిల్‌లీడ్ పెట్టి పంటరుణాలు పొందేందుకు ప్రయత్నించగా ఇది గమనించిన బ్యాంకుమేనేజర్ నడిగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా 2011లో దీనిపై కేసునమోదు చేసినట్లు తెలిపారు. వీరితోపాటు పది మంది రైతులను ఆరెస్టుచేసి కేసు దర్యాప్తుచేస్తున్నట్లు ఆయనతెలిపారు.ఈ సమావేశంలో టౌన్‌ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి, పీసీలు మనోహర్, రామారావు, నరసింహరావు పాల్గొన్నారు.

కొడిమ్యాలలో మాస్ కాపీయింగ్

మనతెలంగాణ/ కొడిమ్యాల : జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలో జరుగుతున్న ఎస్ఎస్‌సి పరీక్షల్లో గణితం రెండవ పేపరు లీకైందని ఆరోపణలు వెల్లువెత్తడంతో పాటు బయట నుంచి జవాబు పత్రాలను పరీక్ష హాల్‌లోకి తీసుకెళ్తున్న ఓ ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపల్‌ను ఎస్ఐ సతీశ్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నాడు. దీంతో విచారణ జరిపిన విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆరుగురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. కొడిమ్యాల మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరుగుతుందని ఆరోపణలు ఉండగా గురువారం ఓ ఇన్విజిలేటర్ ప్రశ్నాపత్రాన్ని సెల్‌ఫోన్ ద్వారా ఫోటో తీసి బయటకు పంపుతున్నాడని సమాచారం మేరకు స్థానిక ఎస్ఐ సతీష్ పరీక్ష కేంద్రంపై నిఘా పెట్టాడు. పరీక్ష కేంద్రం పక్కనే గల ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడి గదిలో లీకైన ప్రశ్నా పత్రాలకు జవాబులు రాయించి పరీక్ష కేంద్రానికి పంపుతున్నారనే సమాచారం మేరకు ఎస్ఐ సతీష్ ఆ గదిపై దాడి చేశారు. గదిలో స్థానిక మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సత్యనారాయణతో పాటు మరో ప్రభుత్వ ఉపాధ్యాయుడు వడ్లకొండ రమేష్, ఇద్దరు మహిళా ఉపాధ్యాయినిలు, ఇద్దరు బాలురు ప్రశ్నలకు జవాబులు రాస్తూ పట్టుపడ్డారు. దాంతో ఎస్ఐ ప్రిన్సిపల్ సత్యనారాయణతో పాటు వడ్లకొండ రమేష్‌ను అదుపులోకి తీసుకోగా మిగతా ఉపాధ్యాయులు పారిపోయారు. సివిల్ డ్రెస్సులో వచ్చిన ఎస్ఐకి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సత్యనారాయణకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకోవడంతో ఒకరిపైఒకరు చేయి చేసుకున్నట్లు సమాచారం. అయితే ప్రశ్నాపత్రం లీకేజు వ్యవహారం బయటకు రావడంతో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, డిఎస్పి భద్రయ్య, సిఐ ఉపేందర్‌లు కొడిమ్యాలకు చేరుకొని విచారణ జరిపారు. పేపరు లీకేజులో బాధ్యులైన మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ బత్తిని సత్యనారాయణ గౌడ్, కోనాపూర్ గణితం ఉపాధ్యాయుడు వడ్లకొండ రమేష్, రాంసాగర్ గణిత ఉపాధ్యాయుడు శ్రీనివాస్, కెజిబివి పాఠశాల ప్రత్యేకాధికారి నంద లింగవ్వ, కెజిబివి గణితం ఉపాధ్యాయురాలు పద్మ, మోడల్ స్కూల్ గణితం ఉపాధ్యాయురాలు రాధను సస్పెండ్ చేశారు.

సస్పెండ్ చేయడం సిగ్గుచేటు



మన తెలంగాణ/ హుజూర్‌నగర్ : టిఆర్ఎస్ ప్రభుత్వం చేసే అవినీతి వైఫల్యాలను బయటపెడతామనే భయంతోనే శాసనసభలో కాంగ్రెస్ శాసనసభ్యలను సస్పెండ్ చేశారని టిపిసిసి అధ్యక్షులు నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొని స్థానిక క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఉత్తమ్ మాట్లాడారు. నిండు శాసనసభలో బడ్జెట్ సమావేశాలనుండి శాసనసభ్యులను సస్పెండ్ చేయడం ముఖ్యమంత్రి కెసిఆర్ యావత్ తెలంగాణ ప్రజలను అవమానించినట్టేనని ఉత్తమ్ దుయ్యబట్టారు. 2019లో జరిగే ఎన్నికల్లో అధికారంలోకి రాదు కాబట్టే టిఆర్ఎస్ దుర్మార్గపు ఆలోచనలు చేస్తుందన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వానికి ఇదే చివరి బడ్జెట్ సమావేశమని ఉత్తమ్ జోష్యం చెప్పారు. ప్రజల సొమ్ముతో కెసిఆర్ కుటుంబం విలాసవంతమైన జీవితాన్ని గడుపుతుందని అన్నారు. వచ్చేన్నికల్లో ఏదైన పార్టీతో కాంగ్రెస్ పొత్తుపెట్టుకుంటుందా అని మనతెలంగాణ జర్నలిస్టు ప్రశ్నించగా ఆవిషయంలో ఎఐసిసిదే తుదినిర్ణయమన్నారు. ఎఐసిసి తీసుకొనే నిర్ణాయాలకు తాము తమపార్టీ వారు కట్టుబడి ఉంటామని ఉత్తమ్ తెలిపారు.రానున్న హైకోర్టు తీర్పుతో నాయయమే గెలుస్తుందని ఉత్తమ్ దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధానకార్యదర్శి యరగాని నాగన్నగౌడ్, తన్నీరు మల్లిఖార్జున్‌రావు, మంజీనాయక్, యస్‌కె మన్సూర్‌అలీ, బెల్లంకొండ గురవయ్య, మేళ్ళచెర్వు ముక్కంటి, గుండు రామాంజిగౌడ్, కర్నె ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సాయుధ పోరాట స్ఫూర్తితో ఉద్యమాలు

సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ

మనతెలంగాణ/ వరంగల్‌బ్యూరో : నిజాం నిరంకుశత్వానికి, భూస్వామ్య పెత్తందారి విధానానికి వ్యతిరేకంగా పీడిత ప్రజల విముక్తి కోసం పోరాటం చేసిన కమలమ్మ, తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ అన్నారు. గురువారం వరంగల్ పోచమ్మ మైదాన్‌లో తెలంగాణ సాయుధ పోరాట నాయకురాలు చెన్నబోయిన కమలమ్మ సంస్మరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు తెలంగాణకు స్వాతంత్ర్యం రాలేదని, నిజాం పాకిస్తాన్‌తో కలిసి ప్రత్యేక స్వతంత్ర్య దేశంగా ప్రకటించుకునే కుట్ర చేశారన్నారు. ఆ సందర్భంలో కమ్యూనిస్టుల నాయకత్వంలో సాయుధ రైతాంగ పోరాటం సాగించడం జరిగిందని, తెలంగాణ విముక్తి జరిగే సందర్భంలో కేంద్రంలోని సర్దార్ పటేల్‌తో చర్చలు జరిపి దేశంలో విలీనం చేశారన్నారు. తెలంగాణ విముక్తిలో కమ్యూనిస్టులదే కీలక భూమిక అని ఆయన గుర్తు చేశారు. ప్రజలు ఎర్రజెండా నాయకత్వం తిరగబడాలని తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు మల్లు స్వరాజ్యం పిలుపునిచ్చారు. సాయుధ తెలంగాణ పోరాట స్ఫూర్తితో ప్రజలు దేశవ్యాప్తంగా పోరాటాలను సాగించాలన్నారు. ఈ సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, అఖిల భారత మహిళా సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి హనీ రాజా, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి సాధినేని వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

మావోయిస్టు డిప్యూటీ కమాండర్ అరెస్ట్

మన తెలంగాణ/ భద్రాచలం: చర్ల మండలంలో మరో మావోయిస్టును పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పి అంబర్ కిషోర్ ఝా గురువారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి వెల్లడించారు. చర్ల పోలీసులు కలివేరు సమీపంలో వాహన తనిఖీలు చేస్తుండగా ఓ వ్యక్తి తారసపడ్డాడు. అనుమానంతో అతన్ని ప్రశ్నించగా మావోయిస్టు అని వెల్లడైనట్లు తెలిపారు. కిష్టారంపాడుకు చెందిన సోడె ఉంగయ్య కొంత కాలంగా మావోయిస్టు పార్టీలో పనిచేస్తూ ఇటీవల మణుగూరు ఏరియా కమిటీ డిప్యూటీ కమాండర్‌గా చేరినట్లు తెలిపారు. అతని వద్ద మావోయిస్టులు అగ్రనేతలకు చేరవేస్తున్న 20 డిటోనేటర్లు, మరో 8 జిలిటెన్ స్టిక్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పి వెల్లడించారు. అనంతరం అరెస్టు చేసిన ఉంగయ్యను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలుపుతూ గతంలో లొంగిపోయిన నలుగురు మావోయిస్టులకు పునరావాసం క్రింద అందించే చెక్కులను అందించారు.

ఇనుప మేకు గొంతులో ఇరుక్కుని బాలుడి మృతి



మన తెలంగాణ/ గాంధారి (కామారెడ్డి జిల్లా): ప్రమాదవశాత్తు ఇనుప మేకు గొంతులో ఇరుక్కుని మూడు సంవత్సరాల బాలుడు మృతి చెందిన ఘటన గాంధారి మండలం కరకువాడి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే గ్రామంలో వ్యవసాయ పనులు చేసుకునే భీమరాని భాస్కర్ రావుకు ముగ్గురు సంతానం, వారిలో చిన్నవాడైన రిషివిత్ (3) బాలుడు ఇంటి వద్ద ఆడుకుంటూ సమీపంలో కనిపించిన ఇనుప మేకులు నోట్లో పెట్టుకున్నాడు. అది ప్రమాదవశాత్తు నోటిలోకి జారుకుంది. అది గమనించిన తల్లిదండ్రులు హుటాహుటిన గాంధారి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో వైద్యులు పరీక్షించి ప్రమాదకరంగా ఉందని, కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించా రు. వెంటనే కామారెడ్డికి ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో బాలుడు మృతి చెందాడు. అనంతరం వై ద్యులు బాలుడి గొంతులో మేకును బయటకు తీశారు. బాలుడి మృతితో కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

వక్ఫ్ బోర్డుకు అధికారాలు లేనట్లేనా?

ప్రజాప్రతినిధుల తీరుపై మైనారిటీ సంఘాల అసంతృప్తి

మన తెలంగాణ / హైదరాబాద్ : వక్ఫ్ బోర్డుకు చట్టబద్ధ అధికారాలు కల్పిండంలో జరుగుతున్న కాలయాపనపై మైనారిటీ వర్గాల్లో అసంతృప్తి వ్యక్తం అవుతోంది. అధికారాలు లేకపోవడంతో వక్ఫ్ ఆస్తులను పరిరక్షించడం బోర్డు కు ఒక సవాలుగా మారిందనే వాదనలు వినవస్తున్నాయి. వక్ఫ్ ఆస్తుల అన్యాక్రాంతంపై గోలచేసే ప్రజాప్రతినిధులు (మైనారిటీ వర్గానికి చెందిన వారు) చట్టబద్ధ అధికారాల కోసం అసెంబ్లీ సమావేశాల్లో గళమెత్తక పోవడాన్ని మైనారిటీ సంఘాలు స్వచ్ఛంద సంస్థలు తప్పుపడుతున్నాయి. వక్ఫ్‌బోర్డుకు చట్టబద్ధ అధికారాలు కల్పిస్తామని గతంలో ముఖ్యమంత్రి కెసిఆర్ ఇచ్చిన హామీ ఆచరణకు నోచుకోకపోగా దీనిని ఎవరూ ప్రస్తావించక పోవడం ప్రజాప్రతినిధుల చిత్తశుద్దిని శంకించాల్సి వస్తోందని 'అసోసియేషన్ ఆఫ్ సేవ్ వక్ఫ్ ప్రాపర్టీస్' ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇఫ్తెఖార్ హుస్సేన్ అన్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 77,560 ఎకరాల వక్ఫ్ భూముల్లో పెద్ద ఎత్తున వక్ఫ్ కబ్జాలకు గురైనందున బోర్డుకు చట్టబద్ధ అధికారాలు కల్పించి ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకునేందుకు ప్రజాప్రతినిధులు అసెంబ్లీలో ప్రస్తావించడం సహేతుకంగా ఉండేదని ఆయన వ్యాఖ్యానించారు. ల్యాంకో హిల్స్ ఆధీనంలో ఉన్న 800 ఎకరాల వక్ఫ్ భూములను బోర్డుకు అప్పగిస్తామని గతంలో ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని ఆయన గుర్తుచేశారు. మౌలాలీ పరిసర ప్రాంతాల్లో కూడా వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతమైనట్లు బోర్డు గుర్తించిందని, రికార్డుల్లో లేని వక్ఫ్ ఆస్తుల్లో కొంతమంది అక్రమ నిర్మాణాలు చేస్తున్నా అధికారులు, వక్ఫ్‌బోర్డు పట్టించుకోవడం లేదనే విమర్శలను ఆయన ప్రస్తావించారు. వక్ఫ్‌బోర్డులో 50 మంది ఉద్యోగులను నియమించాలని ఇటీవల వక్ఫ్‌బోర్డు ప్రతిపాదించిందని, నియామక ప్రక్రియను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ లేదా, కలెక్టర్ ద్వారా జరపాలని, ఈ అధికారాన్ని వక్ఫ్‌బోర్డుకు కల్పించరాదని మైనారిటీ సంస్థలు డిమాండ్ చేస్తున్నాయి.

గార్డెన్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

మన తెలంగాణ / హైదరాబాద్ : కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఐదేళ్ల పనికాలం పూర్తి చేసిన ప్రతి హెచ్ఎండిఎ గార్డెన్ కార్మికుడిని పర్మినెంట్ చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి వి. ఎస్.బోస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎటియుసి రాష్ట్ర కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన హెచ్ఎండిఎ గార్డెన్ వర్కర్స్ ధర్నాను ఉద్దేశించి బోస్‌తో పాటు ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉజ్జిని రత్నాకర్‌రావు, హెచ్ఎండిఎ గార్డెన్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.వీరేందర్, కోశాధికారి ఎం.నర్సింహ్మా తదితరులు ప్రసంగించారు. బోస్ మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు చెల్లించడం లేదని, ఇఎస్ఐ, పిఎఫ్, బోనస్, సెలవులు లాంటి సౌకర్యాలు అమలుచేయకుండా మోసం చేస్తున్నారని విమర్శించారు.

మరోసారి అత్త పాత్రలో రమ్యకృష్ణ



'బాహుబలి' సినిమాలో శివగామి పాత్రలో నటవిశ్వరూపం చూపించి ప్రేక్షకులను మైమరపించింది రమ్యకృష్ణ. ఆతర్వాత ఆమెకు వరుసగా మంచి ఆఫర్లు వస్తున్నాయి. వీటిలో తనకు మంచి ప్రాముఖ్యతనిచ్చే పాత్రలనే రమ్యకృష్ణ ఎంపికచేసుకుంటోంది. తాజాగా ఆమె నాగచైతన్యతో 'శైలజరెడ్డి అల్లుడు' సినిమాలో నటిస్తోంది. ఇందులో ఆమెది అత్త పాత్ర. సినిమా టైటిల్ చూస్తేనే తెలిసిపోతుంది ఆమె పాత్రకు ఎంత ప్రాముఖ్యత ఉందో. ఇప్పుడు రమ్యకృష్ణ మరో హీరోకు అత్తగా చేయడానికి ఒప్పుకుందని తెలిసింది. 'పరుగు' సినిమాతో కమేడియన్‌గా టాలీవుడ్‌లో అడుగుపెట్టిన సప్తగిరి హీరోగా చేసిన మొదటి చిత్రం 'సప్తగిరి ఎక్స్‌ప్రెస్'. ఆతర్వాత అతను హీరోగా చేసిన రెండవ చిత్రం 'సప్తగిరి ఎల్‌ఎల్‌బి'. ఇప్పుడు సప్తగిరి హీరోగా చేస్తున్న మూడవ చిత్రంలో అతని అత్తగా రమ్యకృష్ణ కనిపించబోతోంది. అల్లరి నరేష్‌తో 'సెల్ఫీ రాజా' సినిమా తీసిన దర్శకుడు ఈశ్వర్ రెడ్డి ఇప్పుడు సప్తగిరి హీరోగా ఓ సినిమా చేయబోతున్నాడు. అత్త, అల్లుడి మధ్య సాగే కథతో ఈ సినిమా తెరకెక్కనుందట. మరి ఈ చిత్రంలో అత్తగా రమ్యకృష్ణ ఏమేరకు ప్రేక్షకులను అలరిస్తుందో చూడాలి.



కన్నీరుపెట్టుకున్న కీర్తిసురేష్

కీర్తిసురేష్ టైటిల్ పాత్రలో నటిస్తున్న చిత్రం 'మహానటి'. నాటి మేటి కథానాయకి సావిత్రి జీవితం ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి నాగ్‌అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నాడు. వైజయంతీ మూవీస్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. సెట్స్‌లో ఈ చిత్రానికి గుమ్మడికాయ కొట్టారు. ఇక ఈ చిత్రం పోస్ట్‌ప్రొడక్షన్ పనులను శరవేగంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత ప్రియాంకదత్ మాట్లాడుతూ "ఏ విషయంలోనూ రాజీపడకుండా 'మహానటి' చిత్రాన్ని అద్భుతంగా నిర్మిస్తున్నందుకు గర్వపడుతున్నాం. కీర్తిసురేష్ టైటిల్ పాత్రలో నటించిన ఈ చిత్రంలో సమంత, మోహన్‌బాబు, రాజేంద్రప్రసాద్, దుల్కర్ సల్మాన్, విజయ్ దేవరకొండ, ప్రకాష్‌రాజ్, షాలిని పాండే, మాళవిక నాయర్, భానుప్రియ, దివ్యవాణి, శ్రీనివాస్ అవసరాల, క్రిష్, తరుణ్‌భాస్కర్‌లు ముఖ్య పాత్రల్లో నటించడం ఆనందంగా ఉంది. ఏఎన్నార్ పాత్రలో నటించిన అక్కినేని నాగచైతన్యకు ఎప్పటికీ రుణపడి ఉంటాం. మోహన్‌బాబు, రాజేంద్రప్రసాద్‌లు మాకు అండగా నిలబడ్డారు. ఆఖరి రోజున ఆఖరి సన్నివేశం చిత్రీకరణ పూర్తయిన తర్వాత గుమ్మడికాయ పూజలో భాగంగా సావిత్రి చిత్రపటం వద్ద ప్రతిమను వెలిగిస్తున్న తరుణంలో కీర్తిసురేష్ కన్నీరు పెట్టుకుంది. మే 9న విడుదలవుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు ఒక మరపురాని అనుభూతిని మిగుల్చుతుంది"అని అన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః డాని, మ్యూజిక్ః మిక్కీ జె.మేయర్, ఆర్ట్ః అవినాష్, స్టైలిస్ట్ః ఇంద్రాక్షి, ఎడిటర్ః కోటగిరి వెంకటేశ్వరరావు.



సావిత్రి చిత్రపటం వద్ద దీపాలు వెలిగిస్తున్న కీర్తిసురేష్

కొత్తదనం కోసం ప్రయత్నిస్తున్నా

నందమూరి కల్యాణ్‌రామ్, కాజల్ అగర్వాల్ హీరోహీరోయిన్లుగా ఉపేంద్ర మాధవ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఎంఎల్‌ఎ'. టి.జి.విశ్వప్రసాద్ సమర్పణలో బ్లూ ప్లానెట్ ఎంటర్‌టైన్‌మెంట్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌లపై కిరణ్ రెడ్డి, భరత్ చౌదరి నిర్మించిన చిత్రమిది. ఈ చిత్రం శుక్రవారం విడుదలకానుంది. ఈ సందర్భంగా కాజల్ అగర్వాల్‌తో ఇంటర్వ్యూ విశేషాలు...

● **పాత స్నేహితుడిని కలిసినట్లు...**
కళ్యాణ్‌రామ్‌తో పదేళ్ల క్రితం 'లక్ష్మీ కళ్యాణం' చిత్రంలో నటించాను. ఇప్పుడు అతనితో కలిసి రెండో సినిమా చేయడం ఆనందంగా ఉంది. సినీ ప్రయాణంలో ఇద్దరం ఎంతో మార్పు చెందాం. ఈ సినిమా చేస్తున్నప్పుడు ఇద్దరి అనుభవాలను ఒకరితో ఒకరం పంచుకున్నాం. కల్యాణ్‌తో ఈ సినిమా చేస్తున్నప్పుడు నా పాత స్నేహితుడిని కలిసినట్లు అనిపించింది. ఇక హీరో కల్యాణ్‌రామ్ తను చేసే పని పట్ల చాలా నిజాయితీగా, ప్యాషన్‌తో ఉంటాడు.

● **ఒక్క సినిమా చాలనిపించింది...**
'లక్ష్మీ కల్యాణం' చేసేటప్పుడు ఒక సినిమా చేస్తే చాలనిపించింది. వెనక్కి వెళ్లిపోయి ఎంబిఎ చదువుకుందామనిపించింది. కానీ జీవితం వేరేలా ఉంటుంది కదా. అయితే సినీ ప్రయాణం పట్ల నేను చాలా హ్యాపీగా ఉన్నాను. తెలుగు ప్రేక్షకులు నాకు ఇంత మంచి జీవితాన్ని ఇచ్చినందుకు వారికి థాంక్స్. టాలీవుడ్‌లో ఐదు సినిమాలు చేసిన తర్వాత ఇదే నా జీవితమనిపించింది. 'మగధీర' చేసేటప్పుడు వంద శాతం ఇదే నా లైఫ్ అని అర్థమైంది.

● **బలమైన పాత్రలో నటించా...**
'ఎంఎల్‌ఎ' సినిమాలో నేను ఎన్‌ఆర్‌ఐ పాత్రలో కనిపిస్తాను. చాలా బలమైన పాత్రలో నటించాను. నా క్యారెక్టర్‌లో ఓ షేడ్ కూడా ఉంటుంది. నేను ఎందుకు అలా చేస్తుంటానో అనే షేడ్ ఇంటర్వెల్ వరకు కనపడదు. దానికి కారణాలేంటో తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

● **నటిగా మంచి గుర్తింపు...**
సామాజిక సందేశాన్నిచ్చే పక్కా కమర్షియల్ ఎంటర్‌టైనర్ 'ఎంఎల్‌ఎ'. తప్పకుండా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుంది. ఈ చిత్రంతో నటిగా నాకు మంచి గుర్తింపు వస్తుంది.

● **విభిన్నమైన సినిమాలు చేస్తున్నా...**
వీలైనంత వరకు కొత్తదనం ఉన్న సినిమాలు చేయడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాను. నేను సిన్సియర్‌గా నా పాత్రలకు న్యాయం చేయడానికి కృషి చేస్తాను. నేడు ప్రేక్షకులు ఆసక్తికరమైన సినిమాలను చూడాలనుకుంటున్నారు. అలాంటి సమయంలో ఓ నటిగా విభిన్నమైన సినిమాలు చేస్తున్నాను. ఇందులో భాగంగానే మంచి పాత్రలు చేస్తూ వస్తున్నాను. కమర్షియల్ సినిమాలు, కొత్త తరహా సినిమాలను బ్యాలెన్స్ చేస్తూ కెరీర్‌లో ముందుకు సాగుతున్నాను.

● **గొప్ప సంతృప్తినిచ్చింది...**
'అ!' సినిమా నా కెరీర్‌లో ఓ స్పెషల్ మూవీ. ప్రేక్షకులకు ఈ సినిమా కొత్త అనుభూతిని కలిగించింది. ఒక భిన్నమైన సినిమాను అందరూ మెచ్చుకోవడం నాకు గొప్ప సంతృప్తినిచ్చింది.

● **తదుపరి చిత్రాలు...**
ప్రస్తుతం 'క్వీన్' తమిళ్ రీమేక్‌లో నటిస్తున్నాను. ఈ చిత్రం నాకు మంచి పేరును తీసుకువస్తుందన్న నమ్మకముంది. దీంతో పాటు బెల్లంకొండ శ్రీనివాస్ సినిమాకు సైన్ చేశాను.














వొడాఫోన్– ఐడియా విలీన సంస్థకు చైర్మన్‌గా కెఎం బిర్లా

న్యూఢిల్లీ: వొడాఫోన్, ఐడియా సెల్యులార్ విలీన ప్రక్రియ పూర్తయిన తర్వాత ప్రతిపాదిత సంయుక్త వ్యాపార బృందం నాయకత్వం అమల్లోకి వస్తుందని గురువారం ఇరు సంస్థలు ప్రకటించాయి. నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా కుమార్ మంగళం బిర్లా బాధ్యతలు నిర్వహిస్తారని తెలిపాయి. వొడాఫోన్ సిఇఒ బాలేష్ శర్మ సిఇఒగా వ్యవహరిస్తారని ఈమేరకు రెగ్యులేటరీకి ఐడియా తెలిపింది. అనుకున్నదాని కంటే ఆర్నెళ్ల ముందుగానే ఈ విలీన ప్రక్రియను ఈ సంస్థలు ముగిస్తున్నాయి. మొదట విలీన ప్రక్రియ సెప్టెంబర్ 2018 నాటికి పూర్తికావాలని నిర్ణయించారు. అంతకంటే ముందే అంటే మార్చి–ఏప్రిల్ నాటికి ఈ ప్రక్రియను ముగించాలని నిర్ణయించారు. విలీనానికి కావాల్సిన అనుమతులన్నీ 2018 మార్చి, ఏప్రిల్ నాటికి లభించే అవకాశాలు ఉన్నాయని మేనేజ్‌మెంట్ భావిస్తోందని ఇటీవల ఓ ప్రకటనలో వెల్లడించారు. వొడాఫోన్ ఇండియా నేతృత్వంలోని వొడాఫోన్, కుమార మంగళం బిర్లా నేతృత్వంలోని ఐడియా సంస్థలు దేశంలో రెండో, మూడో అతి పెద్ద టెలికాం సంస్థలుగా ఉన్నాయి. విలీనం ద్వారా 400 మిలియన్ వినియోగదారులతో దేశంలో పెద్ద టెలికాం కంపెనీగా అవతరించనుంది.

ఆర్‌కామ్‌కు ఎదురుదెబ్బ

- ఆస్తుల విక్రయాన్ని నిరాకరించిన సుప్రీంకోర్టు
- విచారణ ఏప్రిల్ 5కు వాయిదా
- కంపెనీ షేరు భారీగా 6 శాతం పతనం



న్యూఢిల్లీ: అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ కమ్యూనికేషన్(ఆర్‌కామ్)కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆర్‌కామ్ ఆస్తుల విక్రయానికి గురువారం కోర్టు అనుమతిని నిరాకరించింది. అనంతరం కేసు విచారణను మరో రెండు వారాలపాటు వాయిదా వేసింది. 6.8 బిలియన్ డాలర్ల అప్పులను తగ్గించుకోవాలని, రుణదాతలకు తిరిగి చెల్లింపులు చేయాలని భావిస్తున్న ఆర్‌కామ్‌కు కోర్టు తీర్పు నిరాశను మిగిల్చింది. కోర్టు తీర్పు నేపథ్యంలో స్టాక్ మార్కెట్లో కంపెనీ షేరు విలువ భారీగా 6.9 శాతం మేరకు పడిపోయాయి. ఆర్‌కామ్ ఆస్తులను ముఖేష్ అంబానీకి చెందిన రిలయన్స్ జియోకు విక్రయించకుండా బాంబే హైకోర్టు స్టే విధించిన విషయం తెలిసిందే. ఈ స్టేను ఎత్తివేయాలని సుప్రీంను ఆశ్రయించినా తిరస్కరణ ఎదురైంది. మళ్లీ విచారణ జరిపేంత వరకు బాంబే హైకోర్టు తీర్పు కొనసాగుతుందని సుప్రీం స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 5కు వాయిదా వేసింది. తీవ్ర అప్పుల్లో కూరుకుపోయిన ఆర్‌కామ్ ఆ భారాన్ని తగ్గించుకునేందుకు తన ఆస్తులను జియో ఇన్ఫోకామ్‌కు విక్రయిస్తున్నట్లు గతేడాది డిసెంబరులో ప్రకటించింది. ఈ మేరకు అంబానీ సోదరులు అనిల్, ముఖేశ్‌ల మధ్య ఒప్పందం కుదిరింది. ఆర్‌కామ్‌కు వ్యతిరేకంగా ఎరిక్సన్ సంస్థ ఆర్బిట్రేషన్ కోర్టును ఆశ్రయించి.. తమ బకాయిలు చెల్లించకుండా ఆస్తులు విక్రయిస్తున్నారని ఆరోపించింది. దీంతో అనుమతులు లేకుండా రిలయన్స్ కమ్యూనికేషన్స్ ఆస్తులు అమ్మరాదని ఆర్బిట్రేషన్ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆర్బిట్రేషన్ తీర్పును సవాల్ చేస్తూ ఆర్‌కామ్ హైకోర్టును ఆశ్రయించినా ఊరట లభించలేదు. కంపెనీ ఆస్తులు విక్రయించకుండా హైకోర్టు కూడా స్టే విధించింది. తాజాగా ఈ కేసును విచారించిన సుప్రీం కోర్టు కూడా ఇదే తీర్పునిచ్చింది. సుప్రీం ఆదేశాలతో స్టాక్‌మార్కెట్లో కంపెనీ షేరు ఒక్కసారిగా కుప్పకూలింది.

ఏప్రిల్ తర్వాత మార్కెట్‌లోకి రాయల్ ఎన్‌ఫీల్డ్ కొత్త బైకులు



న్యూఢిల్లీ: ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ట్విన్ పవర్డ్ 650 సిసి మోటార్ సైకిళ్లను ఏప్రిల్ తర్వాత దేశీయ మార్కెట్లోకి రాయల్ ఎన్‌ఫీల్డ్ లాంఛ్ చేసింది. ఇంటర్‌సెప్టర్ 650, కాంటినెంటల్ జిటి 650 పేర్లతో రూపొందించిన ఈ బైక్‌లను ఆస్ట్రేలియన్ మార్కెట్‌లో రిటైల్ చేయబోతోంది. వీటిని తొలుత బ్రిటన్, యురోపియన్ మార్కెట్లలో లాంఛ్ చేయనుంది. వీటి ధరలు ఆస్ట్రేలియా మార్కెట్‌లో 10వేల ఎయుడి (రూ.5.04 లక్షలుగా)గా, 10,400 ఎయుడి(రూ.5.24 లక్షలుగా)గా ఉన్నాయి. ఈ రెండు కొత్త బైక్‌లను చెన్నై ప్లాంట్‌లోనే రాయల్ ఎన్‌ఫీల్డ్ తయారీచేసింది. దేశీయ మార్కెట్‌లో వీటిని 2018 ఏప్రిల్ తర్వాత లాంచ్ చేయబోతోంది. భారత్‌లో వీటి ధరలు ఎంత ఉంటాయనేది వెల్లడించేందుకు కంపెనీ నిరాకరించింది. హిమాలయన్ బైక్ ధర భారత్‌లో రూ.1.68 లక్షలుగా ఉండగా, ఆస్ట్రేలియాలో రూ.3.02 లక్షలుగా ఉంది. అంటే కొత్త ఇంటర్‌సెప్టర్ 650 బైక్ ధర భారత మార్కెట్‌లో సుమారు రూ.3 లక్షలుగా ఉండొచ్చని తెలుస్తోంది. కాంటినెంటర్ జిటి 650 ధర దానికి కంటే కాస్త ఎక్కువగా ఉంటుందని అంచనాలు వెలువడుతున్నాయి.

స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	33006.27	−129.91	− 0.39%
నిఫ్టీ	10114.75	−40.50	− 0.40%



కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	63.28
యూరో	76.12
బ్రిటిష్ పౌండ్	85.87
ఆస్ట్రేలియన్ డాలర్	49.75
కెనెడియన్ డాలర్	50.98
ఎమిరైట్ దిర్హామ్	17.23
స్విస్ ఫ్రాంక్	64.89
చైనీస్ యువాన్	9.75
మలేషియన్ రింగిట్	15.83
న్యూజిలాండ్ డాలర్	45.36
హాంగ్‌కాంగ్ డాలర్	8.09
జపనీస్ యెన్	0.56
కువైట్ దినార్	209.96
సౌతాఫ్రికన్ రాండ్	5.14

బులియన్





బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	29230	31262.03	0.07%
ముంబై	29790	31860.96	0%
ఢిల్లీ	29850	31925.13	1.02%
కోల్‌కతా	29860	31935.83	0.57%
కేరళ	28300	30267.38	0.53%
బెంగళూరు	28650	30641.71	0.88%
హైదరాబాద్	29230	31262.03	0.07%
గల్ఫ్	1412.08	1510.25	1.31%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	గురువారం	బుధవారం	మార్పు (%)
చెన్నై	41100.00	41300.00	−0.48
ముంబై	41100.00	41300.00	−0.48
ఢిల్లీ	41100.00	41300.00	−0.48
కోల్‌కతా	41100.00	41300.00	−0.48
హైదరాబాద్	41100.00	41300.00	−0.48



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	315	విశాఖపట్నం	325
వరంగల్	332	చిత్తూరు	363
విజయవాడ	317	చెన్నై	370
గోదావరి	317	బెంగళూరు	365

లాభాలతో ప్రారంభమై.. నష్టాలతో ముగింపు

130 పాయింట్ల నష్టపోయిన సెన్సెక్స్



ముంబై: దేశీయ మార్కెట్ సూచీలు గురువారం తీవ్ర ఊగిసలాటకు లోనయ్యాయి. తొలుత లాభాలతో ప్రారంభమైన సూచీలు.. ఆ తర్వాత ఆఖరికి నష్టాల బాటపట్టాయి. అంచనాలకు అనుగుణంగానే అమెరికా ఫెడరల్ రిజర్వ్ సమీక్షలో పావు శాతమే వడ్డీ రేటును పెంచింది. మరోవైపు డెరివేటివ్స్ గడువు తేదీ సమీస్తుండడంతో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారు. లాభాలతో మొదలైన సెన్సెక్స్ తొలుత 33,281ను అధిగమించింది. ఆపై మిడ్ సెషన్ నుంచి అమ్మకాలు వెల్లువెత్తడంతో ఆఖరికి 130 పాయింట్ల నష్టపోయి 33,006 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 10,208–10,105 పాయింట్ల మధ్య కదలాడింది. నిఫ్టీ 40 పాయింట్ల క్షీణతతో 10,115 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇలో అత్యధికంగా పిఎస్‌యు బ్యాంక్స్ 2 శాతం నష్టపోయాయి. ఆ తర్వాత రియల్టీ, ఐటీ, ఆటో, ఫార్మా 1.2 నుంచి 0.6 శాతం మధ్య డౌన్ అయ్యాయి. మెటల్ మాత్రమే (0.3 శాతం) బలపడింది. నిఫ్టీ దిగ్గజాలలో బిపిసిఎల్, హెచ్‌పిసిఎల్, ఎస్‌బిఐ, విప్రో, ఐసిఐసిఐ, మారుతీ, ఎం అండ్ ఎం, సిప్లా, అల్ట్రాటెక్, బాష్ పతనమయ్యాయి. అయితే ఒఎన్‌జిసి, వేదాంతా, ఆర్ఐఎల్, ఇండస్‌ఇండ్, టాటా మోటార్స్, సన్ ఫార్మా, గెయిల్, హిందాల్కో పుంజుకున్నాయి. చిన్న షేర్లలో భారీ అమ్మకాలు నమోదయ్యాయి. బిఎస్ఇలో మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 1 శాతం మేరకు దిగివచ్చాయి. ట్రేడైన మొత్తం షేర్లలో 2,008 షేర్లు నష్టపోగా, 711 షేర్లు మాత్రమే లాభాలను నమోదు చేశాయి. నగదు విభాగంలో బుధవారం ఎఫ్‌పిఐ (విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టరు) రూ. 98 కోట్లను ఇన్వెస్ట్‌చేయగా, మరోవైపు దేశీ ఫండ్స్(డిఐఐ) రూ. 198 కోట్ల విలువైన స్టాక్స్ కొనుగోలు చేశాయి.

రాజకీయ పరిణామాలతో ఆందోళన వచ్చే ఎన్నికలపైనే ఇన్వెస్టర్ల దృష్టి



న్యూఢిల్లీ: దేశంలో వరుసగా చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలు మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. ప్రతిపక్షాలు ఏకం కావడం, కీలక కూటమి నుంచి టిడిపి వైదొలగడం వంటి అంశాలు అధికార పార్టీ బిజెపిని ఇరకాటంలో పడేశాయి. ఈ నేపథ్యంలో వచ్చే సాధారణ ఎన్నికలపై ఇన్వెస్టర్లు ఎక్కువగా దృష్టి పెట్టారని అంతర్జాతీయ బ్రోకరేజీ సంస్థ నోమురా పేర్కొంది. 2014 ఎన్నికల మాదిరిగా ఈసారి ఎన్నికల సమయంలో మార్కెట్ పైపైకిపోయే అవకాశం లేదని సంస్థ అంచనావేసింది. ప్రతిపక్షాల అతిపెద్ద కూటమి ఏర్పాటైతే దేశీయ మార్కెట్ సూచీలు నేలచూపులు చూస్తాయని భావించింది. బిజెపిని ఓడించడం కోసం ప్రతిపక్షాలు ఏకమయ్యే అవకాశాలు అధికంగా ఉన్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఈసారి సాధారణ ఎన్నికల అంశానికి అధిక ప్రాధాన్యత ఇవ్వవలసిన అవసరం ఉందని, సంకీర్ణం ఏర్పడితే పెట్టుబడులపై ఆశించిన రాబడులు రాకపోగా నష్టాలను చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చని నోమురా అభిప్రాయపడింది. తాజాగా మూడు ఈశాన్య రాష్ట్రాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో బిజెపి విజయం సాధించినప్పటికీ పరిస్థితులు సానుకూలంగా లేవు. ఉత్తర ప్రదేశ్ లోక్‌సభ ఉపఎన్నికలలో రెండు సీట్లను అధికార పార్టీ కోల్పోవడాన్ని చూస్తే స్టాక్‌మార్కెట్‌కు అతిపెద్ద రాజకీయ తుఫానే తాకవచ్చని నోమూరా విశ్లేషిస్తోంది. ఎన్‌డిఎ నుంచి టిడిపి వైదొలగడం, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అవిశ్వాస తీర్మానానికి డిమాండ్ చేయడం లాంటి అంశాలు అధికార పార్టీకి ఇబ్బందులు కల్గిస్తాయని నోమురా అభిప్రాయపడింది.

ఎల్‌ఐసికి ప్రభుత్వరంగ షేర్ల నష్టాల సెగ

న్యూఢిల్లీ: షేర్లలో ఇన్వెస్ట్ చేసి లాభాలను పొందే దేశీయ బీమా సంస్థ ఎల్‌ఐసి ఇటీవల ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటోంది. దేశీయంగా అతిపెద్ద సంస్థాగత ఇన్వెస్టర్ అయిన ఎల్‌ఐసికి 53 ప్రభుత్వ రంగ కంపెనీల్లో పెట్టుబడులు ఉన్నాయి. వీటిలో 51 సంస్థల్లో ఒక శాతంగా ఎక్కువగా ఎల్‌ఐసికి వాటాలు ఉన్నాయి. ఇటీవల పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో కుంభకోణంతో ప్రభుత్వరంగ బ్యాంకులన్నీ నీరసంగా కనిపిస్తున్నాయి. పిఎన్‌బి, కార్పొరేషన్ బ్యాంక్, భెల్ లాంటి కంపెనీల్లోనైతే 19 శాతం వరకు వాటాలు ఉన్నాయి. గత నెల్లో ఆరంభమైన కరెక్షన్‌తో కోల్‌ఇండియా, సెంట్రల్ బ్యాంక్, ఐడిబిఐ బ్యాంక్ మినహా మిగిలిన ప్రభుత్వరంగ సంస్థలు భారీగా నష్టాలు మూటకట్టుకున్నాయి. దీంతో ఈ కంపెనీల్లో వాటాలున్న ఎల్‌ఐసి పిఎస్‌యు పోర్టుఫోలియో రూ.20వేల కోట్ల నష్టాల్లోకి జారుకుంది. ఈ దిద్దుబాటులో చాలా కంపెనీలు 40 శాతానికి పైగా పతనమయ్యాయి. వాస్తవానికి ఎల్‌ఐసికి.. పిఎన్‌బితో వాటిల్లిన నష్టం కన్నా ఎస్‌బిఐ క్షీణతతో వచ్చిన నష్టమే ఎక్కువగా ఉంది. ఎల్‌ఐసికి ఎస్‌బిఐలో 10 శాతం వాటా ఉంది. కరెక్షన్‌కు ముందు ఎస్‌బిఐలో ఎల్‌ఐసి వాటా విలువ రూ. 28 వేల కోట్లు ఉండగా, ఇప్పుడు అది రూ.22 వేల కోట్లకు పడిపోయింది. అంటే రూ.6వేల కోట్ల రూపాయల నష్టం ఏర్పడింది. పిఎన్‌బి పతనంతో 2,500 కోట్లరూపాయల నష్టం వాటిల్లింది. ఒఎన్‌జిసిలో రూ.3వేల కోట్లు, బిఒఐ, ఎన్‌టిపిసిలో రూ.వెయ్యి కోట్లు చొప్పున ఎల్‌ఐసికి నష్టం ఏర్పడింది.

సమస్యలున్నా దివాళా ప్రక్రియను ఆపలేవు

ఎస్‌బిఐ చైర్మన్ రజినీష్ కుమార్



న్యూఢిల్లీ: సవాళ్లు ఎదురవుతున్నా.. దివాళా చట్టాన్ని ఆపలేవని దేశీయ అతిపెద్ద ప్రభుత్వరంగ బ్యాంక్ ఎస్‌బిఐ చైర్మన్ రజినీష్ కుమార్ పేర్కొన్నారు. కొత్త చట్టం, ప్రస్తుత పరిణామాలు పరీక్షా సమయమని, ఇది ఎవరినీ నిరాశపర్చబోదని ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన అన్నారు. కోర్టులు ఈ ప్రక్రియను ఆపబోవని, రుణదాతల కమిటీ ఈ ప్రక్రియను కొనసాగిస్తుందని, తుది నిర్ణయం ఎన్‌సిఎల్‌టి(నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్) తీసుకుంటుందని ఆయన వివరించారు. దివాళా చట్టం విషయం ఇంతకుముందే రుణదాతలకు అవగాహన ఉందని, తీర్మాన ప్రణాళికను కమిటీ ఆమోదించినా.. అదే తుది నిర్ణయం కాదని కుమార్ అన్నారు. చివరికి ఇది న్యాయ ప్రక్రియలోకి వెళుతుందని అన్నారు. దివాలా చట్టంలోని అనేక ప్రక్రియలు పరీక్షను ఎదుర్కొంటున్నాయని, అయితే దీని అమలులో ప్రభుత్వం సహకరిస్తుందని అన్నారు. గత ఏడాది చాలా మొండి ఖాతాలు ఎన్‌సిఎల్‌టికి వెళ్లిన తర్వాత ఆర్‌బిఐ ఆదేశాలు జారీ చేసింది. ఇటీవల ఆర్‌బిఐ మొండి బాకీలను పరిష్కరించడానికి గడువు విధించింది. 180 రోజుల్లోగా మొండి బకాయి సమస్యలను పరిష్కరించుకోవాలని, లేకపోతే కోర్టుకు వెళ్లాలని సూచించింది. రూ.2,000 కోట్ల పైబడిన మొండి ఖాతాలను 180 రోజుల్లోగా పరిష్కరించాలని బ్యాంకులకు ఆదేశాలు ఇచ్చింది. 2018 మార్చి ఒక్కటో తేది నుంచి ఈ కొత్త నిబంధనలకు అమల్లోకి వస్తాయని తెలిపింది. మొండి బకాయిదారులపై చర్యలు తీసుకునేందుకు ఆర్‌బిఐ గతేడాది బ్యాంకులకు కొన్ని అధికారాలు కల్పించినప్పటికీ సత్ఫలితాలను ఇవ్వలేదు. బ్యాంకుల్లో ఎన్‌పిఎ(నిరర్థక ఆస్తులు)లు పెరుగుతూనే ఉన్నాయి. గత ఏడాదిగా ప్రభుత్వ రంగంలోని పలు పెద్ద, చిన్న బ్యాంకులు భారీ నష్టాలను మూటగట్టు కున్నాయి. ఎస్‌బిఐ మొండి బాకీల దెబ్బతో 2017 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.1887 కోట్ల నష్టాలు చవిచూసింది. ఇదే సమయంలో బ్యాంకు ఆఫ్ ఇండియా రూ.2341 కోట్ల నష్టాలు నమోదు చేసింది. ఇదే తరహా ఇతర బ్యాంకులు కూడా నష్టాల పాలవుతున్నాయి. దేశీయ బ్యాంకులు రూ.10 లక్షల కోట్ల పైగా మొండి బాకీలతో సతమతం అవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆర్‌బిఐ కొత్త నిబంధనలు రూపొందించింది. మొండి బకాయిలను 180 రోజుల్లోగా పరిష్క రించాలని బ్యాంకులకు ఆదేశాలు జారీ చేసింది. అయితే అది కూడా గడువు పూర్తయిన 15 రోజుల్లోగానే నమోదు చేయాలని సూచించింది. గడువులోగా పరిష్కార ప్రక్రియ పూర్తి కాకపోతే ఆయా బ్యాంకులు దివాలా కేసు కింద నమోదు చేసి, చర్యలు చేపట్టవచ్చని ఆర్‌బిఐ సూచించింది.

మహేశ్వరంలో ఎలక్ట్రానిక్ క్లస్టర్

రూ.440 కోట్లతో మ్యానిఫ్యాక్చరింగ్ క్లస్టర్ ఏర్పాటు



మన తెలంగాణ / హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో ఏర్పాటు చేయనున్న ఎలక్ట్రానిక్ మ్యానిఫ్యాక్చరింగ్ క్లస్టర్‌లో రూ. 440 కోట్ల అంచనా వ్యయంతో ఈ సైన్స్ పార్కును నెలకొల్పడానికి తైవాన్‌కు చెందిన ఒక కంపెనీ ముందుకు వచ్చింది. అయితే స్వయంగా ఆ సంస్థ పెట్టుబడులు పెట్టకుండా కో–డెవలపర్ పద్ధతిలో అభివృద్ధికి సహకారం ఇవ్వాలని భావిస్తోంది. ప్రస్తుతం తైవాన్‌లో 300 ఎకరాల్లో ఎలక్ట్రానిక్ ఎన్‌ఈజెడ్‌ను కూడా ఈ కంపెనీ అభివృద్ధిపరిచినట్లు టిఎస్ఐఐసి వర్గాలు పేర్కొంటున్నాయి. మహేశ్వరంలో ఎలక్ట్రానిక్ క్లస్టర్‌ను అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం 2014 నుండి భావిస్తున్నప్పటికీ వివిధ కారణాలతో పనులు ముందుకు సాగలేదు. ఎలక్ట్రానిక్ మ్యానిఫ్యాక్చరింగ్ క్లస్టర్ ఏర్పాటుకు సహకరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కూడా అభ్యర్థించింది. రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకు కేంద్రం తన సమ్మతిని తెలియజేస్తూ మొత్తం రూ.445 కోట్లకు కాకుండా రూ.250 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఇందులో కేంద్రం తన వంతు వాటాగా 40 శాతం సమకూరుస్తుందని, మిగిలిన 60 శాతం వాటాను రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చాలని షరతు విధించింది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపినట్లు సమాచారం.

కో–డెవలపర్‌గా వస్తాం : మహేశ్వరం ఎలక్ట్రానిక్ క్లస్టర్‌పై ఆసక్తిగా ఉన్న తైవాన్‌కు చెందిన ఒక కంపెనీ కో–డెవలపర్ రూపంలో సహకారం అందించనుంది. ఈ ప్రాజెక్టును అప్పగిస్తే రూ. 500 కోట్లతో తైవాన్‌కు చెందిన పెద్దపెద్ద కంపెనీలను తెలంగాణకు రప్పిస్తామని ఆ కంపెనీ పేర్కొంటున్నట్లు సమాచారం. ఈ కంపెనీ పూర్తి వివరాలను టిఎస్ఐఐసి ఉన్నతాధికారులు వాకబు చేస్తున్నారు. ఢిల్లీలో ఉన్న తైపేయి ఎకనామిక్ కల్చరల్ సెంటర్ ఎంబసీ ద్వారా వివరాలు తెలుసుకుంటున్నారు. ప్రభుత్వ అంచనాల మేరకు తైవాన్ కంపెనీ ఉన్నట్లయితే ఏప్రిల్‌లోనే సదరు కంపెనీ ప్రతినిధి బృందాన్ని రాష్ట్రానికి ఆహ్వానించాలని, ఆ తర్వాత మేలో తెలంగాణ నుండి మరో బృందాన్ని తైవాన్‌కు పంపించి ఖరారు చేసుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం

క్రీమీలేయర్ నిబంధన తొలగించే ఆలోచన లేదు : కేంద్రం



మన తెలంగాణ/న్యూఢిల్లీ: ఓబీసీ రిజర్వేషన్ల అమలులో క్రీమీ లేయర్ నిబంధనను తొలగించే ఆలోచన ఏదీ ప్రభుత్వానికి లేదని సామాజిక న్యాయ శాఖ మంత్రి కృష్ణ పాల్ గుర్జర్ గురువారం రాజ్య సభలో వెల్లడించారు. ఓబీసీలలో క్రీమీ లేయర్ కేటగిరీకిఆదాయ పరిమితిని ఏడాదికి 6 లక్షల నుంచి 8 లక్షల వరకు పెంచాలని నేషనల్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ కమిషన్ సిఫార్సు చేసిందా అన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు. విజయసాయి రెడ్డి ప్రశ్నకు మంత్రి లేదని చెప్పారు. ఓబీసీ రిజర్వేషన్లలో క్రీమీ లేయర్ నిర్ధారణ కోసం వినియోగదారుల ధరల సూచీని ప్రాతిపదికగా చేసుకుని 2013లో ఎలాగైతే ఆదాయ పరిమితిని ఏడాదికి 6 లక్షల రూపాయలకు ప్రభుత్వమే నిర్ణయం తీసుకుందో ఆ ప్రాతిపదికనే ప్రస్తుతం ప్రభుత్వం ఆదాయ పరిమితిని ఏడాదికి 8 లక్షల రూపాయలకు పెంచినట్లు మంత్రి తెలిపారు. ఎస్సీ, ఎస్టీల మాదిరిగానే ఓబీసీలలో కూడా క్రీమీ లేయర్ పరిమితిని తొలగించి రిజర్వేషన్లను అమలు చేయాలని ఓబీసీ నాయకులు, సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్న విషయం వాస్తవమేనా అన్న మరో ప్రశ్నకు మంత్రి అవునని సమాధానం చెప్పారు భారత దేశంలోని పెద్ద పులు ల అభయారణ్యాలలో నివసించే ఆదివాసీలు, ఇతర అరణ్యవాసుల వివరాలేవీ తమ వద్ద అందుబాటులో లేవని ఆదివాసీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి సుదర్శన్ భగత్ వెల్లడించారు.



కుప్పకూలిన నావికాదళ డ్రోన్

అహ్మదాబాద్: గుజరాత్‌లో భారత నావికాదళానికి చెందిన మానవ రహిత విమానం డ్రోన్ కుప్పకూలింది. గురువారం ఉదయం 10 గంటలకు పోరుబందర్‌కు చెందిన ఉల్వాస్‌నగర్ ప్రాంతంలో టేపాంతంలో అయిన కొద్ది సేపటికే విమానం కూలిపోయినట్లు అధికారులు తెలిపారు. డ్రోన్ కూలిన వెంటనే దానికి నిప్పంటుకోవడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చినట్లు నావికాదళం ఒక ప్రకటనలో తెలిపింది ఇంజన్ వైఫల్యం కారణంగా డ్రోన్ కూలిపోయినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని అధికారులు తెలిపారు. ఓ ఐస్ కంపెనీకి చెందిన బహిరంగ ప్రాంతంలో విమానం కూలడంతో ప్రాణ నష్టం జరగలేదని పోరుబందరు ఎస్‌పి సోబా బుట్డా తెలిపారు.

విఆర్ఎస్‌కు లక్ష్మీ నారాయణ దరఖాస్తు



ముంబయి: సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీ నారాయణ స్వచ్ఛంద పదవీ విరమణ (విఆర్ఎస్)కు దరఖాస్తు చేసుకున్నారు. తన దరఖాస్తును అనుమతించాలని కోరుతూ ఆయన మహారాష్ట్ర డిజిపికి గురువారంనాడు లేఖ రాశారు. ప్రస్తుతం మహారాష్ట్ర అదనపు డిజిగా లక్ష్మీ నారాయణ పని చేస్తున్నారు. పదవీ విరమణకు ముందే ఆయన ఎందుకు ఈ నిర్ణయం తీసుకున్నారన్నదానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. అప్పట్లో వైఎస్ జగన్ అక్రమాస్తుల కేసు, గాలి జనార్దన్‌రెడ్డి మైనింగ్ కేసుల వ్యవహారంలో సిబిఐ దర్యాప్తులో లక్ష్మీ నారాయణ కీలక పాత్ర పోషించారు. పదవీ విరమణ తర్వాత ఆయన రాజకీయాల్లోకి ప్రవేశించనున్నారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన లక్ష్మీ నారాయణ 1990 మహారాష్ట్ర క్యాడర్ ఐపిఎస్ అధికారి.

సుష్మపై ఉల్లంఘన నోటీసు ఇస్తాం

న్యూఢిల్లీ : కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి సుష్మాస్వరాజ్‌కు వ్యతిరేకంగా సభా హక్కుల ఉల్లంఘటన నోటీసులు ఇవ్వనున్నట్లు కాంగ్రెస్ ప్రకటించింది. కాంగ్రెస్ సీనియర్ నేత అంబికా సోని గురువారంనాడు ఈ విషయాన్ని వెల్లడించారు. 'ఐసిస్ చేతిలో బంధీలైన 39 మంది భారతీయ విషయంలో సుష్మా పార్లమెంట్‌ను, వారి బంధువులను మోసం చేశారు. ఇంతకాలం వారు బతికే ఉన్నారంటూ ప్రకటనలు చేస్తూ కుటుంబ సభ్యులను పక్కదారి పట్టించారు. అందుకే ఈ నోటీసులు' అని అంబికా సోని తెలిపారు. రాజ్యసభలో ఈ తీర్మాన నోటీసులు ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. మరోవైపు కాంగ్రెస్ నేతలు శశిథరూర్, గులాం నబీ ఆజాద్‌లు విదేశాంగ శాఖపై మండిపడ్డారు.మరోవైపు కేంద్రం తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు కాంగ్రెస్ పార్టీపై ఆరోపణలు చేస్తోందని అధ్యక్షుడు రాహుల్ గాంధీ ట్వీట్ చేసిన కొద్ది గంటల్లోనే ఈ నోటీసుల అంశం తెరపైకి రావటం విశేషం.

15 మంది నక్సలైట్లు అరెస్ట్

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో 15 మంది నక్సలైట్లను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వారిలో ఇద్దరిపై నగదు బహుమతి ఉందన్నారు. ఎస్‌టిఎఫ్, డిఆర్‌జి బలగాలు బుధవారం సంయుక్తంగా చేపట్టిన నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌లో బెజ్జిలో ఇద్దరు మహిళలు సహా 14 మంది నక్సలైట్లను అరెస్ట్ చేశామన్నారు. జిల్లాలోని పుష్పాల్ ప్రాంతంలో ఆర్మ్‌డ్, డిఎఫ్ బలగాలు మరో నక్సలైట్‌ను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 18న ఎలార్‌మడుగు అడవుల్లో జరిపిన దాడిలో ఇద్దరు పోలీసులు మృతి చెందిన ఘటనతో 14 మందికి సంబంధముందని డిఐజి తెలిపారు. ఇదో రోజు జరిగిన మరో ఘటనలో కూలీని హత్య చేయడంతోపాటు10 నిర్మాణ సంబంధం వాహనాలను ధ్వంసం చేసిన కేసులో సైతం వారు నిందితులుగా ఉన్నారన్నారు. దండకారణ్య ఆదివాసి కిసాన్ మజ్దూర్ సంఘటన్ అధ్యక్షుడు సోది పుజ్జా (42)పై లక్ష రూపాయల నగదు బహుమతి ఉందని తెలిపారు.

బ్రహ్మోస్ ప్రయోగం సక్సెస్

న్యూఢిల్లీ/ఫోఖ్రాన్: బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్షిపణిని భారత్ విజయవంతంగా ప్రయోగించింది. గురువారం ఉదయం 8.42 గంటలకు రాజస్థాన్‌లోని పోఖ్రాన్ ప్రయోగ కేంద్రం నుంచి బ్రహ్మోస్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించారు. బ్రహ్మోస్‌ను విజయవంతం చేసిన శాస్త్రవేత్తలను రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అభినందించారు. నిర్దారిత లక్ష్యాలను బ్రహ్మోస్ అత్యంత కచ్చితంగా చేరుతుందని తెలిపారు. ఈ క్షిపణి ప్రయోగం విజయవంతం కావడం దేశ భద్రతను మరింత పెంచిందని ఆమె ట్వీట్ చేశారు. గత ఏడాది నవంబర్‌లో బహ్మోస్‌ను మొదటిసారిగా సుఖోయ్ యుద్ధ విమానం నుంచి విజయవంతంగా ప్రయోగించారు. ఆ తర్వాత మళ్లీ బ్రహ్మోస్‌ను విజయవంతంగా పరీక్షించారు. భారత్, రష్యాలు సంయుక్తంగా రూపొందించిన బ్రహ్మోస్ క్షిపణిని 400 కిలో మీటర్ల వరకు పొడిగించుకోవచ్చని రక్షణశాఖ నిపుణులు తెలిపారు. 40 సుఖోయ్ యుద్ధ విమానాల్లో బ్రహ్మోస్‌ను మోహరించడం ఇప్పటికే ప్రారంభమైంది. ఈ ప్రాంతంలో పెరుగుతున్న భద్రతా అవసరాలను తీర్చడంలో బ్రహ్మోస్ కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నారు.



కొనసాగుతున్న 'కోటా' నిరసన

● లోక్‌సభలో అద్వానీతో టిఆర్ఎస్ ఎంపిల చర్చ ● స్పీకర్ చొరవ చూపాలన్న బిజెపి సీనియర్ నేత

మన తెలంగాణ/న్యూఢిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైన నాటి నుంచి రిజర్వేషన్ల పెంపు కోసం కేంద్ర ప్రభుత్వంపై తమ నిరసనలు వ్యక్తం చేస్తున్న టిఆర్ఎస్ పార్టీ ఎంపీలు గురువారం లోక్‌సభ వాయిదా అనంతరం బిజెపి సీనియర్ నేత ఎల్‌కే అద్వానీని కలిశారు. తెలంగాణ రాష్ట్రంలో రిజర్వేషన్ల కోటా పెంచాల్సిన అవసరాన్ని ఆయనకు వివరించారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల పెంపు ముస్లింలకు 12శాతం రిజర్వేషన్ ఇవ్వడానికి రాజ్యాంగ సవరణ అవసరం ఉందని, దాని పై సాధ్యమైనంత త్వరగా స్పష్టత ఇవ్వాలని కోరారు. ఇందుకు స్పందించిన అద్వానీ.. ఆ మేరకు లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ చొరవ చూపాలని కోరినట్టు సమాచారం. ఇప్పటికే, టిఆర్ఎస్ ఎంపీలు బుధవారం లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్‌ను కలిసి రిజర్వేషన్ల పెంపు అంశాన్ని వివరించారు.మరోవైపు వరుసగా ఐదో రోజు టిఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్ సభలను స్తంభింపజేశారు. రిజర్వేషన్ల పెంపుపై చర్చించాల్సిందేనని గట్టిగా పట్టుబట్టారు. దీంతో పార్లమెంట్ ఉభయ సభలు శుక్రవారానికి వాయిదా పడ్డాయి. అనంతరం ఎంపి వినోద్ మీడియాతో మాట్లాడుతూ పార్లమెంటులో ప్రధాని, జైట్లీ , రాజ్ నాథ్ సింగ్ లను ఇదే విషయం పై ఇప్పటికే కలిశాం.. కాని వారు కాలక్షేపం చేస్తున్నారు తప్ప సమస్య పరిష్కారం చేయటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం పార్లమెంటు సెంట్రల్ హాల్ లో అద్వానీని కలసి ఆయన దృష్టికి రిజర్వేషన్ ల సమస్యను తీసుకెళ్ళామని తెలిపారు. తెలంగాణలో 6శాతం ఉన్నఎస్టీల జనాభా రాష్ట్ర విభజన తర్వాత 9శాతానికి పెరిగింది, అందుకే రిజర్వేషన్లు పెంచాలని కోరుతున్నామని వెల్లడించారు. అద్వానీ కూడా సమస్యను అర్థం చేసుకున్నారన్నారు. వైఎస్సార్, టిడిపి అవిశ్వాసానికి మేము అడ్డంకి అని కొంత ప్రచారం చేస్తున్నారు దీన్నిమేము ఖండిస్తున్నామని అన్నారు. మాపై ఎవరు ఎన్ని నిందలు మోపినా తెలంగాణ ప్రజల కోసం పోరాడుతూనే ఉంటామని వినోద్ కుమార్ స్పష్టం చేశారు. టీఆర్ఎస్ మరో ఎంపి సీతారాం నాయక్ మాట్లడుతూ బిజెపి ప్రభుత్వం రిజర్వేషన్లు అంశాన్ని సహృదయంతో అర్థం చేసుకోవాలని కోరారు. మా పోరాటం మా గిరిజనలు కోసం చేస్తున్నామని అన్నారు. మా రాష్ట్రం వరకు మా సమస్య మాకు ముఖ్యం.. అయితే ఎపి సోదరులు వాళ్ల సమస్యల కోసం పోరాడుతున్నారని అన్నారు. రిజర్వేషన్ల పై కేంద్రం వైఖరి ఏంటో స్పష్టంగా తెలియజేయండని ఆయన డిమాండ్ చేశారు. ఎస్టీలు లేని రాష్ట్రాల్లో రిజర్వేషన్ లు ఉన్నాయని.. కానీ ఎక్కువ మంది ఉన్న చోట ఎందుకు పెంచడం లేదని ఆయన ప్రశ్నించారు. గురువారం ఇరాక్ లో ఉగ్రవాదుల చేతిలో చనిపోయిన వారి గురుంచి కేంద్ర మంత్రి సుష్మా స్వరాజ్ ప్రకటన చేస్తున్నప్పుడు మేము ప్లకార్డు దించాం... ఈ విషయాన్ని ఇతర పార్టీలు గమనించాలని ఆయన కోరారు.



పార్లమెంట్ వాయిదాల పర్వం

లోక్ సభలో గురువారం కూడా అవిశ్వాస తీర్మానం పై వాయిదాల పర్వం కొనసాగింది. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం ఆంధ్రప్రదేశ్ ఎంపీలు ఇచ్చిన అవిశ్వాస తీర్మానంపై నిర్ణయం తీసుకోవడానికి సభ సజావుగా లేదనే సాకుతో స్పీకర్ సుమిత్రా మహాజన్ గురువారం కూడా లోక్‌సభను వాయిదా వేశారు. దీంతో వరుసగా ఐదు రోజులు ఎలాంటి కార్యకలాపాలు లేకుండానే లోక్‌సభ వాయిదా పడినట్లయింది.గురువారం ఉదయం11 గం టలకు సభ ప్రారంభం కాగానే అన్నాడీఎంకే, టీఆర్ఎస్ పార్టీల ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లి ప్లకార్డులతో నినాదాలు చేయడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. దాంతో కేవలం 30 సెకన్లకే సభ తొలుత 12 గంటల వరకు వాయిదా పడింది. అనంతరం 12గంటలకు సభ మొదలుకాగా, కేంద్రం తరుపున మంత్రి అనంతకుమార్ మాట్లాడుతూ తాము అవిశ్వాస తీర్మానంపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని, ఇతర అంశాలపై కూడా చర్చకు రెడీ అని చెప్పారు. అయితే, సభలో ప్రతి ఒక్కరు కూర్చోవాలని, స్పీకర్ పోడియం వద్ద ఉన్న వారు వెనక్కి రావాలని, అప్పుడు మాత్రమే చర్చ సాధ్యం అవుతుందన్నారు.ఏ విషయంలోనూ కేంద్రం వెనక్కి వెళ్లబోదని స్పష్టం చేశారు. అయితే, టీఆర్ఎస్, అన్నాడీఎంకే ఎంపీలు ఆందోళన విరమించకపోవడంతో మూడు నిమిషాలపాటు సాగిన సభ శుక్రవారానికి వాయిదా పడింది. రాజ్యసభలో కూడ ఐదోరోజు ఇదే వాతావరణం నెలకొంది.మరోవైపు ప్రతిపక్ష సభ్యుల ఆందోళనల నేపథ్యంలో రాజ్యసభలో కూడ గందరగోళ వాతావరణం నెలకొంది. వైఎస్ఆర్ పార్టీ, కాంగ్రెస్ పార్టీ, టిడిపి, అన్నాడీఎంకె ఎంపీలు దూసుకురావడంతో గం దరగోళం నెలకొంది. దీంతో శుక్రవారానికి వాయిదావేస్తున్నట్టు రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్యనాయు డు ప్రకటించారు. అనంతరం వైఎస్సార్ పార్టీ ఎంపీ విజయసాయిరెడ్డి మాట్లాడుతూ గతంలో ఎపి బిజెపి నేతలు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ లు టీడీపిని బలపరచి అధికారంలోకి తీసుకు వచ్చారు. కాని వారే ఇప్పుడు టిడిపి ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. చంద్రబాబు పోగుచేసిన అవినీతి ధనంపై సీబీఐ విచారణ జరగాలని డిమాండ్ చేస్తున్నాని అన్నా రు. చంద్రబాబు తనంతట తానే సీబీఐ విచారణ చేయించుకొని, అవినీతికి పాల్పడలేదని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. వారంలోగా అవినీతి పై సీబీఐ విచారణకు ఆదేశించుకోపోతే ఆయన అవినీతికి పాల్పడినట్లే అని భావించాల్సి వస్తుందన్నారు.

'అమ్మ'కోసం ఐసియు ఖాళీ

చికిత్స తీసుకున్న రోజులన్నీ సిసిటివిలు ఆఫ్ : అపోలో చీఫ్





చెన్నై: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత 2016 డిసెంబర్ 5న చనిపోవడానికి ముం దు 75 రోజులపాటు సిసిటివిలు అన్నింటిని బంద్ చేసేసినట్లు, 24 బెడ్లున్న ఇంటెన్సివ్ కేర్ యూనిట్(ఐసియు)ను ఖాళీ చేసినట్లు అపోలో ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి గురువారం చెప్పారు. అపోలో ఇంటర్నేషనల్ కొలోరెటల్ సింపోజియం 2018 సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ విష యం చెప్పారు. జయలలిత ఆసుపత్రిలో చేరగానే, మిగతా పేషంట్లను వేరే ఐసియులోకి మార్చామని, ఐసియును ఆమె కు మాత్రమే ఉంచేశామని అన్నారు. 24 ఐసియు గదుల్లో ఒక్కదాన్ని మాత్ర మే ఉపయోగించడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరు చూడకూడదన్నఉద్దేశంతోనే కెమెరాలను తొలగించామన్నారు.జయలలితను కలిసేందుకు కూడా ఎవరిని అనుమతించలేదని చెప్పారు.ఆసుపత్రి ఎంతగానో ప్రయత్నించినప్పటికీ 69ఏళ్ల జయలలితనుకాపాడలేకపోయామనిచెప్పారు. విదేశాలకు చెందిన డాక్టర్లు కూ డా ఆమె చికిత్సలో పాలుపంచుకున్నారన్నారు. ఆమె కోలుకుంటుందనే తామంతా ఆశించామన్నారు. సమన్లు వచ్చాక కమిషన్ ముందు ఆసుపత్రి ప్రతినిధి హాజరుకాగలరని అన్నారు.'మేమన్నీ రిపోర్టులుసమర్పించాం.రోజువారి విషయాలైతే నాకు తెలియవు. వారు (కమిషన్) పిలిస్తే హాజరయ్యేందుకు మేము సిద్ధంగానే ఉన్నా ము' అని ప్రతాప్ సి. రెడ్డి వివరించారు.

ఇరాక్ వధను ఫేస్‌బుక్‌తో కప్పిపుచ్చుతారా?

న్యూఢిల్లీ: తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రభుత్వం ఫేస్‌బుక్ డాటా స్కాండల్‌ను వాడుకొంటోందని కాంగ్రెస్ అధ్యక్షులు రాహుల్ గాంధీ విమర్శించారు.డాటా దుర్వినియోగంలో కాంగ్రెస్ పాత్ర ఉందని తప్పుడు ప్రచారానికి దిగుతోందని మండిపడ్డారు. ఇరాక్‌లో 39మంది భారతీయ కార్మికుల వధ ప్రభుత్వ అసమర్థత అని రాహుల్ చెప్పారు.విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్ మొక్కుబడిగా ఈ ఇరాక్ ఉదంతం గురించి తెలిపారని, ఇదే సమయంలో ఫేస్‌బుక్ డాటా అం శాన్ని తెలివిగా తీసుకువచ్చారని రాహుల్ విమర్శించారు. ఇరాక్‌లో వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఫేస్‌బుక్ వ్యవహారంలో కాంగ్రెస్ పాత్ర ఉందనే కట్టుకథ అల్లారని విమర్శించారు. మీడి యా కూడా అసలు విషయాన్ని వదిలేసి కాంగ్రెస్‌పై దుష్ప్రచారానికి దిగిందని రాహుల్ విమర్శించారు. 39 మంది భారతీయుల ఊచకోత కీలక సమస్య. ప్రభుత్వ అసమర్థత తేటతెల్లం అయింది. అయితే డాటా వ్యవహారానికి కాంగ్రెస్‌కు సంబంధముందనే కట్టుకథతో ప్రభుత్వం భారతీయుల వధను కప్పిపుచ్చిందని రాహుల్ వ్యాఖ్యానించారు. భారతదేశంలో ఎన్నికలను ప్రభావితం చేసే దిశలో ఫేస్‌బుక్ ఖాతాల దుర్వినియోగానికి అవకాశం ఉందని, లండన్‌కు చెందిన ఒక సంస్థ కాంగ్రెస్‌కు సహకరిస్తోందని బిజెపి విమర్శిస్తోంది. దీనిని తిప్పికొడుతూ రాహుల్ గురువారం తీవ్రస్థాయిలో స్పందించారు. లండన్‌కు చెందిన కేంబ్రిడ్జ్ అనాలిటికాతో కాంగ్రెస్ వారు సంప్రదింపులు జరుపుతున్నారని, వారు కోట్లాది మంది ఫేస్‌బుక్ ఖాతాదారుల డాటాను సేకరిస్తున్నారని కేంద్ర ఐటి మంత్రి రవిశంకర్ ప్రసాద్ ఆరోపించారు. తాము పత్రికా స్వేచ్ఛకు కట్టుబడి ఉంటామని అయితే సామాజిక మాధ్యమాన్ని దుర్వినియోగం చేయడాన్ని సహించబోమని హెచ్చరించారు. ఐటితో పాటు న్యాయ శాఖ మంత్రిగా కూడా ఉన్నందున తాను అన్ని అంశాలపై స్పందిస్తున్నానని, అవసరం అయితే ఫేస్‌బుక్‌పై చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. అయితే తమకు బ్రిటన్‌కు చెందిన సంస్థతో ఏ విధమైన సంబంధాలు లేవని కాంగ్రెస్ ప్రతినిధి రణదీప్ సూర్జేవాలా స్పష్టం చేశారు.

కేంద్రంపై రాహుల్ మండిపాటు

శవాలతో రాహుల్ రాజకీయాలు : బిజెపి

ఇరాక్‌లో 39 మంది భారతీయుల వధను కాంగ్రెస్ అధ్యక్షులు రాహుల్ రాజకీయం చేస్తున్నారని బిజెపి విమర్శించింది. ఇరాక్ ఉదంతం దారుణం, జాతికి విషాదం అని, దీనిని రాహుల్ రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటున్నారని కేంద్ర మంత్రి రవిశంకర ప్రసాద్ నిరసన వ్యక్తం చేశారు. బ్రిటన్‌కు చెందిన అనాలిటికాతో తమ పార్టీకి సంబంధం లేదని, ప్రతిపక్ష పార్టీ , గాంధీ (రాహుల్) వారితో సంబంధాలు పెట్టుకుని ఉండి ఉంటారని మంత్రి వ్యాఖ్యానించారు. ఇరాక్‌లో భారతీయుల వధపై ప్రకటన ఇచ్చేందుకు విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ సిద్ధం అయ్యారని తెలిపారు.

ఎన్నికలపై ప్రభావం పడనీయం

- ప్రతిష్ఠ కాపాడుకునేందుకు అన్ని విధాలుగా చర్యలు
- ఇప్పటి వరకు జరిగిన తప్పులకు క్షమాపణలు చెబుతున్నా : ఫేస్‌బుక్ సిఇఒ జుకర్‌బర్గ్



వాషింగ్టన్ /న్యూఢిల్లీ : భారత్‌లో వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికలపై ఫేస్‌బుక్ ప్రభావం పడకుండా అన్ని చర్యలూ తీసుకుంటామని సంస్థ సిఇవో మార్క్ జుకర్‌బర్గ్ తెలిపారు. ఫేస్‌బుక్ వాడకందార్ల సమాచార దుర్వినియోగం చివరికి ఎన్నికల ప్రక్రియను, ప్రచార పర్వాన్ని ప్రభావితం చేస్తోందనే తీవ్రస్థాయి విమర్శలు, కోర్టు వ్యాజ్యాల నేపథ్యంలో ఈ సమాచార మాధ్యమ దిగ్గజం స్పందించారు. ఫేస్‌బుక్‌ను ఫేస్‌బుక్ అధినేతను కోర్టుకు ఈడుస్తామని భారత ప్రభుత్వం హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు జుకర్‌బర్గ్ 'ది న్యూయార్క్ టైమ్స్'తో మాట్లాడారు. తమ ముఖ ప్రతిష్ట కాపాడుకోవడానికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామని ప్రత్యేకించి సమాచార గోప్యత, దుర్వినియోగ నివారణకు అన్ని విధాలుగా సాంకేతిక భద్రతా చర్యలు తీసుకుంటామని జుకర్‌బర్గ్ తెలిపారు. ఫేస్‌బుక్ వాడకందార్ల సమాచార గోప్యత పరిరక్షణలో పొరబాటు జరిగిందని సంస్థ అధినేత మార్క్ జుకర్‌బర్గ్ అంగీకరించారు. కోట్లాది మంది ఖాతాదారుల వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం జరిగిందనే ఆరోపణలపై ఆయన స్పందించారు. పొరపాటు జరిగింది...సారీ ఇక ముందు ఈ విధంగా జరగకుండా చూసుకుంటామని తెలిపారు. ఫేస్‌బుక్ ద్వారా ఇక ముందు ఏ విధమైన తప్పులు దొర్లకుండా అన్ని చర్యలూ తీసుకుంటామని, అమెరికా ఎన్నికలలో జరిగిన అంశాలు ఇండియా, బ్రెజిల్ ఇతర దేశాలలోజరగబోయే కీలక ఎన్నికల సందర్భంగా రిపీట్ కాకుండా అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎన్నికల సమగ్రత ఏ దేశంలోనూ ఫేస్‌బుక్ వల్ల ప్రభావితం కాకుండా చూసుకుంటామని తెలిపారు. బ్రిటన్ సంస్థ అనలిటికా ఫేస్‌బుక్‌కు చెందిన డాటాను భారీ స్థాయిలో దుర్వినియోగపర్చినట్లు, రష్యా ప్రమేయంతో అమెరికా ఎన్నికల ప్రక్రియ ప్రబావితం అయినట్లు, ఇక భారత్‌లో కూడా రాబోయే ఎన్నికలను ప్రభావితం చేసే విధంగా ఫేస్‌బుక్ వాడకం దార్ల డాటా దుర్వినియోగం జరుగుతున్నట్లు వార్తలు వెలువడ్డాయి. ఎన్ని నకిలీ ఖాతాలు ఉన్నాయి? ఏ విధంగా డాటా ప్రభావితం అవుతోందనేది కనుగొనడానికి తాము ప్రత్యేకంగా కృత్రిమ ఇంటలిజెన్స్ టూల్స్ (ఎఐ)ను ప్రవేశపెట్టినట్లు వీటి ద్వారా ఎన్నికల ప్రభావితం, తప్పుడు వార్తలను పసికట్టేందుకు వీలేర్పడుతుందని వివరించారు. 2017 ఫ్రాన్స్ ఎన్నికల సమయంలోనే ఈ విధమైన టూల్స్‌ను తీసుకువచ్చినట్లు ఇప్పుడు తీవ్రస్థాయి ఆరోపణల నేపథ్యంలో వీటిని మరింతగా వాడకంలోకి తీసుకువచ్చి , సమాచార విశ్వసనీయతను పెంచనున్నట్లు స్పష్టం చేశారు. ఇండియాలో విస్తృతస్థాయి ఎన్నికలు ఉన్నాయి. బ్రెజిల్‌లో కూడా భారీ స్థాయి ఎన్నికలు జరుగుతాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని ఫేస్‌బుక్ తగు జాగ్రత్తలు తీసుకుంటుందని తెలిపారు. భద్రతచర్యల కోసం సమాచారం దుర్వినియోగ నివారణ కోసం 20వేలకు పైగా మందిని రంగంలోకి దింపుతామని వీరంతా సమాచారం దుర్వినియోగం కాకుండా చూసుకుంటూ, నకిలీ ఖాతాలను అరికడుతారని తెలిపారు. ఫేస్‌బుక్‌లోని అంశాల సమీక్ష కూడా జరుగుతుందని తెలిపారు. అయితే ఎన్ని చర్యలు తీసుకున్నా పూర్తి స్థాయిలో నియంత్రణ ఉంటుందా? అనే నమ్మకం తనకు లేదని వ్యాఖ్యానించారు. ప్రపంచంలో టెక్నాలజీ అతిగా విస్తరిస్తోందని, ఈ దశలో సరైన విధంగా నియంత్రణ ఉంటుందని చెప్పగలం కానీ పూర్తి స్థాయిలో ఇది ఉంటుందని చెప్పగలమా? అని ప్రశ్నించారు.

వివరణ ఇవ్వడానికి బాధపడడం లేదు

భారీ స్థాయిలో విశ్వాస ఉల్లంఘన జరిగిందని తాను అంగీకరిస్తున్నట్లు ఇందుకు క్షమాపణలు చెపుతున్నట్లు ఆయన వెల్లడించారు. తప్పులు జరిగాయి. యుఎస్ కాంగ్రెస్ ముందు ఫేస్‌బుక్ స్కాండల్‌పై వివరణలు ఇచ్చుకోవల్సి వచ్చినందుకు తానేమీ బాధపడటం లేదని, ఒక విధంగా మనసు తేలికపడిందని తెలిపారు. ఇక ముందు లోపాలు జరగకుండా చూస్తామని ఇందుకు వేలాది యాప్‌ల పనితీరును తీవ్రస్థాయిలో సమీక్షిస్తున్నట్లు ఈ సమాచార టెక్ బాస్ తెలిపారు. భవిష్యత్తులో లోపాలు ఈ విధంగా జరగకుండా డెవలపర్లు, వ్యాపార భాగస్వాములతో కలిసి చర్యలు తీసుకుంటామని ఆయన తాజాగా తమ ఫేస్‌బుక్ ఖాతాలో వివరణతో కూడిన పోస్టు చేశారు. ఫేస్‌బుక్‌ను తాను ప్రారంభించానని , ఈ వేదిక నుంచి ఏ విధమైన తప్పు జరిగినా తను బాధ్యత వహించాల్సి ఉంటుందని , ఈ విధంగా చేయకపోతే తాను సేవలను అందించే అర్హతను కోల్పోయినట్లు అవుతుందని జుకర్‌బర్గ్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 200 కోట్ల మంది ఫేస్‌బుక్ యూజర్లు ఉండగా అందులో భారత్‌నుంచి 20 కోట్ల మంది వరకూ ఫేస్‌బుక్ వాడకందార్లు ఉన్నారు. కేంబ్రిడ్జి అనాలిటికా సంస్థ నకిలీ ఫేస్‌బుక్ యూజర్లతో ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేయడం ప్రపంచ వివాదంగా మారింది.



కొత్తగా కనిపెట్టిన బ్లాక్‌హోల్‌కు హాకింగ్ పేరు

మాస్కో : రష్యన్ వ్యోమగాములు ఓ కొత్త బ్లాక్ హోల్(కృష్ణ బిలం)ను కనుగొన్నారు. దానికి ఇటీవల కన్ను మూసిన ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ పేరునుపెట్టారు. కొత్తగా కనిపెట్టిన బ్లాక్ హోల్ ఓఫికస్ నక్షత్రాలు కూటమిలో ఉన్నట్లు కనుగొన్నారు. సరిగ్గా స్టీఫెన్ హాకింగ్ చనిపోయిన రెండు రోజుల తర్వాత ఈ విషయం కనిపెట్టారు. మాస్కో స్టేట్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు కొంతకాలంగా నక్షత్రాల కూటమిలో గామా కిరణాల పేలుళ్లను(జిఆర్‌బి) పరిశీలిస్తున్నారు. నక్షత్రం కూలిపోవటం వల్లే పేలుడు సంభవించిందని, దాని స్థానంలో బ్లాక్ హోల్ ఏర్పడటానికి పరిస్థితులు దారితీశాయని వెల్లడించారు. ఖగోళ శాస్త్రంలో గామారే పేలుళ్లు చాలా శక్తివంతమైన పేలుళ్లు అని, సుదూరంలో ఉన్న గెలాక్సీలను కూడా అవి మింగేస్తాయని తెలిపారు. పేలుళ్ల సమయంలో విడుదలయ్యే శక్తిని టెలిస్కోపు ద్వారా బంధించడం కూడా దాదాపు అసాధ్యమని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. సెకనులోపదో వంతు నుంచి మిల్లీ సెకండ్ సమయంలో మాయమైపోతాయని చెప్పారు. కానీ అదృష్టవశాత్తు రష్యన్ వ్యోమగాములు ఈ దృశ్యాన్ని బంధింపగలిగారని రష్యన్ టైమ్స్ పత్రిక పేర్కొంది.

రాజా రవివర్మ 'తిలోత్తమ' చిత్రానికి రూ. 5 కోట్లు

న్యూయార్క్: ప్రసిద్ధ చిత్రకారుడు రాజా రవివర్మ శీర్షిక పెట్టకుండా గీసిన తిలోత్తమ పెయింటింగ్ సోథెబీ న్యూయార్క్‌లో చేపట్టిన దక్షిణాసియా ఆధునిక, సమకాలిన చిత్రకళ వేలంలో రూ. 5.17 కోట్లకు అమ్ముడుపోయింది. అత్యధిక అంచనా రూ. 3.90 కోట్లకన్నా ఎక్కువకే వేలంలో అమ్ముడుపోయింది. రవివర్మ హిందూ పౌరాణిక వ్యక్తుల చిత్రాలు అనేకం గీశారు. ఆయన చిత్రాలు లోపరహితంగా, పరిపూర్ణంగా ఉంటాయి. ఆయన చిత్రాలు జాతీయ సంపదగా భారత ప్రభుత్వం 1979లో ప్రకటించింది. ఆయన గీసిన చిత్రాలు జీవం ఉట్టిపడేలా ఉంటాయి. (సుంద, ఉపసుంద రాక్షస సోదరులను చంపేందుకుబహ్మ కోరిక మేరకు తిలోత్తమను సృష్టించడం జరిగింది. ఆ ఇద్దరు రాక్షస సోదరులు తమను స్వయంగా అంతం చేసుకోవాలే తప్ప వేరెవరూ వారిని చంపలేరు. అందగత్తె అయితన తిలోత్తమ కోసం ఆ సోదరులిద్దరూ ఒకరితో మరొకరు పోరుసల్పి అంతమయ్యారు. అలాంటి సౌందర్య రాశి తిలోత్తమ చిత్రాన్ని రవివర్మ బ్రహ్మాండంగా గీసారు. ముగ్గురు టెలిపోన్ల ద్వారా వేలంలో పోటీపడి పాడడంతో రవివర్మ పెయింటింగ్ అత్యధిక ధరకు అమ్ముడుపోయిందని సోథ్‌బీ తెలిపింది.

మాల్దీవుల్లో ఎమర్జెన్సీ ఎత్తివేత



కొలంబో: మాల్దీవుల్లో 45 రోజులుగా కొనసాగుతున్న అత్యవసరపరిస్థితిని ఆ దేశ అధ్యక్షుడు యామీన్ అబ్దుల్ గయూమ్ గురువారం ఎత్తివేశారు. ఈ విషయాన్ని అధ్యక్ష కార్యాలయం వెల్లడించింది. దేశంలో సాధారణ స్థితిని నెలకొల్పాలని భద్రతా శాఖ సల హా ఇవ్వడంతో మాల్దీవుల అధ్యక్షుడు ఎమర్జెన్సీని ఎత్తివేశారు. ప్రతిపక్ష రాజకీయ నేతలను విడుదల చేయాలని కోర్టు ఉత్తర్వులు ఇచ్చాక మాల్దీవుల్లో సంక్షోభం ఏర్పడింది. విమర్శించిన ప్రతిపక్ష నేతలందరినీ జైలుపాలు చేశారు. అత్యవసర పరిస్థితి కాలంలో అధ్యక్షుడి సవతి సోదరుడు, మాజీ నేత మౌమూన్ గయూ మ్, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అబ్దుల్లా సయీద్, న్యాయమూర్తి అలీ హమీద్, నలుగురు శాసనకర్తలను అరెస్టు చేశారు. ప్రభుత్వాన్ని కూలదోయడానికి వారు కుట్రపన్నారన్న అభియోగాన్ని మోపా రు. మాల్దీవులు 2008లో బహుళపార్టీ ప్రజాస్వామ్య దేశంగా ఏర్పడింది.

నక్సలైట్లు అమర్చిన బాంబులు స్వాధీనం

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో నక్సలైట్లు అమర్చినట్లుగా భావిస్తున్న రెండు శక్తివంతమైన ఐఇడి బాంబులను భద్రతా సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. కిష్టారం నుల్లా సమీపంలోని మట్టి రోడ్డులో భద్రతా బలగాలు బుధవారం పెద్ద ఎత్తున చేపట్టిన తనిఖీల్లో ఎనిమిది కేజీలు, ఏడు కేజీల ఐఇడి బాంబులను కనుగొన్నట్లు సీనియర్ పోలీసు అధికారులు తెలిపారు. వారం క్రితం నక్సలైట్లు తొమ్మిది మంది సిఆర్‌పిఎఫ్ సిబ్బందిని చంపిన ప్రదేశానికి కొద్ది మీటర్ల దూరంలోనే బాంబులను కనుగొన్నారు. పేలుడు పదార్థాలను గుర్తించిన వెంటనే బాంబ్ స్క్వాడ్ వాటిని నిర్వీర్యం చేసిందని తెలిపారు. దట్టమైన అడవుల్లో నిర్మాణంలో ఉన్న రోడ్లపైన నక్సలైట్ల బాంబులను అమర్చినట్లు అధికారులు తెలిపారు. నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలను అడ్డుకునేందుకు భద్రతా సిబ్బందిని లక్ష్యంగా ఎంచుకున్నట్లు తెలిపారు.

సాగునీటి ప్రాజెక్టులపై శ్వేతపత్రం



మన తెలంగాణ/హైదరాబాద్: సాగునీటి ప్రాజెక్టులకు అంచనాలు పెరిగేందుకు దారితీసిన కారణాలు, ఇప్పటివరకు పెట్టిన ఖర్చులపై ప్రభుత్వం శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని రైతు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అన్ని జిల్లాల సాగునీటి అవసరాలను తీర్చే విధంగా సాగునీటి విధానం ఉండాలని, రాష్ట్ర జలవిధానాన్ని ప్రకటించాలని వారు కోరారు. ప్రపంచం నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సాగునీటి ప్రాజెక్టులపై రౌండ్ టేబుల్ సమావేశం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో గురువారం జరిగింది. సమావేశానికి రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ అధ్యక్షత వహిచంగా, తెలంగాణ జెఎసి చైర్మన్ ప్రొఫెసర్ ఎం.కోదండరాం, వ్యవసాయ శాస్త్ర వేత్త అరబండి ప్రసాద్, రైతు సంఘాల నాయకులు పశ్య పద్మ, గుర్రం యాదగిరిరెడ్డి (తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం), కె.రంగయ్య (అఖిల భారత రైతు కూలీ సంఘం), అచ్యుత రామారావు (అఖిల భారత రైతు కూలీ సంఘం), టి.సాగర్ (తెలంగాణ రైతు సంఘం), బాబు (ఎంసిపిఐ), బి.గోవింద్ (ఫార్వర్డ్ బ్లాక్), ప్రభాకర్‌రెడ్డి (అడ్వకేట్ జెఎసి) తదితరులు పాల్గొన్నారు. సాగునీటి ప్రాజెక్టుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 24 నుంచి వారం రోజుల పాటు జిల్లాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలను నిర్వహించి, జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలను ఇవ్వాలని, జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నాలు, సాగునీటి సౌకర్యాలపై ఆయా జిల్లాల్లో అవగాహన సదస్సులను ఏర్పాటు చేయాలని రౌండ్ టేబుల్ సమావేశం నిర్ణయించింది. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ సీతారామసాగర్ ప్రాజెక్టు ద్వారా ఖమ్మం, కొత్తగూడెం (పినపాక, భద్రాచలం ప్రాంతాలలో), మహబూబాబాద్ జిల్లాల్లోని ఆయకట్టుకు నీరందించేలా పనులు చేపట్టాలని, ఎస్‌ఎల్‌బిసిని యథాతథంగా పూర్తిచేసి,ఆయకట్టుకు సాగునీరు అందించాలని అన్నారు. కోదండరామ్ మాట్లాడుతూ ప్రాజెక్టుల నిర్మాణంలో నిర్లక్ష్యా న్ని వీడాలని, బడ్జెట్ కేటాయింపులను పూర్తిగా ఖర్చు చేయాలన్నారు.

అవినీతిపరులకు పిఎంఒ గస్తీ కాస్తుందా?



అమరావతి: పోలవరం, పిఎంఒ వ్యవహారాలపైఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో వాడీవేడి చర్చ జరిగింది. ఈ చర్చలో సీఎం చేసిన పలు వ్యాఖ్యలపై భాజపా ఎంఎల్‌సి మాధవ్ అభ్యంతరం వ్యక్తంచేశారు. పునరావాస బాధ్యత కేంద్రానిదేనన్న అం శాన్ని ప్రతిఒక్కరూ గుర్తించాలని మాధవ్ అన్నా రు. పోలవరం విషయంలో కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తోందని చెప్పా రు. దీనిపై సీఎం చంద్రబాబు స్పందిస్తూ పునరావాసంపై జనసేన అధినేత పవన్ ఇష్టానుసారంగా మాట్లాడుతుంటే బిజెపి ఎందుకు తప్పుపట్టలేదని ప్రశ్నించారు. పోలవరంపై కుట్ర జరుగుతోందన్నారు. పిఎంఒ చుట్టూ తిరిగే విజయసాయి రెడ్డి తనను బోనులో పెట్టిస్తానంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎంపీలు పీఎంను కలవొచ్చని బాబు ప్రసంగానికి మాధవ్ అడ్డుతగిలే ప్రయత్నం చేయగా అవినీతిపరులకు పిఎంఒ గస్తీ కాస్తుందా? అని చంద్రబాబు మండిపడ్డారు. అవినీతిపరులతో పిఎంఒలో కాపురం పెట్టుకున్నా తమకేం నష్టంలేదన్నారు. అవినీతి కేసుల్లో ఉన్న వ్యక్తి సీబీఐ మాజీ డైరెక్టర్‌ను కలిస్తే కేసులు పెట్టారనే విషయాన్ని సీఎం గుర్తుచేశారు. తాను, తన కుటుంబం ఎలాంటి అవినీతికి పాల్పడలేదని స్పష్టంచేశారు.

బరువు... బాధలు

- ప్రమాదకరంగా అధిక బరువు, స్థూలకాయం
- రెండేళ్ళకే మానసిక సమస్యలు, బిపి, షుగర్
- విద్యార్థుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- ప్రైవేటు సంస్థ తాజా అధ్యయనంలో వెల్లడి



మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రంలో ప్రతి ముగ్గురు విద్యార్థుల్లో ఒకరు అనారోగ్య సమస్యతో బాధపడుతున్నట్లు 'ఛాయిస్ ఫౌండేషన్', నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఎంపర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటలెక్చువల్ బిజెబులిటి (ఎన్‌ఐఈపిఐడి), ఎల్వీ ప్రసాద్ నేత్ర ఆసుప్రతి సంయుక్తంగా ఇటీవల నిర్వహించిన ఒక సర్వేలో తేలింది.18 ఏళ్లలోపు పిల్లలు బీపీ, మధుమేహం, అంధత్వం, దంత సంబంధ సమస్యలతో బాధపడుతున్నట్లు తేలింది. వెయ్యి మంది విద్యార్థులను సర్వే చేయగా 10 మంది బీపీ, 7 గురు మధుమేహం, 251 మంది కంటి, 40 మంది వినికిడి, 30 మంది ఇతర వ్యాధులతో బాధపడుతున్నట్లు తేలిందని, సంస్థకు చెందిన పిల్లల వైద్యుడు డాక్టర్ సతీష్ పేర్కొన్నారు. 5 ఏళ్లలోపు చిన్నారుల్లో 2.3 శాతం మంది ఊబకాయం,5 ఏళ్ళు దాటిన విద్యార్థుల్లో 31 శాతం మంది బాధపడుతున్నట్లు తేలిందని పేర్కొన్నారు. అతి చిన్న వయస్సులో వచ్చే వ్యాధు లు 20 ఏళ్ల నాటికి తీవ్ర ప్రమాదకరంగా మారే పరిస్థితి ఉందని, చదువులో ఒత్తిడి, టీవీ చూడడం, కంప్యూటర్లు వినియోగించడం, జంక్ ఫుడ్స్ తీసుకోవడం, జీవనశైలి తదితరాలన్నీ ఈ వ్యాధులకు కారణమవుతున్నాయని ఆయన తెలిపారు. చిన్న పిల్లల్లో మానసిక సమస్యలు కూడా ఎక్కువైతున్నట్లు సర్వేలో పాల్గొన్న సైకాలజిస్టు తెలిపారు.చర్మ సంబంధ అలర్జీ, పోషకాహార లోపం, ట్రాన్సిల్, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఈ సర్వే లో తేలిందని పేర్కొన్నారు.గతంలో 25 శాతం మంది అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటుండగా ఇప్పుడు అది 49 శాతానికి చేరిందని పేర్కొన్నారు.పిల్లల ఆరోగ్య విషయంలో తల్లిదండ్రులు, టీచర్లకు అవగాహన కల్పించాల్సిన అవసరముందని పిడియాట్రిక్ డాక్టర్ సతీష్ తెలిపారు. పిల్లలను వ్యాధులను ఎవరూ గుర్తించలేని పరిస్థితి ఉందని, అన్ని పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు.భార్యభర్తలిద్దరూ ఉద్యోగాలు చేయాల్సిన అనివార్యతతో పిల్లలపై వెచ్చించే సమ యం తగ్గుతోందని, మెరుగైన చదువుకోసం ప్రముఖ పాఠశాలలో చేర్పిస్తున్నారని, ట్యూషన్ పేరుతో విద్యార్థులు తీవ్రమైన మానసిక ఒత్తిడి పడుతోందని పేర్కొన్నారు. ఆటపాట తో పాటు వారిలోని సృజనాత్మకతను వెలికితీయడం తగ్గిపోయిందని, చదువు, ర్యాంకు, ఇంగ్లీష్ ప్రావీణ్యంపై మాత్రమే ఎక్కువ దృష్టి సారిస్తున్నారని గుర్తుచేశారు. ఉపాధ్యాయులు సైతం పిల్లల ఆరోగ్య పరిస్థితిని అంచనా వేయలేకపోతున్నారని, చిన్న వయస్సులోనే వ్యాధుల బారిన పడుతున్నారని పేర్కొన్నారు.

విపక్ష నేతలను కలువనున్న కేంద్ర మంత్రి

పార్లమెంట్ ప్రతిష్టంభన తొలగించేందుకు యత్నం

న్యూఢిల్లీ: పార్లమెంటులో ఏర్పడిన ప్రతిష్టంభనను తొలగించేందుకు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి విజయ్ గోయల్ కీలక ప్రతిపక్ష నేతలతో వారి గృహాల వద్దే కలువనున్నారు. అవిశ్వాస తీర్మానాలను కూడా చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఎందుకంటే లోక్‌సభలో ప్రభుత్వానికి మెజారిటీ ఉంది. విపక్ష నేతలు బయట టెలివిజన్‌లో చర్చిస్తున్నారే తప్ప పార్లమెంటులో చర్చించడంలేదని ఆయన అన్నారు. కాంగ్రెస్, ఎఐఎడిఎంకె, టిడిపి, టిఆర్‌ఎస్ సహ ప్రతిపక్ష నేతలను గోయల్ కలువనున్నారు. ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పార్లమెంటును నడిపేందుకు ప్రతినిమిషానికి రూ. 2.5 లక్షలకు పైగా కర్చు చేస్తున్నట్లు చెప్పారు. బడ్జెట్ సమావేశాల రెండో దశలో 23 రోజులున్నాయని, ఇప్పటికే 14 రోజులు వృథా అయిపోయాయని తెలిపారు. పిఎన్‌బి కుంభకోణం, కావేరి బోర్డు, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యే హోదా, రిజర్వేషన్ల కోటా వంటి పలు అంశాలపై విపక్షాలు గందరగోళం సృష్టిస్తుండటంతో ఉభయ సభలు ప్రతిరోజు వాయిదా పడుతున్నాయి. అనేక బిల్లులు ఆమోదం పొందక పార్లమెంటులో పెండింగ్‌లో ఉన్నాయి.

పాక్‌కు చైనా 'మిసైల్ ట్రాకింగ్ సిస్టమ్'



న్యూఢిల్లీ / బీజింగ్ : అత్యాధునిక సాంకేతికతతో అభివృద్ధి చేసిన మిసైల్ ట్రాకింగ్ సిస్టమ్(ఎంటిఎస్)ను చైనా, పాకిస్తాన్‌కు అమ్మినట్లు సమాచారం. దీనికి సంబంధించి హాంకాంగ్‌కు చెందిన దక్షిణ చైనా మార్నింగ్ పోస్టు ఓ కథనాన్ని ప్రచురించింది. చైనా అకాడమీ ఆఫ్ సైన్సెస్(సిఎఎస్)కు కీలక పరిశోధకుడు జెంగ్ మెంగ్వానీ పేరునున కూడా కథనంలో ఊటంకించింది. ఇలాంటి సున్నితమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని మరొక దేశానికి చైనా ఎగుమతి చేయడం ఇదే తొలిసారని జెంగ్ అభిప్రాయపడ్డారు. అయితే ఎంటిఎస్ కోసం పాకిస్తాన్ చైనాకు ఎంత చెల్లించిందన్న దానిపై స్పష్టత లేదు. పాకిస్తాన్ క్షిపణి అభివృద్ధికి చైనా అత్యాధునిక సాంకేతికతను ఇవ్వనున్నట్లు ఆ పత్రిక తన కథనంలో రాసుకొచ్చింది. ఎంచుకున్న లక్ష్యాన్ని కచ్చితంగా తునాతునకలు చేసే సాంకేతికతను బ్రహ్మోస్ క్షిపణి అందుకుందని భారత రక్షణ శాఖ చేసిన ప్రకటన అనంతరం పాక్, చైనాల మధ్య ఈ డీల్ కుదరడం గమనార్హం. బ్రహ్మోస్ ప్రపంచంలో అత్యంత వేగవంతమైన క్రూయిజ్ మిసైల్. దీన్ని రష్యా–భారత్‌లు ఉమ్మడిగా అభివృద్ధి చేశాయి. భూమి, వాయు, జల మార్గాల్లో ఎక్కడి నుంచైనా అతి సులువుగా బ్రహ్మోస్‌ను ప్రయోగించొచ్చు. కాగా, పాకిస్తాన్‌కు ఇచ్చిన సాంకేతికత అసాధారణమైనది చైనా అకాడమీ ఆఫ్ సైన్సెస్(సీఎఎస్) పేర్కొంది. కాగా, అత్యాధునిక ఆయుధాలను చైనా నుంచి పొందడం పాకిస్తాన్‌కు కొత్తేమీ కాదు. గతంలో యుద్ధనౌకలు, యుద్ధ విమానాలు, షార్ట్ రేంజ్ మిస్సైల్స్‌ను చైనా నుంచి పాకిస్తాన్ అందుకుంది.

పురుగు మందుల ధరలపై నియంత్రణ శూన్యం!

- కఠినమైన నిబంధనలు లేవు.. కొన్ని అంశాలలో స్పష్టత కరువు
- ఫెస్టిసైడ్ మేనేజ్‌మెంట్ బిల్లు-2017పై నిపుణుల వ్యాఖ్యలు



మన తెలంగాణ/హైదరాబాద్ : పురుగు మందుల ధరల నియంత్రణపై కనీస ప్రస్తావన లేకుండానే కేంద్రం ఫెస్టిసైడ్ మేనేజ్‌మెంట్ ముసాయిదా బిల్లు2017ను రూపొందించిందని వ్యవసాయ నిపుణులు ఆరోపించారు. త్వరలో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న ఈ ముసాయిదాపై అన్ని రాష్ట్రాల నుంచి కేంద్ర వ్యవసాయశాఖ అభిప్రాయాలు కోరింది. ఇందులో పరిపాలనాపరమైన మార్పులు తప్ప పర్యావరణాన్ని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే విధంగా నిర్దిష్ట అంశాలు లేవని వ్యవసాయ నిపుణులు వ్యాఖ్యానించారు. నాసిరకం, నకిలీ క్రిమి సంహారక రసాయనాలు ధరలను పెంచి ఇష్టారీతిన విక్రయిస్తుండటంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని, వారి ఆరోగ్యం కూడా దెబ్బతింటోందని, ఈ పరిస్థితుల నుంచి రైతులు బయటపడే విధంగా ముసాయిదాలో ఎలాంటి ప్రస్తావనా లేదని వ్యాఖ్యానించారు. మిస్‌బ్రాండెడ్ పురుగు మందులు నిరూపితమైతే రూ. ఒక లక్ష నుంచి రూ. 5 లక్షల వరకు జరిమానా, రెండేళ్ల వరకు జైలు శిక్ష పతుడుందని, అనుమతి లేకుండా దిగుమతి చేసుకున్నా, ఉత్పత్తి చేసినా, అమ్మినా రూ.10 లక్షల నుంచి రూ. 50 లక్షల వరకు జరిమానా, ఐదేళ్ల వరకు శిక్ష విధించనున్నట్లు ముసాయిదాలో పేర్కొన్నప్పటికీ మరింత స్పష్టత ఇవ్వలేదని ఉదహరించారు. వీటిని రుజువు చేయాల్సిన బాధ్యత రైతుల మీదనే ఉండటంతో కంపెనీలకు వెసులుబాటు కల్పించనట్లుగా ఉందని వ్యాఖ్యానించారు. ఇటీవల మహారాష్ట్రంలో పురుగు మందుల ప్రభావంతో 50 మంది రైతులు మృతి చెందిన విషయం తెలిసిందే. విషపూరితమైన రసాయనాల వాడకంతో పర్యావరణం కూడా తీవ్రంగా దెబ్బతింటుంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం క్రిమినాశక పురుగు మందుల నిర్వహణ(ఫెస్టిసైడ్ మేనేజ్‌మెంట్) బిల్లు 2017ను రూపొందించింది.

ముసాయిదాలో కొన్ని ముఖ్యమైన అంశాలు

- ప్రస్తుతం ఉన్న సెంట్రల్ ఇన్‌సెక్ట్‌సైడ్స్ బోర్డు పేరును 'సెంట్రల్ పెస్టిసైడ్స్'గా మార్పు చేశా రు. దీనికి వైద్య సేవల డైరెక్టర్ జనరల్ ఛైర్మన్‌గా ఉండనున్నారు.అలాగే బోర్డులో ఇద్దరు రైతు ప్రతినిధులకుఅవకాశంకల్పించారు.ఇందులోనే ఒక మహిళా రైతు ఉండనున్నా రు.
- ప్రస్తుతం ఎవరైనా పురుగుమందు తయారు చేస్తే రిజిస్ట్రేషన్ వరకు మాత్రమే పరిమితం కాగా ఇకపైన కొత్త బిల్లు ప్రకారం రిజిస్ట్రేషన్ చేశాక కూడా వాటి సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు సమీక్షించనున్నారు. వ్యవసాయ ఉత్పత్తిలో నమోదిత పురుగు మందుల పనితీరును కూడా పర్యవేక్షణ ఉండనుంది.
- మానవులు, జంతువులు, పర్యావరణంపై ఎటు వంటి ప్రభావం చూపనుందో రిజిస్ట్రేషన్ చేసుకునే సమయంలోనే దరఖాస్తులో పేర్కొవాల్సి ఉంటుంది.


అందరికీ కంటి వైద్యం కార్యాచరణ పూర్తి

- నేటి నుంచి సరోజినిదేవి ఆసుప్రతిలో శిక్షణ
- స్క్రీనింగ్ నిర్వహణకు త్వరలోనే చర్యలు



మన తెలంగాణ / హైదరాబాద్ : అందరికి కంటి వైద్యం పథకం త్వరలోనే ప్రారంభం కానుంది. దీనికి సంబంధించిన కార్యచరణ ప్రణాళికను అధికారులు దాదాపుగా పూర్తి చేశారు. ఇందులో ప్రభుత్వ, ప్రైవేటు డాక్టర్లతో పాటు నర్సింగ్ స్టాఫ్, పారామెడికల్ సిబ్బంది, అంగన్‌వాడి,'ఆశా' వర్కర్లను కూడా వినియోగించాలని నిర్ణయం తీసుకున్నారు.ఈ నేపథ్యంలో కంటి వైద్యంపై తగిన అవగాహన లేని నర్సింగ్, పారామెడికల్ సిబ్బందితో పాటు 'ఆశా' కార్మికులకు మౌలిక శిక్షణ కల్పించడంపై కూడా అధికారులు ఒక ఆలోచనకు వచ్చారు. సరోజినిదేవి ఆసుప్రతి ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమాలు కొనసాగనున్నాయి.

విధానమిలా:అందరికీ కంటి వైద్యం నిర్వహించాలని నిర్ణయించామని, మూడు నెలల్లో ఈ పరీక్షలను పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి ఇటీవల ప్రకటించడంతో వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు తీవ్ర స్థాయిలో కసరత్తు చేసి కార్యాచరణ ప్రణాళికను తుదిరూపుకు తీసుకువచ్చారు. కంటి పరీక్షలకు ప్రజా సమీకరణ చాలా ముఖ్యమని భావించిన అధికారులు ఈ బాధ్యతలను హైదరాబాద్‌లాంటి మహానగరాల్లో జీహెచ్‌ఎంసితో పాటు ఇతర జిల్లాల్లో మున్సిపాలిటీలకు అప్పగించగా జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులు, సిబ్బందికి అప్పగించారు. ఆప్తాల్మిక్ అధికారులు నిర్వహించే స్క్రీనింగ్‌కు నర్సింగ్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్మికులు, ఆశా వర్కర్లు సహాయకులుగా ఉంటారు. పరీక్షలను నిర్వహించిన అనంతరం అవసరమైన వారికి కళ్ళజోళ్ళను అందజేసి అపరేషన్ అవసరమైనట్లయితే జిల్లా ఆసుప్రతులకు పంపిస్తారు.క్లిష్టమైన అపరేషన్లు అవసరమైతే వారిని సరోజినిదేవి కంటి ఆసుప్రతికి పం పించేలా అధికారులు ప్రణాళికలను సిద్ధంచేశా రు.



ప్రైవేటు ఆసుప్రతుల సహకారం : అందిరికీ కంటి వైద్యంలో భాగంగా పరీక్షలను నిర్వహించడానికి ప్రభుత్వ పరిధిలో ఉన్న 200 మంది డాక్టర్లతో పాటు ప్రైవేటు ఆసుపత్రుల నుంచి మరో 1000 మంది డాక్టర్ల సేవలను వినియోగించుకోనున్నారు. వైద్య విద్యార్థులను కూడా వినియోగించనున్నారు. అంగన్‌వాడీ, 'ఆశా' వర్కర్లకు సరోజినిదేవి కంటి ఆసుప్రతి ఆధ్వర్యంలో శిక్షణనిస్తున్నట్లు ఆసుప్రతి సూపరింటెండెంట్ డాక్టర్ రవిందర్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం నుంచి ఈ శిక్షణా తరగతులు ప్రారంభమవుతున్నట్లు చెప్పారు. దశల వారీగా 15 రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతాయని ఆయన వివరించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో పనిచేసే డాక్టర్లతో పాటు ఇతర సిబ్బంది కూడా శిక్షణనివ్వనున్నట్లు వివరించారు.

రాశి ఫలాలు



కార్యక్రమాలు కొంత నిరాశ పరుస్తాయి. కష్టానికి ఫలితం కనిపించదు. బంధువులతో అకారణ వైరం. ప్రయాణాలలో మార్పులు. వ్యాపారులకు ఒడిదుడుకులు. ఉద్యోగులకు బదిలీలు. పారిశ్రామికవేత్తలకు పర్యటనలు.



కొత్త వ్యక్తులు పరిచయం. శుభవార్తా శ్రవణం. అదనపు ఆదాయం సమకూరుతుంది. వాహనసౌఖ్యం. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులకు గుర్తింపుతో కూడిన ప్రోత్సాహం. కళాకారుల అంచనాలు నిజమవుతాయి.



కార్యక్రమాలు ముందుకు సాగవు. ఆదాయానికి మించి ఖర్చులు. ఆకస్మిక ప్రయాణాలు. దేవాలయ దర్శనాలు. వ్యాపారులకు గందరగోళ పరిస్థితి. ఉద్యోగులకు మార్పులు అనివార్యం. రాజకీయవేత్తలకు చికాకులు.



కొత్త కార్యక్రమాలు చేపడతారు. ఆప్తులు చేదోడుగా నిలుస్తారు. వాహనసౌఖ్యం. ముఖ్య నిర్ణయాలు. విందులువినోదాలు. వ్యాపారులకు పెట్టుబడులు సమకూరతాయి. ఉద్యోగులు అనుకున్న లక్ష్యాలు సాధిస్తారు. కళాకారులకు ప్రోత్సాహం.



నూతన ఉద్యోగప్రాప్తి. సేవాకార్యక్రమాలలో పాల్గొంటారు. రావలసిన సొమ్ము అందుతుంది. వస్తులాభాలు. వ్యాపారులకు ప్రోత్సాహకరం. ఉద్యోగులు కొన్ని అవరోధాలు అధిగమిస్తారు. పారిశ్రామికవేత్తలకు సన్మానాలు.



ఆదాయానికి మించిమించి ఖర్చులు. కుటుంబంలోసమస్యలు. శారీరక రుగ్మతలు. వ్యాపారులకు చిక్కులు. ఉద్యోగులకు బాధ్యతలు పెరుగుతాయి. కళాకారుల ప్రయత్నాలు నత్తనడకన సాగుతాయి.



ఆప్తులే శత్రువుల్లా మారతారు. ఆలోచనలు స్థిరంగా ఉండవు. ఆదాయం తగ్గి అప్పులు చేస్తారు. దూరప్రయాణ సూచనలు. వ్యాపారులకు లాభాలు కష్టమే. ఉద్యోగులు కొంత ఓపిక వహించాలి. రాజకీయవేత్తలకు పర్యటనల్లో మార్పులు.



పరిస్థితులు అనుకూలిస్తాయి. కార్యక్రమాలలో విజయం. ఆప్తులు, శ్రేయోభిలాషుల నుంచి పిలుపు. సొమ్ము అందుతుంది. వ్యాపారులకు పెట్టుబడులు రాగలవు. ఉద్యోగస్తులకు ఉత్సాహవంతంగా ఉంటుంది. కళాకారులకు కొత్త ఆశలు.



కాంట్రాక్టర్లు, రియల్టర్లకు శుభసూచకాలు. అదనపు ఆదాయం. వస్తులాభాలు. చిన్ననాటి స్నేహితులను కలుసుకుంటారు. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులు సమర్థత చాటుకుంటారు. కళాకారులకు అవార్డులు.



కార్యక్రమాలలో అవాంతరాలు. ఆదాయానికి మించి ఖర్చులు. ఆకస్మిక ప్రయాణాలు. బంధువిరోధాలు. వ్యాపారులకు ఆటుపోట్లు. ఉద్యోగులకు శ్రమాధిక్యం. రాజకీయవేత్తలకు ఆకస్మిక విదేశీ పర్యటనలు.



ముఖ్యమైన కార్యక్రమాలలో ఆటంకాలు. వృథా ఖర్చులు. సోదరులతో కలహాలు. శారీరక రుగ్మతలు, ఔషధసేవనం. వ్యాపారులకు లాభాలు కనిపించవు. ఉద్యోగులు మరింత శ్రమ పడాలి. కళాకారులకు అవకాశాలు చేజారవచ్చు.




కొత్త ఉద్యోగయత్నాలు సానుకూలం. ముఖ్య నిర్ణయాలు తీసుకుంటారు. సోదరులు, సోదరీల నుంచి పిలుపు. స్థిరాస్తి వృద్ధి. వ్యాపారులకు అధిక లాభాలు. ఉద్యోగులు ఉత్సాహంగా గడుపుతారు. పారిశ్రామికవేత్తలకు ఆకస్మిక విదేశీ పర్యటనలు.

షమి మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడలేదు: బిసిసిఐ స్పష్టీకరణ



న్యూఢిల్లీ: షమీ మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడలేదని బిసిసిఐ అవినీతి నిరోధక విభాగం చీఫ్ నీరజ్ కుమార్ వెల్లడించారు. ఈ మేరకు నివేదికను బిసిసిఐకు సమర్పించారు. దీంతో షమీకి ఫిక్సింగ్ ఆరోపణల నుంచి ఊరట లభించడమేకాక, బిసిసిఐ బి–గ్రేడ్ కాంట్రాక్ట్‌ను కూడా పొందారు. ఇకపై షమీపై బిసిసిఐ అవినీతి నిరోధక విభాగం ఎటువంటి విచారణ చేపట్టబోదని నీరజ్‌కుమార్ తెలిపారు. షమీ కాంట్రాక్టు విషయంపై బిసిసిఐ అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ నివేదికతో ఏప్రిల్ 7 నుంచి ప్రారంభమయ్యే ఐపిఎల్‌లో షమీ ఢిల్లీ డేర్‌డెవిల్స్ తరఫున ఆడేందుకు మార్గం సుగమమైంది. ఢిల్లీ డేర్‌డెవిల్స్ ఐపిఎల్ వేలంలో షమీని రూ. 3 కోట్లకు దక్కించుకుందన్నది తెలిసిందే. షమీ పాకిస్థాన్ అమ్మాయి నుంచి డబ్బులు తీసుకున్నాడని అతడి భార్య హసీన్ ఆరోపణ చేయడంతో వివాదం చెలరేగింది. ఈ ఆరోపణపై బిసిసిఐ నిర్వాహకుల కమిటీ విచారణ చేపట్టింది. బిసిసిఐ అవినీతి నిరోధక విభాగం చీఫ్ నీరజ్‌కుమార్ నేతృత్వంలో షమీపై వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు చేపట్టారు. నీరజ్‌కుమార్ ఇచ్చిన నివేదిక ఆధారంగానే షమీకి కాంట్రాక్టును ఇవ్వాలా వద్దా అనేది నిర్ణయిస్తామని బిసిసిఐ ఇదివరకే తెలిపింది. కాగా ఇప్పుడు షమీకి క్లీన్ చిట్ లభించింది.



అభిమానులు ఎంతో ఆతృతతో ఎదురు చూస్తున్న పొట్టి క్రికెట్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2018 సీజన్‌కు ఏప్రిల్ 7న తెర లేవనుంది. ప్రారంభ మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ముంబయి ఇండియన్స్ మాజీ ఛాంపియన్స్ చెన్నై సూపర్ కింగ్స్‌తో తలపడుతుంది. ముంబయిలోని వాంఖడే స్టేడియంలో ఈ మ్యాచ్ జరుగనుంది. ఈ ఏడాది జరుగనున్న ఐపిఎల్ పదకొండో సీజన్‌లో 8 జట్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాయి. అన్ని జట్లలో చాలా మార్పులు జరిగాయి. ఇటీవల జరిగిన వేలం పాటలో చాలా జట్లలో భారీ మార్పులు జరిగాయి. రెండు మూడు జట్లు తప్ప చాలా జట్లు ఈసారి కొత్త ఆటగాళ్లను తీసుకున్నాయి. చాలా కాలంగా కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు సారథిగా ఉన్న స్టార్ ఆటగాడు గౌతం గంభీర్ ఈసారి ఢిల్లీ డేర్‌డెవిల్స్ తరపున ఆడనున్నాడు. అంతేగాక చెన్నై సూపర్ కింగ్స్‌లో కీలక బౌలర్‌గా ఉన్న రవిచంద్రన్ అశ్విన్ ఈసారి కింగ్స్ ఎలెవన్ పంజాబ్‌కు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. కోల్‌కతా కెప్టెన్‌గా స్టార్ వికెట్ కీపర్ దినేశ్ కార్తీక్‌ను నియమించారు. ఈసారి రాజస్థాన్ రాయల్స్ సారథ్య బాధ్యతలను ఆస్ట్రేలియా స్టార్ స్టీవ్ స్మిత్‌కు అప్పగించారు. కాగా, ముంబయి ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ సారథులను మార్చలేదు. ఊహించినట్టే ముంబయికి రోహిత్ శర్మ, చెన్నైకు మహేంద్ర సింగ్ ధోని, సన్‌రైజర్స్‌కు డేవిడ్ వార్నర్, బెంగళూరుకు విరాట్ కోహ్లి కెప్టెన్లుగా వ్యవహరించనున్నారు. –ముంబయి

వాంఖడేలో తొలి పోరు

- మొదటి మ్యాచ్‌లో చెన్నైతో ముంబయి ఢీ
- ఏప్రిల్ 7నుంచి ఐపిఎల్ సందడి

వాంఖడేలో ప్రారంభ వేడుకలు..

మరోవైపు ప్రారంభ వేడుకలకు ముంబయిలోని వాంఖడే స్టేడియం వేదికగా నిలువనుంది. ఏప్రిల్ 7న ఈ వేడుకలు జరుగనున్నాయి. కాగా, ఐపిఎల్ చరిత్రలోనే తొలిసారి ప్రారంభ వేడుకలకు అన్ని జట్ల కెప్టెన్లు హాజరు కావడం లేదు. ఈసారి ప్రారంభోత్సవానికి తొలి మ్యాచ్‌లో తలపడే జట్ల సారథులే హాజరవుతున్నారు. మిగతా జట్ల కెప్టెన్లు ఆరంభ వేడుకలకు దూరంగా ఉండనున్నారు. ఏప్రిల్ 7న ప్రారంభమయ్యే ఐపిఎల్ సమరం మే 27న జరిగే ఫైనల్‌తో ముగుస్తోంది. కాగా ఫైనల్ మ్యాచ్‌కు కూడా ముంబయిలోని వాంఖడే స్టేడియం ఆతిథ్యం ఇవ్వనుంది.

ఫిక్సింగ్‌తో రెండేళ్లు దూరం..

మ్యాచ్ ఫిక్సింగ్ కారణంగా రెండేళ్లుగా ఐపిఎల్‌కు దూరంగా ఉన్న మాజీ ఛాంపియన్లు చెన్నై, రాజస్థాన్ రాయల్స్ జట్లు ఈసారి బరిలోకి దిగనున్నాయి. కిందటిసారి బరిలోకి దిగిన పుణె, గుజరాత్ లయన్స్ జట్లు ఈసారి దూరమయ్యాయి. మొత్తం 8 జట్లు ఐపిఎల్ పదకొండో సీజన్‌లో తలపడనున్నాయి. ముంబయి ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్, ఢిల్లీ డేర్‌డెవిల్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, కింగ్స్ ఎలెవన్ పంజాబ్, సన్‌రైజర్స్ జట్లు ఈసారి బరిలోకి దిగనున్నాయి. కాగా, రెండేళ్ల విరామం తర్వాత బరిలోకి దిగుతున్న చెన్నై టోర్నీకి ప్రత్యేక ఆకర్షణగా మారింది. ధోని సారథ్యంలోని ఈ జట్టుపై అందరి దృష్టి నెలకొంది. ఐపిఎల్‌లోనే అత్యంత ఆదరణ కలిగిన జట్లలో చెన్నైకు అగ్రస్థానం ఉన్న విషయం తెలిసిందే. దీనికి తోడు ధోని సారథిగా ఉండడంతో అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది.

ఢిల్లీ డేర్‌డెవిల్స్‌కు సారథిగా గంభీర్..

ఢిల్లీకి సారథ్యం వహిస్తున్న గంభీర్‌పై కూడా అందరి దృష్టి నిలిచింది. అతను ఢిల్లీ ఎలా ముందుకు నడిపిస్తాడో చూసేందుకు అభిమానులు ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. ఇక, ఇప్పటి వరకు ఒక్కసారి కూడా ఐపిఎల్ ట్రోఫీని గెలవని బెంగళూరు ఈసారైన తన కలను నెరవేర్చుకుంటుందా లేదా అనేది కూడా ఆసక్తి రేకెత్తిస్తోంది. ఇదిలావుండగా ముంబయి, చెన్నై, ఢిల్లీ, కోల్‌కతా, హైదరాబాద్, జైపూర్, పుణె, ఇండోర్, మొహాలి, బెంగళూరు నగరాలు ఐపిఎల్‌కు వేదికగా నిలువనున్నాయి. పుణెలో నాకౌట్ మ్యాచ్‌లు జరుగనున్నాయి. కాగా, కింగ్స్ ఎలెవన్ పంజాబ్ ఈ సీజన్‌లో ఇండోర్‌ను తమ హోమ్ గ్రౌండ్‌గా ఉపయోగించు కోనుంది. ప్రతి ఫ్రాంచైజీ సొంత గ్రౌండ్‌లో ఏడేసి మ్యాచ్‌లు ఆడుతుంది.

తెలుగింట క్రికెట్ పండగ..

హైదరాబాద్ జట్టు అయినా సన్‌రైజర్స్ హైదరాబాద్ ఈ టోర్నీలో మొత్తం 14 మ్యాచ్‌లు ఆడనుంది. మొదటి మ్యాచ్ హైదరాబాద్‌లోని ఉప్పల్ రాజీవ్ గాంధీ స్టేడియంలో ఏప్రిల్ 9న జరగనుంది. ఈ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ జట్టుతో తలపడనుంది. ఆ తరువాత ఏప్రిల్ 12న ముంబయి ఇండియన్స్, ఏప్రిల్ 22న చెన్నై సూపర్ కింగ్స్, ఏప్రిల్ 26న కింగ్స్ లెవన్ పంజాబ్, మే 5న ఢిల్లీ డేర్ డెవిల్స్, మే 7న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, మే 19న కోల్‌కతా నైట్ రైడర్స్‌తో పోరులోకి దిగుతుంది. ఏప్రిల్ 22న జరిగే మ్యాచ్ మినహా అన్ని మ్యాచ్‌లు రాత్రి వేళలో నిర్వహించనున్నారు.

సమతూకంగా సన్‌రైజర్స్ జట్టు



ఈ సారి కూడా ఆస్ట్రేలియా డేర్ అండ్ డాషింగ్ బ్యాట్స్‌మెన్ డేవిడ్ వార్నర్ హైదరాబాద్ జట్టుకు సారథ్యం వహిస్తున్నాడు. వార్నర్ సారథ్యంలోని జట్టు బలంగా సమతూకంగా కనిపిస్తోంది. అంతే కాకుండా హిట్టర్లు శిఖర్ ధవన్, మనీష్ పాండే, యూసఫ్ పఠాన్, వృద్ధిమాన్ సాహా, కేన్ విలియమ్సన్, సందీప్ శర్మతోపాటు మరి కొందరు స్టార్ బ్యాట్స్‌మెన్‌లు జట్టులో ఉన్నారు. అలాగే ప్రపంచ మేటి బౌలర్లయిన భువనేశ్వర్ కుమార్, రషీద్‌ఖాన్‌లు ఉన్నారు. దీంతో ఈ ఐపిఎల్‌లో ఎటువంటి జట్టునైనా ఎదుర్కొని నిలబడే సత్తా సన్ రైజర్స్ ఉందనడంలో సందేహం లేదు. ఇప్పటి వార్నర్ సారథ్యంలోని ఈ జట్టు రెండు సార్లు ఐపిల్ టైటిల్ గెలుపొందింది. కాగా ఐపిఎల్ పదకొండో సీజన్‌లోనూ హైదరాబాద్ జట్టు ఫెవరేట్‌గా బరిలోకి దిగుతోంది.

ముమ్మర ఏర్పాట్లలో హెచ్‌సిఎ..

ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో 2017 సంవత్సరంలో ఒకే ఒక్క అంతర్జాతీయ టి20 మ్యాచ్ (ఇండియా వర్సెస్ ఆస్ట్రేలియా) జరిగింది. అది కూడా వర్షం కారణంగా మ్యాచ్‌కు ముందు వేసే టాస్ కూడా పడకుండానే రద్దయింది. దీంతో క్రికెట్ అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. అంతే కాకుండా కొందరు క్రికెట్ ప్రముఖులు మ్యాచ్ నిర్వాహణపై బిసిసిఐ సరైన చర్యలు తీసుకోలేదని, హెచ్‌సిఎ అధికారులూ నిర్లక్ష్యం చేశారని విమర్శలు గుప్పించారు. భారత జట్టు మాజీ కెప్టెన్ అజారుద్దీన్ హెచ్‌సిఎపై పరోక్షంగా విమర్శలు చేశాడు. దీంతో హెచ్‌సిఎ ప్రతి విమర్శలకు పోకుండా స్టేడియం మరమ్మతుల్లో నిమగ్నమైంది. ఐపిఎల్ మ్యాచ్‌లు అన్నీ సజావుగా సాగేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. సీటింగ్, లైటింగ్స్, భద్రత పరమైన చర్యలను చేపట్టింది. అభిమానులకు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా కావలసిన అన్ని సౌకర్యాలను కల్పిస్తోంది.



టి20 సిరీస్‌లోనూ ఆసీస్‌దే ఆధిపత్యం

- 6 వికెట్ల తేడాతో భారత్ మహిళా జట్టు ఓటమి



ముంబయి: భారత మహిళల క్రికెట్ జట్టు సొంత గడ్డపై పరాజయాల బాట కొనసాగిస్తోంది. ఇటీవల ఆసీస్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో వైట్‌వాష్‌కు గురైన భారత మహిళా జట్టు టి20 సిరీస్‌ను కూడా పేలవంగా ఆరంభించింది. ముక్కోణపు టి20 సిరీస్‌లో భాగంగా ఆసిస్‌తో గురువారం ఇక్కడ జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ ఆరు వికెట్ల తేడాతో పరాజయాన్ని మూటకట్టుకుంది. ఓపెనర్ స్మృతి మంధన మరోసారి తన శైలిలో రాణించింది. 41 బంతులకు 67 పరుగులు చేసింది. అంతేకాక భారత్ 20 ఓవర్లలో 152 స్కోరు చేయడానికి తోడ్పడింది. దీనికి సమాధానంగా ఆసీస్ జట్టు 18.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. ప్రముఖ క్రికెట్ క్రీడాకారిణి ఝులాన్ గోస్వామి 30 పరుగులిచ్చి 3 వికెట్లు తీసుకుంది. అయితే ఆమెకు తోడుగా మరెవరూ అంతగా వికెట్లు తీయలేకపోయారు. శిఖా పాండే 2 ఓవర్లలో ఒక్క వికెటు తీయకుండానే 25 పరుగులు ఇవ్వగా, రుమేలి ధార్ 2.1 ఓవర్‌లో ఒక్క వికెటు తీయకుండానే 28 పరుగులిచ్చింది. భారతీయ బౌలర్లు వేసిన బంతులకు ఆసీస్ బ్యాట్స్‌విమెన్ 21 ఫోర్లు, సిక్సరు బాదేశారు.

ఒకానొక సమయంలో ఆస్ట్రేలియా మహిళా జట్టు చిక్కులో పడింది. ఆసీస్ జట్టు 153 లక్ష్య ఛేదనలో ఉండగా ఝులన్ గోస్వామి తన తొలి, మూడో ఓవర్లో 2 వికెట్లు తీసుకుని 29 పరుగులిచ్చినప్పుడు ఆస్ట్రేలియా జట్టు తడబడింది. వికెట్‌కీపర్ కమ్ ఓపెనర్ అలిస్సా హీలి(4), అష్లీఘ్ గార్డనర్(15)ను గోస్వామి ఔట్ చేసింది. కానీ మరో ఓపెనర్ బేత్ మూనీ(32 బంతుల్లో 45 పరుగులు)ని నిరోధించలేక పోయింది. బేత్ మూనీ ఫాస్ట్ బౌలింగ్, స్పిన్ బౌలింగ్ రెండింటినీ ఉతికిపారేసింది. ఆమెకు తగిన జోడిగా విల్లనీ(33 బంతుల్లో 39 పరుగులు) నిలబడింది. మూడో వికెట్ నష్టానికి వారు 79 పరుగులు జోడించారు. ఒకరి తర్వాత మరొకరన్నట్లు వారు స్ట్రయికులు కొట్టారు. లూజ్ బాల్స్‌నైతే బౌండరీలు దంచేశారు. మూనీ ఎనిమిది బౌండరీలు, విల్లనీ నాలుగు హిట్లు దంచేసింది. విజృంభించి ఆడుతున్న మూనీని తన రెండో స్పెల్‌లో గోస్వామి ఔట్ చేసింది. ఆమె కొట్టిన బంతిని శిఖాపాండే పట్టుకుంది. కానీ అప్పటికే ఆస్ట్రేలియా మహిళా జట్టు 13 ఓవర్లకు 108 పరుగులకు చేరుకుంది. ఆ తర్వాతి ఓవర్లోనే లెగ్‌స్పిన్నర్ పూనమ్ యాదవ్ తాను వేసిన బౌలింగ్‌లోనే విల్లనీని క్యాచౌట్ చేసింది. తర్వాత మళ్లీ వికెట్లు పడిపోకుండా కెప్టెన్ మేగ్ లాన్నింగ్(నాటౌట్‌గా 25 బంతుల్లో 35 పరుగులు), రేచల్ హేనెస్(నాటౌట్‌గా 12 పరుగులు) నిలదొక్కుకుని ఆడారు. ఇంకా 11 బంతులుండగానే లక్ష్య ఛేదన చేశారు. వన్డేల్లో పెద్దగా స్కోరు చేయని లాన్నింగ్ టి20లో నాలుగు బౌండరీలు, ఒక సిక్సర్ కొట్టి తన సత్తాను చాటుకుంది. దీనికి ముందు భారత్ తరఫున మంధన 11 బౌండరీలు, రెండు సిక్సర్లు దంచినప్పటికీ భారత్ గెలవలేకపోయింది. ఆమెకు మిథాలీ రాజ్(27 బంతుల్లో 18 పరుగులు) సరిజోడిగా నిలిచినప్పటికీ విజయం సాధించలేకపోయింది. వారిద్దరూ కలసి 9.3 ఓవర్లలో 72 పరుగులు జోడించారు.

మంధన తన టి20 క్రికెట్ కెరీర్‌లోనే అత్యుత్తమంగా ఆడిందని చెప్పాలి. మైదానం నలుమూలలకు షాట్లు కొట్టిపారేసింది. మిథాలీ రాజ్ తన తొలి ఓవర్‌ను మెయిడెన్‌గా ముగించినప్పటికీ మంధన జట్టుకు కావలసిన ఊపునిచ్చింది. స్పిన్నర్ గార్డనర్ వేసిన రెండో ఓవర్లో రెండు ఫోర్లు దంచేసింది. తర్వాత లెఫ్ట్ ఆర్మ్‌స్పిన్నర్ జెస్ జోనాస్సెన్ వేసిన ఓవర్లో రెండు ఫోర్లు, ఒక సిక్సర్ బాదేసింది. కేవలం 30 బంతుల్లో మంధన తన అర్ధ శతకాన్ని పూర్తి చేసింది. మిథాలీ రాజ్ స్టాండింగ్ బ్యాట్స్‌ఉమెన్‌గా(సెకండ్ ఫిడిల్) ఉండగా మంధన థర్డ్ మ్యాన్ గుండా సిక్సర్‌ను దంచింది. 10వ ఓవర్లో మిథాలీ రాజ్ ఔటయ్యాక కూడా మంధన తన జోరును కొనసాగించింది. దాంతో ఆస్ట్రేలియా మహిళా జట్టు పట్టుబిగించింది. త్వరితంగా రెండు వికెట్లు తీసుకుంది. జెమీమా రోడ్రిగ్స్(1) షార్ట్ డెలివరిలో ఔటవ్వగా, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(13) చెత్తషాట్ కొట్టబోయి ఔటయింది. అతిథిలా వచ్చిన అనుజ పాటిల్ (21 బంతుల్లో 35 పరుగులు) 140 ప రుగుల మార్క్‌ను దాటేలా చేసింది. చివరికి భారత్ 5 వికెట్ల నష్టానికి 152 పరుగులు చేసింది. ఆసీస్ జట్టు పై భారత్ మహిళా జట్టు చేసిన అత్యధిక స్కోరు ఇదే. ఆస్ట్రేలియా మహిళాజట్టు టి20 సిరీస్‌లో రెండో గేమ్ ను శుక్రవారం ఇంగ్లాండ్ మహిళాజట్టుతో ఆడనున్నది.

క్లుప్తంగా స్కోరు: భారత మహిళా జట్టు: 152/5(20 ఓవర్లు); ఆస్ట్రేలియా మహిళా జట్టు: 156/4(18.1 ఓవర్లు)

తొలి రోజు సఫారీ సవారీ

ఆస్ట్రేలియాతో మూడో టెస్టు



కేప్‌టౌన్: న్యూలాండ్స్‌లో గురువారం జరిగిన మూడో టెస్టు తొలి రోజున దక్షిణాఫ్రికా క్రికెటర్ డీన్ ఎల్గర్ లంచ్ బ్రేక్‌కు ముందు, తర్వాత కూడా రెండు అర్ధశతకాలు చేశాడు. రెండో వికెట్ నష్టానికి అతడు హాషీం ఆమ్లాతో కలసి 86 పరుగులు జోడించాడు. టీ విరామ సమయానికి ఎబి డి విలియర్స్‌తో కలసి అజేయంగా 93 పరుగుల భాగస్వామ్యాన్ని నిలిపి దక్షిణాఫ్రికా జట్టు స్కోరును 2 వికెట్ల నష్టానికి 185కు తీసుకెళ్లాడు. ఆస్ట్రేలియా జట్టు ఎత్తుగడలను మార్చుకుని రెండో సెషన్‌లో ఆమ్లా వికెట్‌ను తీసుకుంది. హాజల్‌వుడ్ వేసిన షార్ట్ డెలివరిని కొట్టి ఫైన్‌లెగ్‌లో ప్యాట్ కమ్మిన్స్‌కు క్యాచిచ్చాడు ఆమ్లా. హాజల్‌వుడ్ తన బౌలింగ్‌లో లైయన్‌ను ఔట్ చేసి మూడో వికెట్ తీసుకున్నాడు. కట్ షాట్ కొట్టబోయి అతడు క్యాచౌట్ అయ్యాడు. తర్వాత డి విలియర్స్ తన పద్ధతిలో బౌండరీలు కొట్టడం ఆరంభించాడు. ఎల్గర్ కూడా షాట్లు దంచేశాడు. మూడో వికెట్ తర్వాత నిలిచిన ఈ జోడి ఆట అందరినీ ఆకర్షించింది. ఆస్ట్రేలియా తన షార్ట్ బాల్ ఎత్తుగడను కొనసాగించింది. అయినప్పటికీ ఎల్గర్ నిలదొక్కుకుని ఆడాడు. డి విలియర్స్‌తో కలసి దక్షిణాఫ్రికా పటిష్ట స్థితికి చేరుకునేలా చేశాడు. త్వరితంగా తమ భాగస్వామ్యంలో అర్ధ శతకాన్ని చేశాడు. ఎల్గర్ అజేయంగా టెస్టులో 3000 పరుగులను పూర్తిచేశాడు.

దక్షిణాఫ్రికా మొదటి ఇన్నింగ్స్: 266/8(87.0 ఓవర్లు)

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.